www.prajasakti.com
PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 39 Vol సంచిక : 09 No | విజయవాడ, బుధవారం 09 జనవరి 2019 | 12 + 12 పేజీలు వెల : 4.00 Rs.

ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడి ఆకస్మిక రాజీనామా

- కొత్త అధ్యక్షుడిగా క్రిస్టాలినా జార్జియేవా!



9

3,648 కి.మీలు.. 2,516 గ్రామాలు



శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో జగన్ ఆవిష్కరించనున్న విజయ స్థూపం

- నేటితో ముగియనున్న జగన్ పాదయాత్ర
- ఇచ్ఛాపురంలో వైసిపి బహిరంగ సభ
- అభ్యర్థుల ప్రకటన లేనట్టే..

2

ఇబిసి

బిల్లు ఆమోదం

- లోక్‌సభ నిరవధిక వాయిదా
- అనుకూలం 323... వ్యతిరేకం ముగ్గురు
- ఎన్నికల లబ్ధికే : ప్రతిపక్షాల విమర్శ
- సెలెక్ట్ కమిటీకి పంపండి : సిపిఎం
- ఎఐఎడిఎంకె వాకౌట్
- సస్పెన్షన్‌తో టిడిపి దూరం

న్యూఢిల్లీ : అగ్రవర్ణ పేదల (ఇబిసి)కు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 124వ రాజ్యాంగ సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఈ సవరణ ద్వారా రిజర్వేషన్ల కల్పనకువీలుగా రాజ్యాంగంలోని 15వ అధికరణానికి అదనంగా మరో క్లాజ్ చేర్చాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. దీనిపై దాదాపు 4.30 గంటల పాటు చర్చ సాగింది. అనంతరం సభ్యులు ప్రతిపాదించిన సవరణలపై డివిజన్ పద్ధతిలో స్పీకర్ సుమిత్రామహాజన్ ఓటింగ్ నిర్వహించారు. బిల్లుకు అనుకూలంగా 323 మంది, వ్యతిరేకంగా ముగ్గురు ఓటు వేశారు. తెలుగుదేశం పార్టీ ఎంపిలపై సస్పెన్షన్ వేటు పడిన విషయం తెలిసిందే. దీంతో చర్చకు. ఓటింగ్‌కు టిడిపి దూరమైంది. ఎఐఎడిఎంకె సభ్యుల్లో ఒక్కరు మినహా మిగిలిన అందరు సస్పెన్షన్‌లో ఉన్నారు. సభలో ఉన్న ఆ పార్టీ సభ్యుడు తంబిదురై బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించిన అనంతరం వాకౌట్ చేశారు. బిల్లుకు ఆమోదం లభించడంతో లోక్‌సభ నిరవధికంగా వాయిదా పడింది. బుధవారం రాజ్యసభలో ఇబిసి బిల్లును ప్రవేశపెట్టనున్నారు. దీనికోసం రాజ్యసభ పనిదినాలను పొడిగించారు. బిల్లుపై చర్చను ప్రారంభించిన కేంద్ర మంత్రి తవార్‌చంద్ గెహ్లాట్ దీనిని చారిత్రాత్మకంగా అభివర్ణించారు. ఇటువంటి రిజర్వేషన్లు కోరుతూ ఇప్పటికే 21 సార్లు ప్రైవేటు సభ్యులు బిల్లులు ప్రవేశపెట్టారన్నారు. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ మాట్లాడుతూ దాదాపు అన్ని రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోలో ఈ రిజర్వేషన్ల గురించి పేర్కొన్నాయన్నారు. ప్రాథమిక హక్కులకు సంబంధించిన అంశాలపై రాష్ట్రాల ఆమోదం అవసరం లేదన్నారు.

ప్రభుత్వం తొందర పడింది : కె.వి. థామస్

కాంగ్రెస్ సభ్యుడు కె.వి. థామస్ మాట్లాడుతూ ఈ బిల్లును కేబినెట్ సోమవారం ఆమోదించిందని, ఆ వెంటనే మంగళవారమే చర్చకు వచ్చిందని

మిగతా 9లో



శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థి ఆత్మహత్య

- ప్రిన్సిపల్ వేధింపులే కారణం

2



సార్వత్రిక సమ్మె సందర్భంగా విజయవాడలో జరిగిన భారీ ర్యాలీ

సమరోత్సాహంతో సమ్మె

- దేశవ్యాప్తంగా 20 కోట్ల మంది శ్రామిక జనగర్జన
- స్థంభించిన ఉత్పత్తి, రవాణ, బ్యాంకింగ్ రంగాలు
- కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు నిరసనల హోరు
- బెంగాల్‌లో ఉద్యమకారులపై తృణమూల్ దమనకాండ
- నేడు గ్రామీణ భారత్ బంద్

మరిన్ని వార్తలు 3,8లో..

ప్రజాశక్తి - యంత్రాంగం

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక, జాతి వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 10 కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు రెండు రోజుల సార్వత్రిక సమ్మె మంగళవారం సమరోత్సాహంతో ప్రారంభమైంది. బుధవారం కూడా సమ్మె కొనసాగనుంది. సంఘటిత, అసంఘటిత రంగాలకు చెందిన దాదాపు 20 కోట్ల మంది పైగా శ్రామికులు మంగళవారం నాటి సమ్మెలో దేశవ్యాప్తంగా భాగస్వామ్యమైనారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ప్రధాన నగరాలు, పట్టణాల్లో భారీ ప్రదర్శనలు నిర్వహించారు. శ్రామికజనావళికి సంఘీభావంగా అనేక ప్రాంతాల్లో మేము సైతం అంటూ రైతులు, వ్యవసాయ కార్మికులు, మహిళలు, విద్యార్థులు, యువత ప్రదర్శనలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లో లక్షలాదిమంది సమ్మెలో పాల్గొన్నారు. అనేకచోట్ల భారీ ప్రదర్శనలు సాగాయి. అసోం, ఒడిషా, కర్నాటకలోని పలు జిల్లాలు, ఈశాన్య రాష్ట్రాలతో సహా అనేక ప్రాంతాల్లో బంద్ తరహా వాతావరణం కనిపించింది. కేరళ, కర్నాటక, మహారాష్ట్ర, బీహార్, హర్యానా, పంజాబ్, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్, జమ్మూకాశ్మీర్ రాష్ట్రాల్లో రవాణా స్తంభించింది. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం, త్రిపురలో బిజెపి సర్కార్ కార్మికులపై అణిచివేత చర్యలకు పాల్పడినా ప్రజలు స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొన్నారు. బెంగాల్‌లో తృణమూల్ గూండాలు, పోలీసులు జరిపిన దాడుల్లో 110 మంది పైగా ఉద్యమకారులు గాయపడ్డారు. వేలాది మందిని అదుపులోకి తీసుకున్నారు. తొలి రోజు సమ్మెను సంపూర్ణంగా జయప్రదం చేసిన కార్మిక లోకానికి సిఐటియు అభినందనలు తెలియచేసింది.



రాజ్యాంగ సవరణకు ముందు విస్తృత సంప్రదింపులు అవశ్యం

ఇబిసి రిజర్వేషన్లపై సిపిఎం పొలిట్‌బ్యూరో ఎన్నికల్లో లబ్ది కోసమేనని వ్యాఖ్య

న్యూఢిల్లీ : అగ్ర వర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి 10శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం ఎన్నికల ప్రయోజనం కోసం తప్ప మరొకటి కాదని సిపిఎం పొలిట్‌బ్యూరో పేర్కొంది. పార్లమెంట్ సమావేశాలు మరో రోజులో ముగియబోతున్నాయనగా రాబోయే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో వుంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నారని విమర్శించింది. ఈ చర్యతో, గత నాలుగున్నరేళ్ళలో ఉపాధి కల్పించడంలో ఘోరంగా విఫలమైనట్లు మోడీ ప్రభుత్వం అంగీకరించినట్లేనని పేర్కొంది. మండల్ కమిషన్ సిఫార్సులు వెలువడినప్పటి నుండి ఈ రిజర్వేషన్ల అంశం చర్చల్లోనే వుంది. ఇటువంటి చర్య తీసుకోవడం అవసరమని సిపిఎం ఆనాటి నుండి చెబుతూనే వస్తోంది. అయితే ప్రస్తుతం కేంద్ర మంత్రివర్గం ఎవరితో ఎలాంటి చర్చలు, సంప్రదింపులు లేకుండానే ఈ నిర్ణయం తీసుకుందని పొలిట్‌బ్యూరో విమర్శించింది. పైగా, వార్షికాదాయం 8 లక్షల్లోపు వున్నవారు మాత్రమే ఈ రిజర్వేషన్ల లబ్ధిదారులని పేర్కొనడం చూస్తుంటే నిజమైన లబ్దిదారులు ఈ రిజర్వేషన్ల ప్రయోజనాలు పొందుతారా లేదా అనే ప్రశ్న తలెత్తుతోందని సిపిఎం పేర్కొంది. నెలకు రు.18 వేలు అంటే ఏడాదికి రు.2.16లక్షల కనీస వేతనానికి హామీ కల్పించాలని డిమాండ్ చేస్తూ రెండు రోజుల సార్వత్రిక సమ్మె జరుగుతోంది. ఈ ప్రభుత్వం చివరకు ఇది కూడా ఇవ్వడం లేదని ఆ ప్రకటన విమర్శించింది.

ఇన్నేళ్ళూ రిజర్వేషన్లపై మోడీ సర్కార్ ఎలాంటి చర్య తీసుకోలేదు. కానీ ప్రస్తుతం మంత్రివర్గం నిర్ణయం తీసుకున్న సమయం చూస్తుంటే ఎన్నికల వేళలో ప్రజల మద్దతు కూడగట్టుకునేందుకు మోడీ సర్కార్ నిరాశా నిస్పృహలతో చేస్తున్న ప్రయత్నంగా కనిపిస్తోందని పేర్కొంది. ఇటీవల ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం తర్వాత విజయావకాశాలను పెంపొందించుకోవడమే ప్రభుత్వ లక్ష్యంగా వుందని పేర్కొంది. ఈ రిజర్వేషన్లను అమలు చేయాలంటే

మిగతా 9లో

మోడి సర్కార్‌కు భంగపాటు

- సిబిఐ డైరెక్టర్‌గా అలోక్ వర్మ : సుప్రీం ఆదేశం
- ప్రధాని రాజీనామాకు ప్రతిపక్షాల డిమాండ్



న్యూఢిల్లీ : సిబిఐ డైరెక్టర్‌గా అలోక్ వర్మను తిరిగి నియమించా లని, ఆయనకు వెంటనే బాధ్యతలు అప్పగించాలని సుప్రీం కోర్టు మంగళవారం సంచలన తీర్పు వెలువరించింది. ఈ తీర్పుతో మోడీ సర్కార్‌కు పెద్ద ఎదురు దెబ్బ తగిలినట్లయింది. తీర్పు వెలువడిన తర్వాత ప్రధాని మోడీ రాజీనామా చేయాలని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. కాగా తమ నిర్ణయం సరైనదేనని ప్రభుత్వం సమర్థించుకుంటూ, దీన్ని సుప్రీం కోర్టు 'భిన్న దృక్కోణం'లో విశ్లేషించిందని వ్యాఖ్యానించింది. కేంద్ర ప్రభుత్వం గత అక్టోబరు 23 అర్ధరాత్రి సిబిఐ డైరెక్టర్ అలోక్ వర్మను సెలవుపై పంపిన సంగతి తెలిసిందే. అలోక్ వర్మను విధుల నుండి తప్పించాలని సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ కేంద్ర ప్రభుత్వానికి చేసిన సిఫార్సులను సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల ధర్మాసనం తప్పుపట్టింది. అలోక్‌వర్మకు తిరిగి బాధ్యతలు అప్పగించాలని ఆదేశించింది. అయితే సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ ఇచ్చిన విచారణ నివేదిక ప్రాతిపదికగా సెలక్ట్ కమిటీ తన నిర్ణయాన్ని ప్రకటించే వరకు అలోక్ వర్మ విధానపరమైన నిర్ణయాలు తీసుకోకూడదని కోర్టు ఆదేశించింది. ప్రధాన మంత్రి, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి, ప్రతిపక్ష నేత సెలక్ట్ కమిటీ సభ్యులుగా వున్నారు.

ఈ కమిటీ వారంలోగా సమావేశమై నిర్ణయాలు తీసుకోవాలని పాదేశించింది. సిబిఐ చీఫ్ వర్మకు, అతని డిప్యూటి రాకేష్ అస్తానాకు మధ్య అధికారాల పరిధిపై విభేదాలు తలెత్తిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే జాయింట్ డైరెక్టర్ ఎం. నాగేశ్వరరావును సిబిఐ తాత్కాలిక డైరెక్టర్‌గా నియమించారు. తనను విధుల నుండి తప్పించి సెలవుపై పంపడాన్ని వర్మ సుప్రీం కోర్టులో సవాల్ చేశారు. సిబిఐ డైరెక్టర్ రెండేళ్ళపాటు అధికారంలో ఉండాలన్న నిబంధనను ఉల్లంఘించి తనను విధుల నుండి తప్పించారని పేర్కొంటూ అలోక్ వర్మ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇదే కేసులో కామన్ కాజ్ అనే స్వచ్ఛంద సంస్థ కూడా మరో పిటిషన్‌ను దాఖలు చేసింది. సిబిఐ డైరెక్టర్‌గా

మిగతా 9లో

రెవెన్యూ పార్ట్ టైం ఉద్యోగులకు జీతాలు పెంపు

నెలకు అదనంగా 5వేలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రెవెన్యూశాఖలో పార్ట్ టైం సహాయ గ్రామ రెవెన్యూ అధికారుల(పార్ట్ టైం అసిస్టెంట్స్) జీతాలు పెంచుతూ ప్రభుత్వం జీఓ 10ను మంగళవారం జారీ చేసింది. రూ.10వేలు పారితోషికంపై పనిచేస్తున్న ఉద్యోగులకు ఇప్పటి నుంచి రూ.15వేలకు పెరుగుతుంది. ప్రభుత్వం జీతాలు పెంచడం పట్ల ఏపి రెవెన్యూ అసోసియేషన్, గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం, ఎపి విఆర్ఓల సంఘం నేతలు ఒక ప్రకటనలో హర్షాన్ని వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

పార్ట్‌టైం లెక్చరర్లకు వేతనం పెంపు

ఇంటర్మీడియేట్ వొకేషనల్ విద్యలో పార్ట్ టైం లెక్చరర్ల వేతనాన్ని రాష్ట్రప్రభుత్వం పెంచింది. ప్రస్తుతం గంటకు రూ.150లు ఇస్తున్న వేతనాన్ని రూ.375లకు పెంచుతున్నట్లు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్య నాథ్ దాస్ మంగళవారం జీవో 8ను విడుదల చేశారు.

ప్రైవేటుకు లాభాలు- ప్రజలకు ఛార్జీలు

- నవ్యాంధ్రలో ఇంధన ప్రగతి ఇదే

2



కాపు, వాల్మీకుల రిజర్వేషన్లు తేల్చాకే మద్దతు



కర్నూలు జిల్లా ఓర్వకల్లులో విమానాశ్రయానికి రిబ్బన్ కట్‌చేసి ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

- ఎన్నికల్లో లబ్ధి కోసమే 10% రిజర్వేషన్
- ముఖ్యమంత్రి చంద్రబాబు
- కర్నూలు విమానాశ్రయం ప్రారంభం
- మార్చి నుంచి రెగ్యులర్ విమాన సర్వీసులు

9



నూతన రాజకీయ ప్రత్యామ్నాయం అవసరం

సిపిఎం, సిపిఐ, జనసేన నేతల భేటిలో నిర్ణయం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విజయవాడలోని జనసేన రాష్ట్ర కార్యాలయంలో సిపిఐ(ఎం), సిపిఐ, జనసేన నేతల మధ్య జరిగిన సమావేశంలో వర్తమాన రాజకీయ పరిణామాలపై చర్చ జరిగింది. రాష్ట్రంలో నూతన రాజకీయ ప్రత్యామ్నాయాన్ని ప్రజల అభీష్టాలకనుగుణంగా రూపొందించాల్సిన అవసరం ఉందని సమావేశం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో జనసేన వామపక్ష పార్టీల నడుమ ఎన్నికల పొత్తును ఏ విధంగా సాకారం చేయ్యాలో, సీట్ల సర్దుబాటు ఏ పద్ధతిన జరగాలో ఖరారు చేసేందుకు వీలైనంత త్వరలో తిరిగి సమావేశం కావాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి

మిగతా 9లో

జెపి రిపోర్టు శ్వేతపత్రాల్ని బలపరిచింది

ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు కుటుంబరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం, హామీలపై రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రంలోని అంశాలను లోక్ సత్తా అధ్యక్షుడు జయప్రకాశ్ నేతృత్వంలోని కమిటీ ఇచ్చిన నివేదిక బలపరిచిందని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు కుటుంబరావు అన్నారు. మంగళవారం సచివాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెనుకబడిన జిల్లాలకు ఇవ్వాల్సిన రూ.750 కోట్లు తక్షణమే చెల్లించాలని ప్రధాని మోడీ అధ్యక్షుడుగా ఉన్న నీతి అయోగ్ స్పష్టం చేసిందన్నారు. జెపి ప్రధాన కార్యదర్శిగా ఏర్పాటైన ఫౌండేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్ విడుదల చేసిన నివేదిక ప్రకారం ఏపికి రూ.85 కోట్లు చెల్లించాలని తెలిపారు. ప్రభుత్వం కూడా శ్వేతపత్రంలో రూ.90 కోట్లు ఇవ్వాలని చెప్పిందన్నారు. ఈ రెండింటి లెక్కలతో కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అన్యాయం బట్టబయలయ్యిందన్నారు. వెనుకబడిన ప్రాంతాలకు రూ.24 వేల కోట్లు ఇవ్వాల్సి ఉండగా, కేంద్రం రూ.1050 కోట్లు మాత్రమే మంజూరు చేసిందన్నారు.



మృతి చెందిన విద్యార్థి నాగర్జున సాయిబాబారెడ్డి.

శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థి ఆత్మహత్య

ప్రిన్సిపల్ వేధింపులే కారణం

ప్రజాశక్తి-కంచికచర్ల

ప్రిన్సిపల్ మందలించారనే మనస్థాపంతో పాఠశాల భవనంపై నుండి దూకి ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కృష్ణాజిల్లా కంచికచర్లలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో మంగళవారం ఉదయం జరిగింది. వీరులపాడు మండలం కొణతాలపల్లికి చెందిన శీలం నాగర్జునసాయిబాబారెడ్డి (13) పట్టణంలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. ఎప్పటిలాగానే మంగళవారం కూడా ఉదయం స్కూల్‌కు వచ్చాడు. కొద్దిసేపటి తర్వాత తోటి విద్యార్థులతో జరిగిన సంఘటనపై ప్రిన్సిపల్ మందలించాడు. దీంతో మనస్థాపం చెందిన విద్యార్థి విరామ సమయంలో పాఠశాల భవనంపైకి ఎక్కి వెనుక భాగం నుంచి కిందకు దూకాడు. ఈ సంఘటనలో ఆ విద్యార్థి పొట్టభాగం పగిలిపోయి తీవ్రగాయాలతో ఉండగా దగ్గరలోని ప్రభుత్వా సుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే విద్యార్థి మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలిసిన విద్యార్థి తల్లిదండ్రులు బోరున విలపించారు. విద్యార్థి మృతికి స్కూల్ యాజమాన్యానిదే బాధ్యతంటూ స్కూల్ ముందు విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు, ఎస్ఎఫ్ఐ, సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని అధికారులు, పోలీసులు హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించారు.

స్కూల్ గుర్తింపు రద్దు

విద్యార్థుల రక్షణకు ఎటువంటి చర్యలు తీసుకోకుండా పాఠశాల నిర్వహిస్తూ విద్యార్థి మరణానికి కారణమైన శ్రీ చైతన్య ఇంగ్లీషు మీడియం స్కూల్ గుర్తింపును రద్దుచేస్తూ జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం.వి.రాజ్యలక్ష్మి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. జిల్లా కలెక్టర్ బి.లక్ష్మీకాంతం ఆదేశాల మేరకు ఈ చర్య తీసుకున్నామని పేర్కొన్నారు.



చలి సాధారణమే..

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్రంలో రెండు మూడు రోజులుగా సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పలుచోట్ల పగటిపూట 29 నుంచి 31 డిగ్రీలు, రాత్రి వేళల్లో కోస్తాలో 15 నుంచి 19.5 డిగ్రీలు, రాయలసీమలో 13 నుంచి 17 డిగ్రీలు చొప్పున నమోదవుతున్నాయి. దీంతో రాష్ట్రంలో సాధారణ చలి వాతావరణం నెలకొంది. అండమాన్ సముద్రంలో తుపానుగా మారిన పాబుక్ తర్వాత వాయుగుండంగా మారిన సంగతి తెలిసిందే. మంగళవారం నాటికి మయన్మార్ తీరానికి చేరుకుని అల్పపీడనంగా మారిందని ఐఎండి తెలిపింది. దానికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని పేర్కొంది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగ పడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

3,648 కి.మీ.. 2,516 గ్రామాలు

నేటితో ముగియనున్న జగన్ పాదయాత్ర
ఇచ్ఛాపురంలో వైసిపి బహిరంగ సభ
అభ్యర్థుల ప్రకటన లేనట్టే..

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

3,648 కిలోమీటర్లు ... 2,516 గ్రామాలు... 231 మండల కేంద్రాలు.. 54 మున్సిపాల్టీలు... 8 నగరాలు... 123 బహిరంగసభలు... వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప యాత్రకు అంకెల రూపమిది! 2017 నవంబర్ ఆరో తేదీన కడవ జిల్లా వైఎస్ఆర్ ఘాట్ నుంచి ప్రారంభమైన ఈ పాదయాత్ర శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం లో బుధవారం ముగియనుంది. ఈ సందర్భంగా ఇచ్ఛాపురంలో వైసిపి బహిరంగసభ నిర్వహించనుంది. సభకు ముందు విజయ స్థూపాన్ని జగన్ ఆవిష్కరిస్తారు. కంచిలి మండలం పెద్దకొజ్జిరియాలో బుధవారం ఉదయం ఎనిమిది గంటలకు జగన్ పాదయాత్ర ప్రారంభం అవుతుంది. మధ్యాహ్నం 1.15 గంటలకు ఇచ్ఛాపురం ప్రారంభంలోని విజయస్థూపం వద్దకు చేరుకుంటారు. ఆవిష్కరణ అనంతరం పాతబస్టాండ్ సెంటర్లోని బహిరంగ సభ నిర్వహించనున్నారు. అక్రమాస్తుల కేసులో కోర్టు విచారణకు హాజరవుతూనే సుదీర్ఘకాలం సాగించిన ఈ పాదయాత్రలో రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాదిమందిని జగన్ కలిశారు. పాదయాత్ర ప్రారంభమైనప్పటి నుండి వైసిపి ఎంఎల్‌ఏలు రాష్ట్ర శాసనసభకు పోలేదు. ఆ క్రమంలోనే ప్రజాసమస్యలు విస్మరించారని, బాధ్యతగల ప్రతిపక్షంగా వ్యవహరించలేక పోయారంటూ వచ్చిన విమర్శలను జగన్ ఖాతరు చేయలేదు. శాసనసభలో చేసేదేమి లేదని.. ప్రజలకే నేరుగా అన్ని విషయాలు చెబుతున్నామన్నది ఆయన వాదన! రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చేది లేదన్న కేంద్ర ప్రభుత్వ స్పష్టమైన ప్రకటన పాదయాత్ర సమయంలోనే వచ్చింది. తిత్లీ వంటి ప్రకృతి బీభత్సమూ చోటుచేసుకుంది. ఈ రెండు సందర్భాల్లోనూ జగన్ వైఖరి విమర్శలకు దారి తీసింది. కొద్ది నెలల క్రితం పాదయాత్రలో ఉన్న జనగ్‌పై విశాఖ ఎయిర్‌పోర్టులో జరిగిన దాడి కూడా రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ పాదయాత్ర ప్రభావమెంత? ముఖ్యమంత్రి కావాలన్న జగన్ రాజకీయ లక్ష్యం ఈ యాత్రతో నెరవేరుతుందా? ఈ ప్రశ్నలపై రాష్ట్రమంతా చర్చ జరుగుతోంది. ప్రజాసంకల్ప యాత్ర రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని మార్చివేయడం ఖాయమని వైసిపి నేతలు గట్టిగా చెబుతున్నారు. 'అంతసీన్ లేదు' అని టిడిపి నేతలు తేల్చివేస్తున్నారు. మార్నింగ్‌వాక్, ఈవినింగ్ వాక్ అని ఎద్దేవా చేస్తున్నారు. మరోవైపు పాదయాత్ర ముగింపు సందర్భంగా త్వరలో జరగనున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు అభ్యర్థులను ప్రకటిస్తారని వార్తలు వచ్చినప్పటికీ, అటువంటి ప్రకటనలేవి ఉండవని తాజా సమాచారం. అభ్యర్థుల ఎంపిక విషయంలో ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని చెబుతున్నారు.

బాబుపై విమర్శలు.. బిజెపి పట్ల మెతక వైఖరి

పాదయాత్ర పొడవునా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని జగన్ లక్ష్యంగా చేసుకున్నారు. ఆయనపై విమర్శలు కురిపించారు. అదే సమయంలో ఎన్నికల హామీలుగా వైసిపి ప్రకటించిన నవరత్నాలను ప్రస్తావించారు. యాత్ర మొత్తం ప్రధానంగా ఈ రెండు అంశాలపైనే జగన్ దృష్టి కేంద్రీకరించారు. అదేసమయం లో రాష్ట్రం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోడీని, బిజెపిని ఒక్క మాట కూడా అనకపోవడం విమర్శలకు దారి తీసింది. ఈ వైఖరిని వైసిపి సమర్థించుకుంది. నష్టాల్లో కూరుకుపోయిన ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, సిపిఎస్ విధానం రద్దు, ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టుల భర్తీ, మెగా డీఎస్సీ, వివిధ సామాజిక తరగతుల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్ల ఏర్పాటుపై జగన్ హామీ ఇచ్చారు.



శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో జగన్ ఆవిష్కరించనున్న విజయ స్థూపం

ఈఫిల్ టవర్ నమూనాలో విజయ సంకల్ప స్థూపం

పాదయాత్ర ముగింపు సందర్భంగా ఇచ్ఛాపురంలో విజయ సంకల్ప స్థూపాన్ని జగన్ ఆవిష్కరించనున్నారు. 42 సెంట్ల స్థలంలో 83 అడుగుల ఎత్తున దీన్ని నిర్మించారు. పారిస్‌లోని ఈఫిల్ టవర్ నమూనాలో దీన్ని రూపొందించారు. స్థూపం శిఖరం వద్ద వైసిపి జెండాను ఉంచారు.

మంగళవారం ఇలా...

పాదయాత్ర ముగింపునకు ఒక్క రోజు ముందు మంగళవారం తాజాగా టిడిపి ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ బుద్దా వెంకన్న సోదరుడు, బిసి ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు బుద్దా నాగేశ్వరరావు జగన్ సమక్షంలో వైసిపిలో చేరారు. గూడూరు మున్సిపల్ చైర్‌పర్సన్ దేవసేనతో పాటు తొమ్మిది మంది టిడిపి కౌన్సిలర్లు, ఎంపిపి రామమ్మ తదితరులకు జగన్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. శ్రీకాకుళం జిల్లా కవిటి మండలంలో మంగళవారం జగతి శివారు నుంచి ప్రారంభమై అగ్రహారం వరకూ కొనసాగింది.

పాదయాత్రలో మైలు రాళ్లు

ప్రారంభం : 2017 నవంబర్ ఆరో తేదీన కడవ జిల్లా వైఎస్ఆర్ ఘాట్ నుంచి జగన్ పాదయాత్రను ప్రారంభించారు.

వెయ్యి కిలోమీటర్లు : 2018 జనవరి 29న నెల్లూరు జిల్లా వెంకటగిరి నియోజకవర్గంలో పాదయాత్ర సైదాపురం శివారు ప్రాంతం వద్ద వెయ్యి కిలోమీటర్లకు చేరుకుంది.

రెండు వేల కిలోమీటర్లు : 2018 మే 14న పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు నియోజక వర్గంలోని వెంకటాపురం వద్ద రెండు వేల కిలోమీటర్ల మైలురాయికి చేరుకుంది.

మూడు వేల కిలోమీటర్లు : 2018 సెప్టెంబర్ 24న విజయనగరం జిల్లా ఎస్.కోట నియోజకవర్గంలోని దేశపాత్రునిపాలెం వద్ద మూడు వేల కిలోమీటర్లకు చేరుకుంది.

జగన్‌పై దాడి

విజయనగరం జిల్లా సాలూరు నియోజక వర్గంలో పర్యటన అనంతరం హైదరాబాద్‌కు పయనమైన జగన్‌పై అక్టోబరు 25న విశాఖ ఎయిర్‌పోర్టులో దాడి జరిగింది. ఘటన తర్వాత ఆయన నేరుగా హైదరాబాద్ వెళ్లి చికిత్స పొందారు. వైద్యుల సలహా మేరకు పాదయాత్రకు 17 రోజులు విరామం ఇచ్చారు. అనంతరం మళ్లీ నవంబరు 12న విజయనగరం జిల్లా సాలూరు నియోజకవర్గంలోని పాయకపాడు నుంచి యాత్ర ప్రారంభించారు.

ప్రజ్ఞ

1. ఐఎంఎఫ్‌లో అత్యున్నత పతవి పొందిన తొలి మహిళ ఏవరు?
2. గోల్డెన్ గ్లోబ్స్ పురస్కారాలు ఎక్కడ జరిగాయి?
3. గోల్డెన్ గ్లోబ్స్‌లో ఉత్తమ చిత్రం ఎది నిలిచింది?
4. గోల్డెన్ గ్లోబ్స్‌లో ఉత్తమ నటుడుగా నిలిచింది ఎవరు?
5. గోల్డెన్ గ్లోబ్స్‌లో ఉత్తమ విదేశీ భాషా చిత్రం ఏది?

సమాధానాలు 7లో

ప్రైవేటుకు లాభాలు-ప్రజలకు ఛార్జీలు

నవ్యాంధ్రలో ఇంధన ప్రగతి ఇదే

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

ఇంధన రంగం అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ దూసుకుపోతోందని చంద్రబాబు సర్కారు తెగ ఊదరగొడుతోంది. నాలుగున్నరేళ్ల పాలనపై ఇంధనరంగంలో ఎన్నో విజయాలు సాధించామని, తమకు ఏ రాష్ట్రమూ సాటిరాలేదని శ్వేతపత్రంలో గొప్పలకు పోయిన ప్రభుత్వం, బుధవారం 'జన్మభూమి- మావూరు'లో ఈ అంశాన్ని చర్చనీయాంశం చేస్తోంది.

విభజన నాటికి రోజుకు 22 మిలియన్ యూనిట్ల లోటులో ఎపి ఉన్నట్లు తెలిపిన సర్కారు నవ్యాంధ్రలో స్వల్పకాలంలోనే మిగులు రాష్ట్రంగా అవతరించామంటోంది. గతంలో కరెంట్ కోతలు, సరఫరాలో అంతరాయాలుండగా ప్రస్తుతం నిరంత రాయంగా విద్యుత్‌ను అందిస్తున్నామని వెల్లడించింది. స్థూలంగా ఈ విషయాల్లో కొంత వరకు వాస్తవం ఉన్నా అందుకోసం సర్కారు ఎంచుకున్న విధానం అభ్యంతరకర మైంది. అన్యాయమైంది.

విద్యుత్ ఛార్జీల పెంపు : ఎన్నికల మేనిఫెస్టోలో విద్యుత్ ఛార్జీలు పెంచ బోమని ప్రజలకు హామీ ఇవ్వగా ఇప్పటి వరకు మూడుసార్లు ఛార్జీలు పెంచారు. శ్లాబుల వర్గీకరణ, ఫిక్స్‌డ్ ఛార్జీలు ఇత్యాది దొడ్డి దారుల్లో మొత్తమ్మీద రూ.5 వేల కోట్లకుపైన ప్రజల నుంచి ముక్కుపిండి అదనంగా వసూలు చేశారు. ఎపిఇఆర్‌సి బహిరంగ విచారణల్లో ఛార్జీల పెంపుపై ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు, మేధావులు నిరసనలు తెలిపినా వినిపించుకోలేదు. ఇప్పుడు ఎన్నికలు దగ్గరకొచ్చేసరికి భవిష్య త్తులో ఛార్జీలు పెంచేది లేదనని ప్రకటించిన తొలి రాష్ట్రం తమదేనంటున్నారు.

ప్రైవేటుకు ప్రోత్సాహం : మిగులు సాధింపు పేరుతో ప్రైవేటు విద్యుత్ సంస్థలను అమితంగా ప్రోత్సహించారు. బహిరంగ మార్కెట్‌లో యూనిట్ ధర రూ.1.98కు దొరుకుతుంటే ప్రైవేటు దగ్గర నుంచి రూ.ఆరు రూపాయలకు కొంటున్నారు.

జెన్‌కో సామర్థ్యం తగ్గింపు : ప్రైవేటు కంపెనీల కోసం ప్రభుత్వరంగంలోని ఎపి జెన్‌కో ఉత్పత్తి సామర్థ్యాన్ని గణనీయంగా తగ్గించారు. జెన్‌కో నుంచి యూనిట్ రూ.4కు విద్యుత్ లభిస్తున్నప్పటికీ ప్రైవేటు నుంచి రూ.6-7పై కొనుగోలు చేస్తున్నారు. ఈ నాలుగున్నరేళ్లల్లో కొత్తగా జెన్‌కో ఒక్క మెగావాటు స్థాపక సామర్థ్యం కూడా పెంచలేదు. పాతవే ఈ కాలంలో అమల్లోకొచ్చాయి.

మిగులు నష్టాలు : ఏడాదికి పది వేల మిలియన్ యూనిట్ల మిగులు సాధిస్తుండగా దాన్ని అమ్మడంలో విఫలమవుతోంది. దానిక్కారణం మనకులాగానే పలు రాష్ట్రాలు విద్యుత్ మిగులు రాష్ట్రాలుగా అవతరిస్తున్నాయి. పక్కనున్న తెలంగాణ సైతం మిగులు రాష్ట్రంగా మారుతోంది. డిమాండ్‌కు మించి ఉత్పత్తి చేస్తున్న విద్యుత్‌ను అమ్ముకోలేక డిస్కంలు నష్టాలపాలవుతున్నాయి. ఆ నష్టాలను ప్రజలపై ఛార్జీల రూపంలో సర్కారు బాదుతోంది. మరోవైపు అవసరం లేకపోయినా ప్రైవేటు కంపెనీల దగ్గర నుంచి ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తూ వాటికి ఆయాచిత ప్రయోజనం కల్పిస్తోంది.

అణు విద్యుత్ : ఈ పరిస్థితుల్లోనూ ఇంకా కొవ్వాడ వద్ద అత్యంత ప్రమాదకరమైన అణువిద్యుత్ కేంద్రం కోసం సర్కారు ఉవ్వీళ్లూరుతోంది. స్థానిక ప్రజలు వద్దంటున్నా ఖాతరు చేయట్లేదు. ఇంకా ప్రైవేటు రంగంలో కాలుష్యకారకమైన థర్మల్ ప్రాజెక్టులకు అనుమతులిస్తోంది. కార్పొరేట్ల కోసం రైతుల భూములు లాక్కొని మరీ అణు, థర్మల్, సోలార్ ప్లాంట్లకు తహతహలాడుతోంది.

'రాఫెల్' దృష్టి మళ్లించేందుకే ఇబిసి రిజర్వేషన్లు : యనమల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాఫెల్ కుంభకోణం నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే మోడీ ప్రభుత్వం అగ్రవర్ణాలకు 10% రిజర్వేషన్ల అంశాన్ని తెరమీదకు తెచ్చిందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి యనమలరామకృష్ణుడు అన్నారు. అగ్రకుల పేదలకు రిజర్వేషన్లు ఆహ్వానించదగిందే కానీ కేంద్రం నిర్ణయం వెనుక రాజకీయ రహస్యం దాగి ఉందన్నారు.

బాబు, మోడీ ఒకే తల్లి కవలలు

సార్వత్రిక సమ్మెలో వామపక్ష నేతలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మిక లోకం కదంతొక్కింది. విజయవాడ నగరంలో మంగళవారం అన్ని కార్మిక సంఘాలు కలిసి మహా ప్రదర్శన నిర్వహించారు. రథం సెంటర్ నుంచి బందర్‌రోడ్డు మీదుగా లెనిన్ సెంటర్ వరకూ ప్రదర్శన సాగింది. వేలాది సంఖ్యలో కార్మికులు ప్రదర్శనలో పాల్గొన్నారు. బందర్ రోడ్డు మీదుగా ర్యాలీ నిర్వహించేందుకు అనుమతి లేదని, పాత ప్రభుత్వాసుపత్రి మీదుగా వెళ్లాలని పోలీసులు తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద ర్యాలీని అడ్డుకోవడంతో కార్మిక సంఘాల నాయకులు రోడ్డుపైనే బైఠాయించి నిరసన తెలిపారు. బందర్ రోడ్డు మీదుగానే ప్రదర్శన కొనసాగిస్తామని తేల్చి చెప్పారు. చివరకు పోలీసులు అనుమతివ్వడంతో ప్రదర్శన ముందుకు సాగింది. లెనిన్ సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించిన అనంతరం సభను నిర్వహించారు. ఈ సభలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎం గఫూర్ మాట్లాడుతూ మోడీ, చంద్రబాబు ఒకే తల్లి కవలలని, పెట్టుబడిదారులకు తొత్తులేనని అన్నారు. కోట్ల మంది సమ్మె చేసినా చర్చించేందుకు మోడీ ఎందుకు ముందుకు రావడం లేదని, స్కీం వర్కర్లను ఉద్యోగులుగా గుర్తించడంలో సమస్య ఏంటని ప్రశ్నించారు. నిజంగా



కార్మికుల ఓట్లు కావాలంటే ప్రభుత్వాలు దిగొచ్చి చర్చలు జరపాలన్నారు. లేకుంటే మోడీ, బాబు ప్రభుత్వాలను బంగాళాఖాతంలో కలుపుతామని హెచ్చరించారు. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా తీరు మార్చుకోకపోతే కార్మికులు రాజకీయ సమాధి కడతారన్నారు. కార్పొరేట్లకు దోచిపెట్టేందుకు కార్మికుల రక్తాన్ని పీల్చుతున్నారన్నారు. వైఎస్ఆర్‌టియు నాయకులు విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ సమ్మె చేస్తున్నా ప్రభుత్వాలు ఎందుకు తాత్సారం చేస్తున్నాయని, హక్కుల్ని ఎందుకు నిర్వీర్యం చేస్తున్నారని ప్రశ్నించారు. ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి పొలారి మాట్లాడుతూ దేశమంటే మనుషులు కాదోయ్... దేశమంటే మల్టీనేషనల్ కంపెనీలోయ్.. అనే పరిస్థితికి మోడీ ప్రభుత్వం వచ్చిందన్నారు. ఎఐసిసిటియు నాయకులు హరినాథ్, ఎఐయుటియుసి నాయకులు కె సుధీర్ మాట్లాడుతూ కార్మికులు తలచుకుంటే మోడీ, బాబు ప్రభుత్వాలు వచ్చే ఎన్నికల్లో ఉనికిని కోల్పోతాయన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బాబురెడ్డి మాట్లాడుతూ ఉద్యోగాలిస్తామని ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు హామీ ఇచ్చి మోసం చేశాయన్నారు. శ్రామిక మహిళ నాయకురాలు రమాదేవి మాట్లాడుతూ మహిళల గురించి గొప్పగా నినాదాలిచ్చే ప్రభుత్వాలు మహిళల ఉపాధిని దెబ్బతీస్తున్నాయని, ఉపాధి లేకుండా పిల్లలను ఎలా చదివించుకోవాలని ప్రశ్నించారు. బ్యాంక్ కో ఆర్డినేషన్ కమిటీ నాయకులు శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ రంగం బ్యాంకులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. బ్యాంకులపై ఉన్న నమ్మకాన్ని నోట్ల రద్దుతో మోడీ పోగొట్టారన్నారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి సుబ్బరావమ్మ మాట్లాడుతూ కార్మికుల ఐక్యతతో పీఠం కూలుతుందన్న భయం ప్రభుత్వాలకు పట్టుకుందని, సమ్మెలో పాల్గొంటే ఉద్యోగాలు తొలగిస్తామని బెదిరిస్తున్నాయని అన్నారు. రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ , ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో రైల్వే డిఆర్‌ఎం కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసి ఇయు, ఎస్‌డబ్ల్యూఎఫ్, యునైటెడ్ ఎంప్లాయిస్ యూనియన్, బహుజన వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు ఆర్టీసి కార్మికుల సమ్మె కారణంగా రాష్ట్రంలో పలు డిపోలో సగానికి పైగా బస్సులు నిలిచిపోయాయి. రాష్ట్ర వ్యాప్తంగా 10 శాతం బస్సులు నిలిచిపోయినట్లు ఆర్టీసి అధికారులు వెల్లడించారు.

కార్మికుల కన్నెర్ర

- రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె విజయవంతం
- పలుచోట్ల ప్రదర్శనలు, నిరసనలు

విశాఖ : నగరంలోని ప్రభుత్వ రంగ సంస్థల్లోని పర్మినెంటు, ఒప్పంద కార్మికులు, స్కీమ్ వర్కర్లు, అసంఘటితరంగ కార్మికులు సమ్మె బాట పట్టారు. లక్షలాది మంది కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. స్టీల్‌ప్లాంట్, బ్యాంకులు, ఇన్సూరెన్స్, పోస్టల్, టెలికమ్, ఆదాయపన్ను శాఖ వంటి ప్రభుత్వ రంగ సంస్థల్లో కార్మికులు పూర్తిగా సమ్మెలో పాల్గొన్నారు. షిప్‌యార్డు, హెచ్‌పిసిఎల్, రక్షణ రంగం, షిప్‌యార్డు, స్టీల్‌ప్లాంట్, కోరమాండల్, రైల్వే రంగాల్లోనిసమ్మె జరిగింది. ఆయా సంస్థల్లో విధులు బహిష్కరించి గేట్ మీటింగ్‌లు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ స్కీమ్ వర్కర్లు అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్నం భోజన కార్మికులు సార్వత్రిక సమ్మెకు జై కొట్టారు. అసంఘటిత రంగంలోని ఆటో వర్కర్లు పెద్ద ఎత్తున రైల్వే స్టేషన్ వద్ద, ప్రయివేటు ట్రాన్స్‌ఫోర్టు వర్కర్లు సీ హార్స్ జంక్షన్ నుండి జగదాంబ వరకూ ర్యాలీలు చేపట్టారు. ఆర్టీసిలో ఎస్‌డబ్ల్యుఎఫ్ కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. నగరంలోని జగదాంబ, మద్దిలపాలెం, తగరపువలస, గాజువాక, పెదంట్యాడ, ఉక్కునగరం, పెందుర్తి, గోపాలపట్నం, ఆరిలోవ, మధురవాడ, మల్కాపురం, కంచరపాలెం తదితర ప్రాంతాల్లో సిఐటియు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన ర్యాలీలు నిర్వహించారు. ఆటోనగర్, ఇండస్ట్రియల్ ఏరియాలో కార్మికులు ప్రత్యేకంగా నిరసనలు తెలియజేశారు. నగరంలో లక్షల సంఖ్యలో సమ్మెలో పాల్గొన్నట్లు కార్మిక నేతలు చెప్పారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు లోకనాథం పలు నిరసన ర్యాలీల్లో ప్రసంగించారు. విశాఖ మన్యంలోని కాఫీ, జిసిసి, ఐటిడిఎ, హెచ్‌ఎండిసి, గిరిజన మ్యూజియం కార్మికులు సమ్మె చేశారు. దీంతో వాటిల్లో కార్యకలాపాలు నిలిచిపోయాయి. పాడేరు ఐటిడిఎ ఎదుట సిఐటియు జిల్లా అధ్యక్షుడు శంకరరావు, ఎపిజిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అప్పలనర్స ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. అరకులోయలో గిరిజన మ్యూజియం ఎదుట బైఠాయించి, నిరసనలు తెలిపారు. అనంతరం భారీ ర్యాలీ నిర్వహించారు. .అనకాపల్లి, చీడికాడ, చోడవరం కేంద్రాల్లో ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయి. అచ్యుతాపురం ఎస్‌ఇజెడ్‌లోని మైథాన్, పిల్‌కింగ్‌టన్, యూనిఫాంట్, కాకర్న్, ఫార్మా కంపెనీల్లో ఎ షిఫ్ట్ కార్మికులు సమ్మెలో పాల్గొనడంతో వాటిల్లో ఎటువంటి కార్యకలాపాలూ జరగలేదు. అనకాపల్లి, చోడవరంలో ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. నర్సీపట్నంలో సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యాన ఆయా రంగాల కార్మికులు ర్యాలీ చేపట్టారు.



విజయనగరంలో జరిగిన భారీ ర్యాలీ

విజయవాడ : రథం సెంటరు నుండి లెనిన్ సెంటరు వరకూ భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో కేంద్ర కార్మిక సంఘాలైన సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ గఫూర్, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేశ, ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పోలారి, ఎఐసిసిటియు, ఎఐఎఫ్‌టియు , ఎఐయుటియుసి తదితర సంఘాల నాయకులతో పాటుగా వైఎస్‌ఆర్‌టియుసి రాష్ట్ర నాయకులు విశ్వనాథ రవి, యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాబురెడ్డి , బెఫి రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆర్ అజయ్‌కుమార్, స్కీం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సుబ్బరావమ్మ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వవిధానాలపై నిప్పులు చెరిగారు. ఈ సమ్మెకు సిపిఎం పశ్చిమ కృష్ణాజిల్లా కార్యదర్శి డివి కృష్ణ మద్దతు తెలిపారు. మచిలీపట్నం. బస్టాండ్ సెంటర్ నుండి కోనేరుసెంటర్ వరకూ భారీ ప్రదర్శన నిర్వహించారు.. కోనేరు సెంటర్‌లో కార్మికులనుద్దేశించి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రఘు మాట్లాడారు. ఎల్‌ఐసి ఉద్యోగులు ఐసిఇయు ఆధ్వర్యంలో జయప్రదం చేశారు. గుడివాడ, నూజివీడు, నాగాయలంక, కోడూరు, చల్లపల్లి, నూజివీడు, నందిగామలో ర్యాలీలు జరిగాయి. నూజివీడు ర్యాలీలో సిపిఐ జిల్లా కార్యదర్శి అక్కినేని వనజ పాల్గొన్నారు.

> **కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన దేశవ్యాప్త సమ్మె మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా విజయవంతంగా సాగింది. రెండ్రోజుల సమ్మె పిలుపు మేరకు తొలిరోజు సిఐటియు, ఎఐటియుసి, ఐఎన్‌టియుసి, హెచ్‌ఎంఎస్., ఐఎఫ్‌టియు, బ్యాంకు, ఎల్‌ఐసి, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు, ఎపిఎన్‌జిఒ, విద్యార్థి, యువజన సంఘాలు పాల్గొన్నాయి. ఆటో, లారీ కార్మికులు సమ్మెలో పాల్గొనడంతో పలురోడ్లు నిర్మానుష్యంగా మారాయి. బ్యాంకులు, జీవిత బీమా, తపాలా తదితర రంగాల ఉద్యోగులు సమ్మెలో పాల్గొనడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలన్నీ వెలవెలబోయాయి.**

చిత్తూరు : తిరుపతిలో కార్మిక సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో కార్మిక వ్యతిరేక భూతాన్ని గాంధీ విగ్రహం వద్ద దగ్ధం చేశారు. అయితే దిష్టిబొమ్మ తగలబడకుండా పోలీసులు అడ్డుకుని చిందరవందర చేశారు. తిరుపతిలో సిఐటియు జిల్లా కార్యదర్శి కందారపు మురళి, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి మురళి, ఐఎఫ్‌టియు నాయకులు హరిక్రిష్ణ నేతృత్వం వహించారు. పోస్టల్, బిఎస్‌ఎన్‌ఎల్ సంస్థల్లో పట్టభద్రుల ఎంఎల్‌సి యండపల్లి శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు. జిల్లా కేంద్రం చిత్తూరులో గాంధీ విగ్రహం వద్ద నుంచి చర్చివీధి మీదుగా పోస్టాఫీసు మీదుగా భారీ ప్రదర్శన నిర్వహించారు. సిఐటియు చిత్తూరు జిల్లా కార్యదర్శి చైతన్య పాల్గొన్నారు.

గుంటూరు : తాడేపల్లిలో జరిగిన రాలీలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.కృష్ణయ్య మాట్లాడారు. గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరం నుండి లాడ్జిసెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ, అనంతరం సభ నిర్వహించారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్, మాజీ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి జె.అజయ్‌కుమార్, ఎఐటి యుసి నాయకులు నాయకులు వి.రాధాకృష్ణ పాల్గొన్నారు. కలెక్టరేట్ వద్ద కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ధర్నా చేశారు. మిర్చియార్డు నుండి చుట్టుగుంట వరకు ర్యాలీ నిర్వహించారు. ఎఐఎఫ్‌టియు (న్యూ) రాష్ట్ర నాయకులు స్వామి మాట్లాడారు. తెనాలిలో జరిగిన ర్యాలీలో సిపిఎం గుంటూరు తూర్పు జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడారు. సత్తెనపల్లిలో సభనుద్దేశించి సిపిఎం గుంటూరు పశ్చిమ జిల్లా కార్యదర్శి జి.చలమయ్య మాట్లాడారు.

ప్రకాశం : జిల్లాలో 12,500 మంది సమ్మెలో పాల్గొన్నారు. 30 మండలాల్లో సిఐటియు, ఎఐటియుసి, ఇతర కార్మికసంఘాల ఆధ్వర్యంలో ప్రదర్శనలు సాగాయి. ఆర్టీసీ ఉద్యోగుల సమ్మెతో 150 బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. ఒంగోలులో బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ప్రదర్శన సాగింది. అక్కడ ధర్నా, సభ జరిగాయి. ఇందులో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, ఎఐటియుసి రాష్ట్ర నాయకులు పిజె చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కర్నూలు: కర్నూలు, ఆదోని, నంద్యాల డివిజన్లల్లో భారీ ఎత్తున ర్యాలీలు నిర్వహించారు. కర్నూలులో కలెక్టరేట్ నుండి జెడ్‌పి వరకు భారీ ప్రదర్శన జరిగింది. సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు, ఐఎన్‌టియుసి తదితర కార్మిక సంఘాలు పాల్గొన్నాయి. కార్మిక ర్యాలీని ఉద్దేశించి ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడారు. నంద్యాల, డోన్, ఆదోని, ఆత్మకూరు, బేతంచెర్ల పట్టణాలతో పాటు అన్ని మండలాల్లో సమ్మె జరిగింది.

కడప: కడప, ప్రొద్దుటూరు, జమ్మల మడుగు, బద్వేలు, పులివెందుల, రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు, మైదుకూరు, కమలాపురం నియోజకవర్గాల్లో సంఘటిత, అసంఘటిత కార్మికులు విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. సిఐటియు, బ్యాంకు, ఐఎంఎల్, మున్సిపల్, సహకార బ్యాంకు, ఉద్యోగ రంగాలు ఐక్య కార్యాచరణగా కడపలో భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభకు సిఐటియు రాష్ట్ర కార్యదర్శి బాలకాశి, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి కొండలరావు, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నారాయణ, సిపిఐ జిల్లా కార్యదర్శి ఈశ్వరయ్య పాల్గొన్నారు. బద్వేలులో ర్యాలీలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు పాల్గొన్నారు.



తిరుపతిలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ప్రదర్శన

అనంతపురం: అనంతపురం, గుంతకల్లు, రాయదుర్గం, తాడిపత్రి, హిందూపురం, కదిరి, ఆయా మున్సిపాల్టీల్లోను, మండలాల్లోను సమ్మె నిర్వహించారు. రాయదుర్గంలో ఉదయాన్నే ఆర్టీసీ డిపో వద్ద కార్మికులు నిరసన చేపట్టారు. ఆస్పత్రిలో సిబ్బంది నల్లబ్యాడ్జీలతో విధులు నిర్వహించి నిరసన చేపట్టారు. ముఖ్యంగా అనంతపురం సిఐటియు ఆధ్వర్యంలో మోడీ వేషధారణలో మనుషులకు సంకెళ్లు వేసి జిఎస్‌టి. నోట్ల రద్దు రూపంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులు కళ్లకు కట్టినట్లు ప్రదర్శించిన తీరు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్థానిక రైల్వే స్టేషన్ నుంచి మొదలైన ర్యాలీ శ్రీకంఠం సర్కిల్ పొడవునా కార్మికులు పెద్ద ఎత్తున హాజరై వంతెనను తలపించేలా ఎర్రజెండాల ప్రదర్శన ఎంతో ఆకట్టుకుంది. కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర నాయకులు నరసింహారావు, ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.పెద్దిరెడ్డి, ఎపి మెడికల్ సేల్స్ రెప్రజెంటేటీవ్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు ఎజి.రాజ మోహన్, శ్రీనివాసరావు, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఆర్.రవీంద్రనాథ్, సిపిఎం ఉత్తర ప్రాంత జిల్లా కార్యదర్శి వి.రాం భూపాల్, సిపిఐఎంఎల్ జిల్లా కార్యదర్శి పెద్దన్న పాల్గొన్నారు.

నెల్లూరు : సిపిఎం నగర కమిటీ,రూరల్ కమిటీల ఆధ్వర్యంలో ఆత్మకూరు బస్టాండ్ నుంచి విఆర్‌సి వరకూ ఆర్‌టిసి బస్టాండ్ నుంచి విఆర్‌సి వరకూ భారీ ర్యాలీలు జరిగాయి.. అనంతరం విఆర్‌సి సెంటర్‌లో సభ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జిలానీ బాషా, పార్టీ జిల్లా కార్యదర్శి చంద్రరాజగోపాల్, రవాణా రంగ రాష్ట్ర నాయకులు ఆర్.లక్ష్మయ్య, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మీ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మూలం రమేష్ పాల్గొన్నారు.

తూర్పుగోదావరి : ధవళేశ్వరంలోని హార్లిక్స్ ఫ్యాక్టరీ, కేశవరంలోని కోకోకోలా కంపెనీ కార్మికులు, గుమ్మళ్లదొడ్డిలోని హెచ్‌పిసిఎల్ కార్మికులు, కడియం, రాజమహేంద్రవరం పేపరుమిల్లులతోపాటు జిల్లాలోని వివిధ పరిశ్రమల కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. .కాకినాడలో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, పోర్టులు మూతపడ్డాయి. జిల్లాలోని 9 ఆర్‌టిసి డిపోల్లో 800 బస్సులుండగా, మంగళవారం 422 బస్సులే తిరిగాయి. కాకినాడలో హెడ్ పోస్టాఫీసు నుంచి కలక్టరేట్ వరకూ ప్రదర్శన నిర్వహించి, అక్కడ బహిరంగ సభ నిర్వహించారు. సభలో సిఐటియు రాష్ట్ర కోశాధికారి ఎబి నాగేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి టి.మధు, ఐఎఫ్‌టియు నాయకుడు ఎం.వెంకటేశ్వర్లు, జెఎసి చైర్మన్ బి.ఆశీర్వాదం పాల్గొన్నారు. రాజమహేంద్రవరంలో కోటగుమ్మం సెంటరు నుంచి కోటిపల్లి బస్టాండు వరకూ పదర్శన నిర్వహించారు. అక్కడ జరిగిన బహిరంగ సభలో సిపిఎం రాజమహేంద్రవరం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ ప్రసంగించారు. ముమ్మిడివరంలో కార్మికులు భారీ ప్రదర్శన, బహిరంగ సభలో సిపిఎం కాకినాడ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడారు.

పశ్చిమగోదావరి : ఏలూరులో కార్మికులు కదంతొక్కారు. ధరల భూతం, ప్రభుత్వ విధానాలు ఎద్దేవా చేస్తూ ప్రదర్శించిన కార్టూన్లు, కార్మికుల విచిత్ర వేషధారణలు ఆకట్టుకున్నాయి. బిజెపి దిష్టిబొమ్మకు పాడె కట్టి, ఆ పాడెను మహిళలు మోస్తుండగా నాయకులు పాడె ముందు భాగాన నడవడం ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. ఆర్‌ఆర్ పేట పార్కు వద్ద జరిగిన బహిరంగ సభలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు, ఎఐటియుసి రాష్ట్ర గౌరవాధ్యక్షులు సిహెచ్.రామారావు, ఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు పి.ప్రసాద్. సిపిఎం అప్‌ల్యాండ్ జిల్లా కార్యదర్శి చింతకాయల బాబూరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి డేగా ప్రభాకర్, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. తణుకు, పాలకొల్లు, నరసాపురంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించారు. నరసాపురం సభలో సిపిఎం డెల్టా జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడారు. భీమవరంలో సిఐటియు ఆధ్వర్యాన ఆక్వా వర్కర్లు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో ఉద్యోగ, కార్మికుల ఆగ్రహానికి మోడీ ప్రభుత్వం గురికాక తప్పదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం హెచ్చరించారు. తాడేపల్లిగూడెంలో, ఆకివీడులో కార్మికులు భారీ ప్రదర్శనలు, అనంతరం సభలు నిర్వహించాయి. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జెఎన్‌వి గోపాలన్ మాట్లాడారు. కొవ్వూరు బస్టాండు సెంటరులో ఉద్యోగ, కార్మిక సంఘాల జెఎసి ఆధ్వర్యాన బహిరంగ సభ నిర్వహించారు.

విజయనగరం : ఆటోలు ఎక్కడికక్కడే నిలిపోయాయి. ఎల్‌ఐసి కార్యాలయంలో అధికారులు మినహా మిగతా వారంతా సమ్మెలో పాల్గొన్నారు. చిన్నాపురం వద్దగల ఎఎస్ జ్యూట్‌మిల్లు కార్మికులు విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. విధులు బహిష్కరించిన కార్మికులు, ఉద్యోగులు... సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో విజయనగరంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. కోట జంక్షన్ నుంచి ప్రారంభమైన ప్రదర్శన కలెక్టరేట్ వరకూ సాగింది. పార్వతీపురం, శృంగవరపుకోటలో భారీ ప్రదర్శనలు జరిగాయి.

శ్రీకాకుళం : జిల్లాలో 45 వేల మంది కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. ఎర్రజెండాలు చేతబూనిన కార్మికులు సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు ఆధ్వర్యాన శ్రీకాకుళంలో ప్రదర్శన నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలపై నినాదాలు చేశారు. రణస్థలం మండల కేంద్రంలోని రామతీర్థం జంక్షన్ నుంచి సిఐటియు ఆధ్వర్యాన ర్యాలీగా వెళ్తున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గోవిందరావుతోపాటు 150 మందిని అరెస్టు చేశారు.

సంపాదకీయం

టీమిండియా చారిత్రాత్మక విజయం

ఆస్ట్రేలియాను ఆస్ట్రేలియా గడ్డపై ఓడించి టెస్టు సిరీస్‌ను 2-1 తేడాతో తొలిసారి చేజిక్కించుకోవడం ద్వారా టీమిండియా చరిత్ర సృష్టించింది. చివరి సిడ్నీ టెస్టులోనూ అమోఘమైన విజయాన్ని నమోదు చేసుకుని తిరుగులేని ఆధిక్యతతో సిరీస్‌ను చేజిక్కించుకోవాలని ఆశించిన భారత్‌కు వాతావరణం పెద్ద అడ్డంకిగా నిలిచింది. ఛతేశ్వర పుజారా (193), రిషబ్ పంత్ (159 నాటౌట్) అద్భుత బ్యాటింగ్‌తో కోహ్లి సేన ఏడు వికెట్ల నష్టానికి 622 పరుగుల వద్ద తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేయగా, ఆస్ట్రేలియా 300 పరుగులకే ఆలౌటయి ఫాలో ఆన్ ఆడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అడిలైడ్, మెల్బోర్న్ టెస్టుల్లో విజయ భేరి మోగించిన టీమిండియా పెర్త్‌లో ఓటమిపాలైనప్పటికీ ప్రతిష్టాత్మకమైన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని గెలుచుకోవడం సామాన్యమైన విషయమేమీ కాదు. ఆస్ట్రేలియాను ఆస్ట్రేలియా గడ్డపై ఓడించిన తొలి ఆసియా దేశం కూడా భారత్‌యే కావడం విశేషం. ఇంగ్లండ్, వెస్టిండీస్, పాకిస్తాన్ జట్లను ఓడించడం తేలికే కానీ, ఆస్ట్రేలియాను ఆస్ట్రేలియా గడ్డపై ఓడించడం అంత తేలికేమీ కాదు. 1947-48లో ఆస్ట్రేలియాలో తొలిసారి టెస్టు సిరీస్ ఆడిన లాలా అమర్‌నాథ్ నేతృత్వంలోని భారత జట్టు 0-4 తేడాతో సిరీస్‌ను కోల్పోయింది. అప్పటి నుంచి ఆస్ట్రేలియాలో టెస్టు సిరీస్ గెలుచుకోవడమనేది ఎండమావిగా మిగిలిపోయింది. మధ్యలో రెండు పర్యాయాలు (1977-78), 1985-86 లో) సిరీస్ చేజిక్కించుకునే అవకాశం వచ్చినట్టే వచ్చి చేజారిపోయింది. దీనికి వాతావరణం, అంపైర్ల వివాదాస్పద నిర్ణయాలు కూడా దీనికి ఒక కారణం. 1970వ దశకంలో బిషన్‌సింగ్ బేడి నేతృత్వంలోని భారత జట్టు 2-3 తేడాతో సిరీస్ కోల్పోయింది. ఆస్ట్రేలియాలో ఒక సిరీస్‌లో భారత్ రెండు టెస్టులు గెలవడం ఒక రికార్డు. ఆ రికార్డును ఛేదించే అవకాశం సిడ్నీలో లభించినట్టే లభించి చేజారింది. 2018లో దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్ పర్యటనల్లో పరాజయంతో నిరాశపరచిన భారత్ ఆస్ట్రేలియాలో సిరీస్‌ను గెలుచుకుని టెస్టు ర్యాంకింగ్స్‌లో ప్రపంచ నెంబర్ వన్ గా తన సత్తా చాటింది. అసాధ్యమనుకున్న దానిని సుసాధ్యం విరాట్ కోహ్లి సేనను అభినందించాల్సిందే. ఆసీస్ సిరీస్ సాధించడం ద్వారా 'సొంత గడ్డపై పులులు, విదేశీ గడ్డపై పిల్లులు' అన్న ముద్రను కొంతవరకు తొలగించింది. భారత జట్టు ఇదివరకెన్నడూ లేనంత దృఢంగా కనిపిస్తుండడానికి బ్యాటింగ్‌లో విరాట్ కోహ్లీకి ఛతేశ్వర్ పుజారా, రిషబ్ పంత్‌లు తోడవడం, బౌలింగ్ విభాగంలో ఇషాంత్ శర్మ, మహ్మద్ సమీలకు మరో అద్భుత పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా జత కలవడం ఒక ముఖ్య కారణం. ఈ సిరీస్‌లో మూడు సెంచరీలతో 521 పరుగులు చేసి 74.43 సగటు రన్ రేటుతో నెంబర్ వన్ బ్యాట్స్‌మన్‌గా నిలవగా, యువ వికెట్ కీపర్ పంత్ చివరి టెస్టులో చెలరేగి ఆడి 159 (నాటౌట్) ఆ తరువాతి స్థానంలో నిలిచాడు. ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్ మురళి విజయ్, కె ఎల్ రాహుల్ సరిగా రాణించకపోయినా మిడిలార్డర్‌లో వచ్చిన వీరు ఆదుకున్నారు. బౌలింగ్‌లో జస్‌ప్రీత్ బుమ్రా అత్యుత్తమ సామర్థ్యాన్ని ప్రదర్శించి ఈ సిరీస్‌లో మొత్తం 21 వికెట్లు పడగొట్టాడు. ఇంతవరకు టి20 ప్లేయర్‌గానే ఉన్న జస్‌ప్రీత్ ఇప్పుడు టెస్టు ఆటగాడిగా తన స్థానాన్ని సుస్థిర పరచుకున్నాడు. స్పిన్నర్ అశ్విన్ మొదటి రెండు టెస్టుల్లో బాగానే ఆడిన వెన్ను నొప్పి కారణంగా ఫిట్‌నెస్ సమస్యతో బాధపడ్డాడు. ఓపెనర్‌గా మయాంక్ అగర్వాల్‌ను మూడో టెస్టులో చేసిన ప్రయోగం ఫలించింది. బాల్ ట్యాంపరింగ్ ఆరోపణలపై సస్పెండ్ అయిన. స్టీవ్ స్మిత్, డేవిడ్ వార్నర్ ఆస్ట్రేలియా జట్టులో లేకపోవడం వల్లే ఆస్ట్రేలియా ఓడిపోయిందని అనడం సరికాదు. ఆ ఇద్దరి స్థానే జట్టులోకి తీసుకున్న ఆటగాళ్లు మంచి పోరాట పటిమనే ప్రదర్శించారు. టెస్టు సిరీస్‌లో దక్షిణాఫ్రికాను దక్షిణాఫ్రికా గడ్డపై ఓడించాలన్న భారత్ లక్ష్యం ఇప్పటికీ నెరవేర లేదు. 191-92లో ఆ దేశంతో సంబంధాలు ఏర్పడినప్పటి నుంచి అంటే గత 28 ఏళ్లుగా ఈ రెండు జట్ల మధ్య జరిగిన పోటీల్లో దక్షిణాఫ్రికాదే పైచేయి. ఆస్ట్రేలియాపై విజయంతో రెట్టించిన ఆత్మ విశ్వాసంతో వున్న టీమిండియా దక్షిణాఫ్రికాలో సిరీస్‌పై కూడా దృష్టి .పెట్టాలి. వచ్చే వేసవిలో ఇంగ్లండ్‌లో జరగనున్న ప్రపంచకప్‌లోనూ భారత్ ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలి.

ఇది విషయం



అహంకార మనునట్టిది
అచ్చముగా వేరుపురుగు
అది పుట్టిన నాటి నుండి
ఆత్మజ్ఞానమ్ము తరుగు

మమకారమ్మనునది క
మ్మని హాలాహలమ్ము సుమ్ము
మనకు తెలియకుండ క్రమ
మ్మున మనల దహించివేయు

- సినారె

విశ్లేషణ

సాటి కేరళీయులారా.. స్వార్థంగా మెలగండి!




చరిత్రలో మతం, రాజకీయం విడివిడిగానే ప్రమాదకరమైనవి అయినప్పుడు, ఆ రెండూ కలిసిన విష కషాయం మరెంత భయంకరంగా వుంటుందో వేరే చెప్పాలా? ఇలాంటిది దేశానికి తీవ్ర పరిణామాలు తెచ్చిపెడుతుందని మీకు మరీ వివరంగా చెప్పవలసిన అవసరం లేదు. ధైర్యం, స్పష్టత, ఇంగిత జ్ఞానం చూపాల్సిన సమయమిది. విశుద్ధమైన స్వార్థాన్ని తగు మోతాదులో తీసుకోవలసిన సమయం. మీ స్వీయ ప్రయోజనాల కోసం, ప్రత్యేకించి దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం చూడండి.

ప్రియ సోదర సోదరీమణులారా!

'సాక్షాత్ దైవభూమి'గా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన కేరళకు చెందినవాళ్లం మనం. బుద్ధిశాలి అయిన ఓ ఉద్యోగి బుర్రలో ఏదో ఆలోచన పుట్టి అమెరికా నుంచి అరువు తెచ్చుకున్న పదం వల్ల మనకీ ప్రచారం దక్కింది. కేరళ పర్యాటక రంగ ప్రోత్సాహానికి ఇదో మసాలాగా పనిచేస్తోంది.

ఓర్పు, సహనం కారణంగానే దేవుడు దేవుడయ్యాడు. దేవత/దేవుడిని మనకు ఇష్టమైన రీతిలో ఉపయోగించుకోవచ్చు. దుర్వినియోగపరచవచ్చు. ఉత్కృష్ట సమయాల్లో సైతం దేవుడిగా వుండడం అంత తేలికేమీ కాదు. ఇప్పుడు మనం దాన్ని నిజమైన పీడకలగా మార్చుతున్నాం. మనకు కనీసం సూత్ర ప్రాయంగానైనా 'మానవ' హక్కులున్నాయి. మన రుజువర్తన, గౌరవాన్ని బట్టి కొద్దిపాటి భద్రతను పొందుతాం. కానీ దేవుడికి ఎలాంటి రక్షణా లేదు! ఎవరైనా సరే దేవునికి పక్షపాతాన్ని, ప్రతికూలతను, మూఢ విశ్వాసాన్ని ఆపాదించవచ్చు. ఆయన దానిని దిగమింగాల్సిందే. మనతో ఎవరైనా ఆవిధంగా ప్రవర్తించడాన్ని మాత్రం ఇష్టపడం. పడతామా? మరి అలాంటప్పుడు దివ్యశక్తికి జరిగే అవమానం నుంచి కాపాడటానికి అందుకోసం రక్తం చిందించడానికి కూడా సిద్ధపడటం ఎలా సంభవిస్తున్నది?



వాల్సన్ థంపు

ఇప్పుడు మతం వంతు వచ్చినట్టు కనిపిస్తోంది. రాజకీయ నాయకుల మొండితనం, దురాశల తాకిడిని తట్టుకుని ఇంకా మిగిలిన దాన్ని మతాల మీద బతికే పరాన్నజీవులు ధ్వంసం చేస్తున్నారు. కాని దేశంలోని ఇతర ప్రాంతాల వారు మనల్ని హేతువాదులు, ప్రగతి శీలులుగా భావిస్తున్నారు.

మత సంస్కరణ ఉద్యమాలు దేశంలోకెల్లా, నిజానికి ప్రపంచంలో కెల్లా కేరళలోనే ఎక్కువగా జరిగాయి. మత సంస్కరణను చేపట్టడం అత్యంత ప్రమాదకరమైన విషయం. ఏసుక్రీస్తు మత సంస్కర్త. ఆయనను చంపివేశారు. కేరళలో శ్రీ నారాయణ గురు కూడా ఆయన మాదిరిగా మత సంస్కర్త. మనం ఆయనను చంప లేదు. గౌరవించాం.

మిత్రులారా గమనించండి: నారాయణ గురు నేడు మన మధ్య వున్నట్టయితే... మత పరమైన ఆచారాలకు, క్రతువులకు కళ్లెం వేయాలన్న లక్ష్యాన్ని సాధించే పనిలో నిమగ్నమైనట్టయితే ...ఆయన బతికి బయటపడగలిగేవారా? ఆయన కాలంతో పోలిస్తే మరి మనం పురోగమించినట్లా? తిరోగమించి నట్లా? 'ఏ మతం అన్న విషయాన్ని పట్టించుకోవద్దు. మీ మతం మిమ్మల్ని మెరుగైన మనిషిగా మలిచినట్టయితే అది సరైనదే' అని బోధించినందుకు ఇవాళ్టి కాలంలో అయితే ఆయనను తిట్టిపోసి దాడి చేసేవారు. సిద్ధాంత పరంగా ఆయనను కొందరు ఆమోదించవచ్చు. కానీ ఆచరణలో ఎస్‌ఎన్‌డిపి దిగ్గజాలు కూడా ఆయనను తోసిపుచ్చుతాయి. అసలు మతం అంటేనే ఒకరినొకరం ద్వేషించుకొని కొట్లాడుకోవడం తప్ప వేరేమీ కాదనే ఈ పరిస్థితి ఎలా వచ్చింది?

ఇలాంటి సందర్భాలలో నేను సమాధానాల కోసం మత శాస్త్రాన్ని గాక, సామాజిక శాస్త్రాలను ఆశ్రయిస్తాను. ఈ విషయంలో మాక్స్ ముల్లర్ రచించిన 'ది సోషియాలజీ ఆఫ్ రెలిజియన్' గ్రంథం అత్యుత్తమమైన లోచూపు నిస్తుంది. ఆయన 'ది రెలిజియన్ ఆఫ్ ఇండియా' అనే మరో పుస్తకం కూడా రాశారు. మతాధిపతుల వర్గం పుట్టుక మత పతనంలో ప్రమాదకర మైన దశగా ఆయన విశదీకరిస్తాడు. మతానికి మూడు స్తంభాలుగా నిలిచే పవిత్ర గ్రంథాలు, క్రతువులు-ఆచారాలు, మూఢ నమ్మకాలను వారు పూర్తిగా గుప్పిట్లో పెట్టుకుంటారు. తమ వర్గ ప్రయోజనాల పరిరక్షణ కోసం అన్ని మతాల పూజారులు చేసే పని ఇది. పవిత్ర గ్రంథాలను తాము మాత్రమే అర్థం చేసుకోగల మనే మూఢత్వ పూరితమైన దుష్ప్రచారాన్ని వారు వ్యాపింప చేస్తారు. సమాజంలో తమకన్నా విద్యావంతులు వున్నా సరే ఈ పని మాత్రం తామే చేయగల మనీ, అత్యంత పవిత్ర క్రతువులను తామే నిర్వహించగలమనీ భావనను నెలకొల్పుతారు. చాందసాలను గుత్తాధిపత్యం కిందకు తేవడానికి ఒకటే కారణం. 'విశ్వాసం వున్నవారు' పురోహితులు ఏది చెప్తే అది ఆలోచనారహితంగా, అలవాటుగా అంగీకరించాలంటే ఇలాంటి గుత్తాధిపత్యం వుంటేనే సాధ్యం.

క్రైస్తవ మత చరిత్రను స్థూలంగా చూసినా మనకో విషయం బోధపడు తుంది. మరీ ముఖ్యంగా మతం, రాజ్యాధికారంతో చేతులు కలిపిన ప్పుడు వ్యక్తి స్వేచ్ఛ, సామాజిక సామరస్యం, మానవ వికాసం అనే వాటికి పురోహిత వర్గం చాలా దారుణమైన ప్రతిబంధకం అవుతుందని తెలుసుకుం టాము. మానవ విముక్తి పతాకగా క్రీస్తు ఉద్దేశించిన క్రైస్తవాన్ని పూజారి వర్గం దిగజార్చి వేసింది. హాస్యాస్పదమైన మూఢ విశ్వాసాలు, అహేతుకమైన ఆధిపత్యాలు, అణచివేత వ్యవస్థలకు ఆమోదముద్ర వేసింది. అమానుష మైన అసమానతల దొంతరల చట్రాన్ని నిలబెట్టడం ఆచారాల పేరిటనే జరిగింది. హృదయాలను విడగొట్టడానికి, ఆత్మలను కలుషితం చేయ డానికి, సమాజాలను అచేతనావస్థలోకి నెట్టడానికి ఆచారాలనే అడ్డుగోడలుగా చేసుకుంది. మూర్ఖ మతావేశంతో ఊహ కందని భయానక నేరాలు, మాటలలో చెప్పలేని క్రౌర్యాలకు పాల్పడింది. క్రీస్తును వెక్కిరించే మత భావాలను వ్యతిరేకించడం కోసం మతాధిపతులు రెచ్చగొట్టిన మూఢత్వంతో లక్షలాది మంది ప్రాణాలు పోగొట్టుకున్నారు. వారిని అమరులని అన్నారు. కాని మనం ఈ రోజున వారిని మతాధిపతులకు బలైన వారిగా చూడవలసి వుంటుంది.

చరిత్రలో మతం, రాజకీయం విడివిడి గానే ప్రమాదకరమైనవి అయినప్పుడు, ఆ రెండూ కలిసిన విష కషాయం మరెంత భయంకరంగా వుంటుందో వేరే చెప్పాలా? కనుక ఇక్కడ ఎ+బి అన్నట్టుగా గాక $(ఎబి)^2$ గా చూడాల్సి వుంటుంది. ఇలాంటిది దేశానికి తీవ్ర పరిణామాలు తెచ్చిపెడుతుందని మీకు మరీ వివరంగా చెప్పవలసిన అవసరం లేదు. మనం లోకువ అవుతాము గనకే మతాధి పతులు రాజకీయ నేతలు పెత్తనం చేయ గలుగుతారు. ఇది రాజకీయ నాయకులు, మతాధిపతులకు మంచి వార్తగానే వుంటుంది. మనకు, మన ముందు తరాలకు మాత్రం చాలా కీడు చేసే దుర్వార్త.

ధైర్యం, స్పష్టత, ఇంగిత జ్ఞానం చూపాల్సిన సమయమిది. విశుద్ధమైన స్వార్థాన్ని తగు మోతాదులో తీసుకోవలసిన సమయం. మీ స్వీయ ప్రయోజనాల కోసం, ప్రత్యేకించి దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం చూడండి. ఇది హోమియోపతి సూత్రం వంటిదే. ఇష్టంతో ఇష్టాన్ని నయం చేయడం. దయచేసి ఎటువంటి రాజీ లేకుండా స్వార్థంతో వ్యవహరించండి. కొందరి దుర్మార్గపు స్వార్థం కారణంగా మీరు ప్రమాదంలో పడుతున్న సమయమిది. ఇప్పుడు మీరు పవిత్రచిత్తం కాపాడుకోగలిగితే ఆ మేరకు స్వార్థపూరితంగా ఎందుకు వుండకూడదు?

(రచయిత సెయింట్ స్టీఫెన్స్ కాలేజీ మాజీ ప్రిన్సిపాల్, న్యూఢిల్లీ)

చర్చ

ప్రై'వేటు' ఎవరి కోసం?

రాష్ట్రంలోని 45,528 ప్రభుత్వ పాఠశాలల్లో 35 లక్షల మంది విద్యార్థులకు వర్తింప చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని నవప్రయాస్, ఏక్తాశక్తి వంటి ప్రైవేటు సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం అప్పజెప్పింది. నెల రోజులుగా ఈ సంస్థల ద్వారా రాష్ట్రంలోని పలు జిల్లాలలో మధ్యాహ్న భోజనం పంపిణీ జరుగుతోంది. ముఖ్యంగా విజయనగరం జిల్లాలో నెల్లిమర్ల కేంద్రంగా నెల్లిమర్ల, విజయనగరం మండలాల్లో సుమారు 87 పాఠశాలలకు భోజనాలు అందిస్తున్నారు. అయితే సమయానికి భోజనం అందించలేక పోవడం అటుంచితే అన్ని పాఠశాలలకు ఒకేసారి అందించాల్సి రావడంతో ముందురోజు అర్ధరాత్రి నుంచే వంట మొదలు పెడుతున్నారు. దీంతో పప్పు, సాంబారు, అన్నం పాచిపోయి కంపు కొడుతున్నాయి. ఈ కారణంతోనే కర్నూలు జిల్లాలో మొన్నటికి మొన్న 130 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 650 పాఠశాలల్లో మూడు క్లస్టర్ పాయింట్ల ద్వారా ఢిల్లీకి చెందిన ఏక్తా శక్తి ఫౌండేషన్‌కు బాధ్యతలు ఇస్తే, ఏలూరుకు సంబంధించిన 214 పాఠశాలల్లో 20,500 మందికి ఈ ఫౌండేషన్ భోజనం అందించ లేకపోయింది. దీంతో విద్యార్థులు బిస్కెట్లు, చిరుతిళ్లతో ఆకలి తీర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. తూర్పు గోదావరిలో 3 గంటల వరకు పాఠశాలలకు భోజనాలు చేరలేదు. అదీ ఉడికీ ఉడకని అన్నం, కంపుకొట్టే పప్పు. ఇదే పరిస్థితి విశాఖ, ఒంగోలు, రాష్ట్రంలో మిగతా జిల్లాల్లో కూడా! సమయానికి భోజనాలు రాకపోవడంతో తరగతుల నిర్వహణలో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



ప్రైవేటు సంస్థలు పంపిణీ చేస్తున్న భోజనాలు చంద్రబాబు నాయుడు చెప్పే లెక్కలకు తప్ప విద్యార్థులు తినడానికి ఉపయోగపడటం లేదు. 500 మంది చదువుతున్న పాఠశాలలో ప్రస్తుతం కేవలం 30 మంది మాత్రమే భోజనం చేస్తున్నారు. వీళ్లు కూడా తప్పనిసరి పరిస్థితుల్లోనే తింటున్నారు. అంటే లెక్కలు చెప్పడానికి తప్ప పేద విద్యార్థి ఆకలి తీర్చేందుకు ఈ ప్రైవేటు భోజనం ఉపయోగపడటం లేదు. సంక్షేమ హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థులకు ఈ ప్రైవేటు సంస్థలు పెట్టే మధ్యాహ్న భోజనం విషంలా మారింది. ఇంటి దగ్గర నుంచి వచ్చే విద్యార్థులు భోజనం బాగా లేకపోతే తల్లిదండ్రులతో చెప్పి ఏదో విధంగా భోజనం ఏర్పాటు చేసుకుంటున్నారు. కానీ సంక్షేమ హాస్టల్ విద్యార్థుల పరిస్థితి వేరు. విద్య కోసం దూర ప్రాంతాల నుండి వచ్చి ఇంటికి దూరంగా వుంటారు. ఉదయం, రాత్రి హాస్టల్‌లో భోజనం చేసినా మధ్యాహ్నం తప్పని సరిగా పాఠశాలలోనే తినాలి. అయితే పాఠశాల భోజనం ప్రైవేటుపర మవ్వడంతో వీరి పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. దీంతో పస్తులతోనే గడపాల్సిన పరిస్థితి వస్తోంది. విశేషం ఏమిటంటే పాఠశాలలో ముందు చెప్పిన 30 మంది తినే వాళ్ల వీరే.

మొన్న రాష్ట్ర ప్రభుత్వం మానవ వనరులపై విడుదల చేసిన శ్వేత పత్రంలో ఐదు రోజులు గుడ్లు, పప్పు, నూనె వంటివి కేంద్రీకృత సరఫరా చేయడం ద్వారా నాణ్యత పెంచాం అని చెప్పింది. కానీ క్షేత్రస్థాయిలో చూసుకుంటే, ఉత్తరాదికి చెందిన ప్రైవేటు సంస్థలు ఆధ్యాత్మిక పరమైనవి కావటంతో కీలకమైన గుడ్డు అందించడానికి నిరాకరిస్తున్నాయి. నిజానికి ఇది విద్యార్థులకు పౌష్టికాహారం అందాలన్న పథక లక్ష్యానికే విరుద్ధం. ఈ సంస్థలు వండుతున్న పప్పు, సాంబారులో ఉల్లిపాయగానీ వెల్లుల్లిగానీ ఉపయోగించే పరిస్థితి కూడా లేదు. విద్యార్థి దశలో తగిన పౌష్టికాహారాన్ని అందించి వారిని సంపూర్ణ ఆరోగ్యకర పౌరులుగా తీర్చిదిద్దటమే ప్రభుత్వ కర్తవ్యం. కానీ ప్రభుత్వం ఆ బాధ్యతల నుండి తప్పుకుంటోంది. ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలకు ఆ పనిని అప్పజెప్పి వారి దగ్గర కమీషన్ ఏజెంట్లుగా మారే దౌర్భాగ్యస్థితిలో పాలకపార్టీ నేతలు ఉన్నారు. ఇటువంటి పరిస్థితిలో సంపూర్ణ ఆరోగ్యంతో బలంగా ఎదిగి రాష్ట్ర ప్రయోజనాల్ని కాపాడాల్సిన విద్యార్థి లోకం ఆదిలోనే పౌష్టికాహారం లోపంతో కృశించిపోతోంది. రాష్ట్రంలో భావి తరాల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. పైగా మధ్యాహ్న భోజనం ప్రైవేటుపరం చేయడం వల్ల 85 వేల మంది ఉద్యోగాలు కోల్పోయారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా మధ్యాహ్న భోజనం నాణ్యత పెంచింది కేరళలోని సిపిఎం ప్రభుత్వం. సాయంత్ర వేళలలో స్నాక్స్ ఇస్తూ విద్యార్థి వ్యక్తిత్వ వికాశానికి ఆరోగ్యకర జీవితానికి దోహదపడుతోంది. కానీ మన రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం కార్పొరేట్ విస్తరణకు, ప్రైవేటు దోపిడీకీ దోహదం చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు మూసి వేసి కార్పొరేట్ విద్యావిస్తరణ లక్ష్యంగా పని చేయడమే దీనికి నిదర్శనం. విద్యా వ్యతిరేక విధానాలే సాక్ష్యం. ఇప్పుడు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటుపరం చేయడం తాజా ఉదాహరణ. రోజుకు 18 గంటలు పని చేస్తున్నానని చెప్పుకుంటున్న చంద్రబాబు నాయుడు నిజంగా విద్యార్థుల భవిష్యత్తు గురించి ఆలోచించివాడైతే మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నిర్వహించాలి. తద్వారా వారికి పోషకాహారాన్ని, ఆరోగ్యాన్ని అందించిన వారౌతారు.

పూడి రామ్మోహన్ రావు
ఎస్‌ఎఫ్‌ఐ విజయనగరం జిల్లా అధ్యక్షులు.

అభిప్రాయం

అవగాహన పెంచాలి



గత దశాబ్ద కాలంలో సహజ ప్రసవాలకంటే సిజేరియన్ ప్రసవాలే ఎక్కువైపోతున్నాయి. మన దేశంలో 2005-06లో 9 శాతంగా వున్న సిజేరియన్ ప్రసవాలు 2015-16 నాటికి 18.5 శాతానికి చేరుకున్నాయి. మన దేశంలోనే కాదు, ప్రపంచ వ్యాప్తంగా సిజేరియన్లు రెట్టింపయ్యాయి. వైద్య కారణాలతో సిజేరియన్ నిర్వహించవచ్చు. కొందరు తల్లిదండ్రులు జాతకాలపై నమ్మకంతో ముహూర్తం మంచి ఘడియలలో డెలివరీ చేయమని వైద్యులపై ఒత్తిడి చేస్తున్నారు. పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందంటే కొందరు డాక్టర్లు 'ఇక్కడ ముహూర్తాల ప్రకారం డెలివరీలు చేయబడవు' అని బోర్డు పెట్టాల్సి వస్తోంది. సరైన వైద్య కారణాలు లేకుండానే కొందరు వైద్యులు సిజేరియన్లు నిర్వహిస్తున్నారు. చిన్న చిన్న పట్టణాల్లో ఉన్న ఆస్పత్రుల్లో సిజేరియన్ పేరుతో పదిహేను వేల నుండి ఇరవై వేల రూపాయలు వసూలు చేస్తున్నారు. అదే కార్పొరేట్ ఆస్పత్రిలో రూ.నలభై నుండి యాభై వేల వరకు ఖర్చు పెడుతున్నారు. సిజేరియన్ ద్వారా పుట్టిన శిశువుకు సరైన మోతాదులో ఆక్సిజన్ అందకపోవడంతో రోజుల తరబడి పిల్లలను ఇంక్యుబులేటర్లలో వుంచుతున్నారు. ఫలితంగా ప్రసవం అయిన తొలి గంటలోపు తల్లి ఇవ్వాల్సిన ముర్రు పాలు బిడ్డకు అందడం లేదు. సరైన వ్యాయామం, కాలి నడక, పౌష్టికాహారం తీసుకోవడం, సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవడం, ద్రవ ఆహార పదార్థాలు తీసుకోవడం, బాల్య వివాహాలని నియంత్రించడం ద్వారా సహజ ప్రసవాలకు ఎక్కువ అవకాశం ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ దిశగా పాలకులు, స్వచ్ఛంద సంస్థలు మరింత కృషి చేయాలి.

యం ఆర్ ప్రదీప్.

సెటైర్

మావయ్య కొంటానన్న మోటర్ సైకిల్

సుబ్రమణ్యం



'మీకు ఉద్యోగాలు కావాలి. ఉద్యోగాలు కల్పించకుండా వొట్టి రిజర్వేషన్లు ఇస్తే ఏం ప్రయోజనం? ఉన్న ఉద్యోగాలనే మింగేసే ఆర్థిక విధానాల వలన కొత్త కొలువులు ఎక్కడొస్తాయి? పోనీ, ప్రైవేటు రంగానికి కూడా రిజర్వేషను నియమం మీ మోడీ వర్తింపజేస్తాడేమో చెప్పగలవా? చెప్పలేవు. ప్రైవేటు యజమానులు రిజర్వేషను పద్ధతికే వ్యతిరేకం. సర్కారీ కొలువుల్లేవు. ఇక రిజర్వేషను వల్ల ఏం ఒరుగుతుంది మీకు? కాబట్టి ఉద్యోగాలు అర్హులందరికీ కల్పించే విధా నాలు మనకి అవసరం అని గమనించండి! బురిడీ కొట్టించే నినాదాలతో ముందుకొచ్చే నాయకుల ఉచ్చుల్లో పడకండి!'

'ఆడు మగాడ్రా బుజ్జీ' అని అరమోడ్పు కన్నులతో ఆరోసారి అన్నాడు శాస్త్రి. అతగాడి తన్మయత్వం చూసి తక్కిన మిత్రులు గందరగోళంలో పడ్డారు. ఎప్పుడో పదిహేనేళ్ల క్రితం కాబోలు మహేష్‌బాబు బ్లాక్‌బాస్టర్ 'అతడు' రిలీజైంది. అందులో తనికెళ్ల భరణి డైలాగు ఇది. శాస్త్రి ఇప్పుడెందుకు అంత తన్మయానికి లోనయ్యాడో వాళ్లకి అర్థం కాలేదు. తన డైలాగుకు రెస్పాన్స్ రాకపోయే సరికి శాస్త్రి కళ్లు పూర్తిగా తెరిచి తాను చెప్పిన డైలాగు ప్రధాని మోడీని ఉద్దేశించినదని క్లారిఫికేషన్ ఇచ్చేడు. 'అవును, నిజమే!' అని శాస్త్రితో ఏకీభవించేడు రాజు. అగ్రవర్ణాలలోని పేదలకి రిజర్వేషన్ల అవసరం ఉందని గుర్తించి ధైర్యంగా పార్లమెంటులో బిల్లు పెట్టగలిగింది మోడీయేనని అక్కడున్న కుర్రాళ్లంతా దాదాపు అంగీకరించేరు. పదవీ కాలమంతా ఊరుకుని చివర్లో ఎన్నికలు మరో రెండు నెలల్లో రాబోతున్నాయనగా ఇప్పుడు ఈ రిజర్వేషన్ల బిల్లు ముందుకు తేవడంలో అంత మగతనం ఏమీ లేదని ప్రతిపక్షాలు విమర్శించిన సంగతినీ ఆ కుర్రాళ్లు చర్చించేరు. ఎప్పుడో ఒకప్పుడు మొత్తానికి ఇప్పుడైనా బిల్లు తెచ్చేడు కదా అని సంతృప్తి వ్యక్తం చేసేరు. అంత మగతనం వుంటే మహిళా రిజర్వేషను బిల్లు ఎందుకు పెట్టలేదన్న ఇంకో విమర్శనూ చర్చించేరు. ఆ బిల్లు కూడా పెట్టేసి వుంటే ఓ పనై పోయి వుండేదని, ఇబిసి రిజర్వేషను బిల్లు ఏ వివాదమూ లేకుండా అమలైపోతే అంతే చాలని ఆ కుర్రాళ్లు ముక్త కంఠంతో ప్రకటించేరు.

ఈ లోపు ఆ పక్క నుంచే పోతున్న రామాలయం పూజారి అవధాన్లు వాళ్లని పలకరించేడు. 'ఏంటయ్యా! కుర్రాళ్లంతా హుషారుగా ఉన్నారే!' అన్నాడు. వాళ్లు చెప్పింది విన్నాక కొంత గాభరాపడ్డాడు. 'ఇప్పుడు పౌరోహిత్యం వృత్తిలో వందకి వంద శాతమూ మేమే ఉన్నాం కదా! దీనిలో వేరే కులాలు వాళ్ళకి వాటా ఇవ్వాలా ఏంటి?' అని తన సందేహాన్ని వెళ్లగక్కేడు. కుర్రాళ్లకి ఏం చెప్పాలో తోచలేదు. ఒక కుర్రాడు మాత్రం 'అదేం లేదండీ! ఇది గవర్నమెంటు ఉద్యోగాలకీ, గవర్నమెంటు చదువులకీ మాత్రమే' అని వివరించేడు. అప్పటికి కొంత కుదుటపడిన అవధాన్లు ఇంటికి పోయేడు. ఈలోపు అక్కడికి వచ్చేడు సూర్యం. అతడో సీనియర్ నిరుద్యోగి. ఇబిసి బిల్లు గురించి కుర్రాళ్లు తమ ఉత్సాహాన్ని సూర్యంతో పంచుకోబోయేరు. అప్పుడు సూర్యం నవ్వేసి 'అబ్బాయిలూ మీకో చిన్న కథ చెప్పాలి' అన్నాడు. ఆ కథ ఇలా సాగింది.

'నా చిన్నతనంలో మా అమ్మమ్మ గారి ఊరెళ్లాను. మావయ్య దగ్గరికెళ్లి పలకరించేను. వెంటనే మావయ్య 'ఏరా! నీకు స్కూటర్ కావాలా? మోటర్ సైకిల్ కావాలా?' అనడిగేడు. మోటర్ సైకిల్ కావాలన్నా. 'సరే! కొనిస్తాన్లే' అని హామీ ఇచ్చేడు. నా సంతోషానికి హద్దుల్లేవిక. వెంటనే మా అమ్మ దగ్గరికెళ్లి ఈ సంగతి చెప్పాను. 'ఎంతైనా అన్నయ్య అన్నయ్యే' అని అమ్మ కూడా మావయ్యను మెచ్చుకుంది. కొంచెంసేపటికి మా పిన్ని కొడుకు వచ్చేడు. వాడికీ మోటర్ సైకిల్ సంగతి చెప్పేను. వెంటనే వాడు మావయ్య దగ్గరికి పరుగు తీసేడు. 'మావ-య్యా! నాకూ మోటర్ సైకిల్ కావాలి' అనడిగేడు. 'నీకు కొనేది లేదు పో' అన్నాడు మావయ్య. పిన్ని కొడుకు ఏడుస్తూ వచ్చి వాళ్లమ్మకి చెప్పుకున్నాడు. పిన్నికి కోపం వచ్చి వాళ్లన్నయ్యతో తగువుకు దిగింది. 'అక్క కొడుకుకి ఓలాగ, నా కొడుక్కు ఓలాగ ప్రవర్తిస్తావా? ఇది న్యాయమేనా? అని నిలదీసింది. 'న్యాయమే అని డిక్లేర్ చేసేశాడు మావయ్య. దాంతో తగువు అమ్మమ్మ దగ్గరికొచ్చింది. 'అక్క కొడుకుకి కొన్నప్పుడు నా కొడుకుకూ కొనాల్సిందే' అని పట్టుబట్టింది పిన్ని. 'నా ఊసెందుకే నీకు? నీకు కావాల్సిందేదో అడుగు. అంతేకాని నా కొడుకు జోలికి రాకు' అంది మా అమ్మ. వాతావరణం వేడెక్కింది. ఈ లోపు మావయ్య అక్కడికి వచ్చేడు. 'ఏరా! అసలు వీడికి మోటర్ సైకిల్ కొనడానికి నీకు డబ్బెక్కడిది?' అని మావయ్యని అడిగింది అమ్మమ్మ. మావయ్య చిద్విలాసంగా నవ్వి జేబులోంచి తమిళనాడు లాటరీ టిక్కెట్టు తీసేడు. 'ఈ రోజు దీన్ని కొనేటప్పుడే అనుకున్నాను. లాటరీ గనుక తగిల్తే మొట్టమొదట నన్ను పలకరించిన మేనల్లుడికి స్కూటరో, మోటర్ సైకిలో కొనివ్వాలని అనుకున్నాను. పెద్ద చెల్లి కొడుకు నన్ను ముందు పలకరించేడు. అందుకే వాడికే కొంటాను' అన్నాడు. మా అమ్మమ్మ పకపకా నవ్వి కూతుళ్లతో 'అదర్రా వీడి వ్యవహారం. మీరే వాడికేదన్నా డబ్బా, దస్కం ఇచ్చి వెళ్లండి. వాడి మొహం! వాడేం కొంటాడు?' అంది. అప్పచెల్లెళ్ళిద్దరూ నవ్వుకుని కబుర్లలో పడ్డారు. నేను మాత్రం చాలా కాలం మావయ్య నాకు ప్రామిస్ చేసిన మోటర్ సైకిల్ ఎప్పుడొస్తుందా అని ఎదురు చూసేవాడిని. మావయ్యకి లాటరీ తగిలిందీ లేదు. నాకు మోటర్ సైకిల్ కొన్నదీ లేదు. ఇదీ కథ.

'దీనికీ, ఇబిసి రిజర్వేషన్లకీ ఏమిటి సంబంధం?' అనడిగేడు రాజు. 'గవర్నమెంటు ఉద్యోగాలు భర్తీ చేపడితేనేగదా రిజర్వేషన్లు అమలయ్యేది? అసలు ఉద్యోగాలేవి? అంతా ఓ పెద్ద గుండు సున్నా. సున్నాలో ఎంత వాటా ఎవరికిచ్చినా దక్కేది సున్నాయే. మోడీ ప్రతి యేడూ రెండు కోట్ల ఉద్యోగాలిస్తానని ఎన్నికల ముందు చెప్పేడు. గెలిచాక రెండు లక్షల ఉద్యోగాలనైనా నింపలేదు. యువత అంతా చాలా కోపం మీదున్నారు. అందుకే ఎన్నికల ముందు ఇబిసి రిజర్వేషన్ల ప్రతిపాదన తెచ్చేడు. ఉద్యోగాలు భర్తీ చేయలేదన్న సంగతి మరిచిపోయి యువత ఈ బిల్లు విషయంలో తగువుల్లోకి దిగుతారు. కొంతమందైనా మళ్లీ మోడీకే ఓట్లేస్తారు. అదీ అసలు రాజకీయం' అని వివరించాడు సూర్యం.

'ఇంతకీ ఇబిసిలకి రిజర్వేషన్లు అవసరం లేదంటావా?' అని రెట్టించేడు శాస్త్రి. 'మీకు ఉద్యోగాలు కావాలి. ఉద్యోగాలు కల్పించకుండా వొట్టి రిజర్వేషన్లు ఇస్తే ఏం ప్రయోజనం? ఉన్న ఉద్యోగాలనే మింగేసే ఆర్థిక విధానాల వలన కొత్త కొలువులు ఎక్కడొస్తాయి? పోనీ, ప్రైవేటు రంగానికి కూడా రిజర్వేషను నియమం మీ మోడీ వర్తింపజేస్తాడేమో చెప్పగలవా? చెప్పలేవు. ప్రైవేటు యజమానులు రిజర్వేషను పద్ధతికే వ్యతిరేకం. సర్కారీ కొలువుల్లేవు. ఇక రిజర్వేషను వల్ల ఏం ఒరుగుతుంది మీకు? కాబట్టి ఉద్యోగాలు అర్హులందరికీ కల్పించే విధా నాలు మనకి అవసరం అని గమనించండి! బురిడీ కొట్టించే నినాదాలతో ముందుకొచ్చే నాయకుల ఉచ్చుల్లో పడకండి!' అని సూర్యం చెప్పడంతో కుర్రాళ్లు ఆలోచనలో పడ్డారు.

'మరో మాట! మగతనం వంటి పదాలు వాడడం మానెయ్యండి!' అని చెప్పి సూర్యం అక్కడి నుండి కదిలేడు.

వ్యాసాలు, ఉత్తరాలు పంపాల్సిన చిరునామా
editpageps@gmail.com

సంపాదకీయం

టీమిండియా చారిత్రాత్మక విజయం

ఆస్ట్రేలియాను ఆస్ట్రేలియా గడ్డపై ఓడించి టెస్టు సిరీస్‌ను 2-1 తేడాతో తొలిసారి చేజిక్కించుకోవడం ద్వారా టీమిండియా చరిత్ర సృష్టించింది. చివరి సిడ్నీ టెస్టులోనూ అమోఘమైన విజయాన్ని నమోదు చేసుకుని తిరుగులేని ఆధిక్యతతో సిరీస్‌ను చేజిక్కించుకోవాలని ఆశించిన భారత్‌కు వాతావరణం పెద్ద అడ్డంకిగా నిలిచింది. ఛతేశ్వర పుజారా (193), రిషబ్ పంత్ (159 నాటౌట్) అద్భుత బ్యాటింగ్‌తో కోహ్లి సేన ఏడు వికెట్ల నష్టానికి 622 పరుగుల వద్ద తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేయగా, ఆస్ట్రేలియా 300 పరుగులకే ఆలౌటయి ఫాలో ఆన్ ఆడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అడిలైడ్, మెల్బోర్న్ టెస్టుల్లో విజయ భేరి మోగించిన టీమిండియా పెర్త్‌లో ఓటమిపాలైనప్పటికీ ప్రతిష్టాత్మకమైన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని గెలుచుకోవడం సామాన్యమైన విషయమేమీ కాదు. ఆస్ట్రేలియాను ఆస్ట్రేలియా గడ్డపై ఓడించిన తొలి ఆసియా దేశం కూడా భారత్‌యే కావడం విశేషం. ఇంగ్లండ్, వెస్టిండీస్, పాకిస్తాన్ జట్లను ఓడించడం తేలికే కానీ, ఆస్ట్రేలియాను ఆస్ట్రేలియా గడ్డపై ఓడించడం అంత తేలికేమీ కాదు. 1947-48లో ఆస్ట్రేలియాలో తొలిసారి టెస్టు సిరీస్ ఆడిన లాలా అమర్‌నాథ్ నేతృత్వంలోని భారత జట్టు 0-4 తేడాతో సిరీస్‌ను కోల్పోయింది. అప్పటి నుంచి ఆస్ట్రేలియాలో టెస్టు సిరీస్ గెలుచుకోవడమనేది ఎండమావిగా మిగిలిపోయింది. మధ్యలో రెండు పర్యాయాలు (1977-78), 1985-86 లో) సిరీస్ చేజిక్కించుకునే అవకాశం వచ్చినట్టే వచ్చి చేజారిపోయింది. దీనికి వాతావరణం, అంపైర్ల వివాదాస్పద నిర్ణయాలు కూడా దీనికి ఒక కారణం. 1970వ దశకంలో బిషన్‌సింగ్ బేడి నేతృత్వంలోని భారత జట్టు 2-3 తేడాతో సిరీస్ కోల్పోయింది. ఆస్ట్రేలియాలో ఒక సిరీస్‌లో భారత్ రెండు టెస్టులు గెలవడం ఒక రికార్డు. ఆ రికార్డును ఛేదించే అవకాశం సిడ్నీలో లభించినట్టే లభించి చేజారింది. 2018లో దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్ పర్యటనల్లో పరాజయంతో నిరాశపరచిన భారత్ ఆస్ట్రేలియాలో సిరీస్‌ను గెలుచుకుని టెస్టు ర్యాంకింగ్స్‌లో ప్రపంచ నెంబర్ వన్ గా తన సత్తా చాటింది. అసాధ్యమనుకున్న దానిని సుసాధ్యం విరాట్ కోహ్లీ సేనను అభినందించాల్సిందే. ఆసీస్ సిరీస్ సాధించడం ద్వారా 'సొంత గడ్డపై పులులు, విదేశీ గడ్డపై పిల్లులు' అన్న ముద్రను కొంతవరకు తొలగించింది. భారత జట్టు ఇదివరకెన్నడూ లేనంత దృఢంగా కనిపిస్తుండడానికి బ్యాటింగ్‌లో విరాట్ కోహ్లీకి ఛతేశ్వర్ పుజారా, రిషబ్ పంత్‌లు తోడవడం, బౌలింగ్ విభాగంలో ఇషాంత్ శర్మ, మహ్మద్ సమీలకు మరో అద్భుత పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా జత కలవడం ఒక ముఖ్య కారణం. ఈ సిరీస్‌లో మూడు సెంచరీలతో 521 పరుగులు చేసి 74.43 సగటు రన్ రేటుతో నెంబర్ వన్ బ్యాట్స్‌మన్‌గా నిలవగా, యువ వికెట్ కీపర్ పంత్ చివరి టెస్టులో చెలరేగి ఆడి 159 (నాటౌట్) ఆ తరువాతి స్థానంలో నిలిచాడు. ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్ మురళి విజయ్, కె ఎల్ రాహుల్ సరిగా రాణించకపోయినా మిడిలార్డర్‌లో వచ్చిన వీరు ఆదుకున్నారు. బౌలింగ్‌లో జస్‌ప్రీత్ బుమ్రా అత్యుత్తమ సామర్థ్యాన్ని ప్రదర్శించి ఈ సిరీస్‌లో మొత్తం 21 వికెట్లు పడగొట్టాడు. ఇంతవరకు టి20 ప్లేయర్‌గానే ఉన్న జస్‌ప్రీత్ ఇప్పుడు టెస్టు ఆటగాడిగా తన స్థానాన్ని సుస్థిర పరచుకున్నాడు. స్పిన్నర్ అశ్విన్ మొదటి రెండు టెస్టుల్లో బాగానే ఆడిన వెన్ను నొప్పి కారణంగా ఫిట్‌నెస్ సమస్యతో బాధపడ్డాడు. ఓపెనర్‌గా మయాంక్ అగర్వాల్‌ను మూడో టెస్టులో చేసిన ప్రయోగం ఫలించింది. బాల్ ట్యాంపరింగ్ ఆరోపణలపై సస్పెండ్ అయిన. స్టీవ్ స్మిత్, డేవిడ్ వార్నర్ ఆస్ట్రేలియా జట్టులో లేకపోవడం వల్లే ఆస్ట్రేలియా ఓడిపోయిందని అనడం సరికాదు. ఆ ఇద్దరి స్థానే జట్టులోకి తీసుకున్న ఆటగాళ్లు మంచి పోరాట పటిమనే ప్రదర్శించారు. టెస్టు సిరీస్‌లో దక్షిణాఫ్రికాను దక్షిణాఫ్రికా గడ్డపై ఓడించాలన్న భారత్ లక్ష్యం ఇప్పటికీ నెరవేర లేదు. 191-92లో ఆ దేశంతో సంబంధాలు ఏర్పడినప్పటి నుంచి అంటే గత 28 ఏళ్లుగా ఈ రెండు జట్ల మధ్య జరిగిన పోటీల్లో దక్షిణాఫ్రికాదే పైచేయి. ఆస్ట్రేలియాపై విజయంతో రెట్టించిన ఆత్మ విశ్వాసంతో వున్న టీమిండియా దక్షిణాఫ్రికాలో సిరీస్‌పై కూడా దృష్టి .పెట్టాలి. వచ్చే వేసవిలో ఇంగ్లండ్‌లో జరగనున్న ప్రపంచకప్‌లోనూ భారత్ ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలి.

ఇదీ విషయం



అహంకార మనునట్టిది
అచ్చముగా వేరుపురుగు
అది పుట్టిన నాటి నుండి
ఆత్మజ్ఞానమ్ము తరుగు

మమకారమ్మనునది క
మ్మని హాలాహలమ్ము సుమ్ము
మనకు తెలియకుండ క్రమ
మ్మున మనల దహించివేయు

- సినారె

విశ్లేషణ

సాటి కేరళీయులారా..స్వార్థంగా మెలగండి!

ప్రియ సోదర సోదరీమణులారా!

'సాక్షాత్ దైవభూమి'గా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన కేరళకు చెందినవాళ్లం మనం. బుద్ధిశాలి అయిన ఓ ఉద్యోగి బుర్రలో ఏదో ఆలోచన పుట్టి అమెరికా నుంచి అరువు తెచ్చుకున్న పదం వల్ల మనకీ ప్రచారం దక్కింది. కేరళ పర్యాటక రంగ ప్రోత్సాహానికి ఇదో మసాలాగా పనిచేస్తోంది.

ఓర్పు, సహనం కారణంగానే దేవుడు దేవుడయ్యాడు. దేవత/దేవుడిని మనకు ఇష్టమైన రీతిలో ఉపయోగించుకోవచ్చు. దుర్వినియోగపరచవచ్చు. ఉత్కృష్ట సమయాల్లో సైతం దేవుడిగా వుండడం అంత తేలికేమీ కాదు. ఇప్పుడు మనం దాన్ని నిజమైన పీడకలగా మార్చుతున్నాం. మనకు కనీసం సూత్ర ప్రాయంగానైనా 'మానవ' హక్కులున్నాయి. మన రుజువర్తన, గౌరవాన్ని బట్టి కొద్దిపాటి భద్రతను పొందుతాం. కానీ దేవుడికి ఎలాంటి రక్షణా లేదు! ఎవరైనా సరే దేవునికి పక్షపాతాన్ని, ప్రతికూలతను, మూఢ విశ్వాసాన్ని ఆపాదించవచ్చు. ఆయన దానిని దిగమింగాల్సిందే. మనతో ఎవరైనా ఆవిధంగా ప్రవర్తించడాన్ని మాత్రం ఇష్టపడం. పడతామా? మరి అలాంటప్పుడు దివ్యశక్తికి జరిగే అవమానం నుంచి కాపాడటానికి అందుకోసం రక్తం చిందించడానికి కూడా సిద్ధపడటం ఎలా సంభవిస్తున్నది?



వాల్సన్ థంపు

ఇప్పుడు మతం వంతు వచ్చినట్టు కనిపిస్తోంది. రాజకీయ నాయకుల మొండితనం, దురాశల తాకిడిని తట్టుకుని ఇంకా మిగిలిన దాన్ని మతాల మీద బతికే పరాన్నజీవులు ధ్వంసం చేస్తున్నారు. కాని దేశంలోని ఇతర ప్రాంతాల వారు మనల్ని హేతువాదులు, ప్రగతి శీలురుగా భావిస్తున్నారు.

మత సంస్కరణ ఉద్యమాలు దేశంలోకెల్లా, నిజానికి ప్రపంచంలో కెల్లా కేరళలోనే ఎక్కువగా జరిగాయి. మత సంస్కరణను చేపట్టడం అత్యంత ప్రమాదకరమైన విషయం. ఏసుక్రీస్తు మత సంస్కర్త. ఆయనను చంపివేశారు. కేరళలో శ్రీ నారాయణ గురు కూడా ఆయన మాదిరిగా మత సంస్కర్త. మనం ఆయనను చంప లేదు. గౌరవించాం.



చరిత్రలో మతం, రాజకీయం విడివిడిగానే ప్రమాదకరమైనవి అయినప్పుడు, ఆ రెండూ కలిసిన విష కషాయం మరెంత భయంకరంగా వుంటుందో వేరే చెప్పాలా? ఇలాంటిది దేశానికి తీవ్ర పరిణామాలు తెచ్చిపెడుతుందని మీకు మరీ వివరంగా చెప్పవలసిన అవసరం లేదు. ధైర్యం, స్పష్టత, ఇంగిత జ్ఞానం చూపాల్సిన సమయమిది. విశుద్ధమైన స్వార్థాన్ని తగు మోతాదులో తీసుకోవలసిన సమయం. మీ స్వీయ ప్రయోజనాల కోసం, ప్రత్యేకించి దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం చూడండి.

మిత్రులారా గమనించండి: నారాయణ గురు నేడు మన మధ్య వున్నట్టయితే... మత పరమైన ఆచారాలకు, క్రతువులకు కళ్లెం వేయాలన్న లక్ష్యాన్ని సాధించే పనిలో నిమగ్నమైనట్టయితే ...ఆయన బతికి బయిటపడగలిగేవారా? ఆయన కాలంతో పోలిస్తే మరి మనం పురోగమించినట్లా? తిరోగమించి నట్లా? 'ఏ మతం అన్న విషయాన్ని పట్టించుకోవద్దు. మీ మతం మిమ్మల్ని మెరుగైన మనిషిగా మలిచినట్టయితే అది సరైనదే' అని బోధించినందుకు ఇవాళ్టి కాలంలో అయితే ఆయనను తిట్టిపోసి దాడి చేసేవారు. సిద్ధాంత పరంగా ఆయనను కొందరు ఆమోదించవచ్చు. కానీ ఆచరణలో ఎస్ఎన్‌డిపి దిగ్గజాలు కూడా ఆయనను తోసిపుచ్చుతాయి. అసలు మతం అంటేనే ఒకరినొకరం ద్వేషించుకొని కొట్లాడుకోవడం తప్ప వేరేమీ కాదనే ఈ పరిస్థితి ఎలా వచ్చింది?

ఇలాంటి సందర్భాలలో నేను సమాధానాల కోసం మత శాస్త్రాన్ని గాక, సామాజిక శాస్త్రాలను ఆశ్రయిస్తాను. ఈ విషయంలో మాక్స్ ముల్లర్ రచించిన 'ది సోషియాలజీ ఆఫ్ రెలిజియన్' గ్రంథం అత్యుత్తమమైన లోచూపు నిస్తుంది. ఆయన 'ది రెలిజియన్ ఆఫ్ ఇండియా' అనే మరో పుస్తకం కూడా రాశారు. మతాధిపతుల వర్గం పుట్టుక మత పతనంలో ప్రమాదకర మైన దశగా ఆయన విశదీకరిస్తాడు. మతానికి మూడు స్తంభాలుగా నిలిచే పవిత్ర గ్రంథాలు, క్రతువులు-ఆచారాలు, మూఢ నమ్మకాలను వారు పూర్తిగా గుప్పిట్లో పెట్టుకుంటారు. తమ వర్గ ప్రయోజనాల పరిరక్షణ కోసం అన్ని మతాల పూజారులు చేసే పని ఇది. పవిత్ర గ్రంథాలను తాము మాత్రమే అర్థం చేసుకోగల మనే మూఢత్వ పూరితమైన దుష్ప్రచారాన్ని వారు వ్యాపింప చేస్తారు. సమాజంలో తమకన్నా విద్యావంతులు వున్నా సరే ఈ పని మాత్రం తామే చేయగల మనీ, అత్యంత పవిత్ర క్రతువులను తామే నిర్వహించగలమనీ భావనను నెలకొల్పుతారు. చాందసాలను గుత్తాధిపత్యం కిందకు తేవడానికి ఒకటే కారణం. 'విశ్వాసం వున్నవారు' పురోహితులు ఏది చెప్తే అది ఆలోచనారహితంగా, అలవాటుగా అంగీకరించాలంటే ఇలాంటి గుత్తాధిపత్యం వుంటేనే సాధ్యం.

క్రైస్తవ మత చరిత్రను స్థూలంగా చూసినా మనకో విషయం బోధపడు తుంది. మరీ ముఖ్యంగా మతం, రాజ్యాధికారంతో చేతులు కలిపిన ప్పుడు వ్యక్తి స్వేచ్ఛ, సామాజిక సామరస్యం, మానవ వికాసం అనే వాటికి పురోహిత వర్గం చాలా దారుణమైన ప్రతిబంధకం అవుతుందని తెలుసుకుం టాము. మానవ విముక్తి పతాకగా క్రీస్తు ఉద్దేశించిన క్రైస్తవాన్ని పూజారి వర్గం దిగజార్చి వేసింది. హాస్యాస్పదమైన మూఢ విశ్వాసాలు, అహేతుకమైన ఆధిపత్యాలు, అణచివేత వ్యవస్థలకు ఆమోదముద్ర వేసింది. అమానుష మైన అసమానతల దొంతరల చట్రాన్ని నిలబెట్టడం ఆచారాల పేరిటనే జరిగింది. హృదయాలను విడగొట్టడానికి, ఆత్మలను కలుషితం చేయ డానికి, సమాజాలను అచేతనావస్థలోకి నెట్టడానికి ఆచారాలనే అడ్డుగోడలుగా చేసుకుంది. మూర్ఖ మతావేశంతో ఊహ కందని భయానక నేరాలు, మాటలలో చెప్పలేని క్రౌర్యాలకు పాల్పడింది. క్రీస్తును వెక్కిరించే మత భావాలను వ్యతిరేకించడం కోసం మతాధిపతులు రెచ్చగొట్టిన మూఢత్వంతో లక్షలాది మంది ప్రాణాలు పోగొట్టుకున్నారు. వారిని అమరులని అన్నారు. కాని మనం ఈ రోజున వారిని మతాధిపతులకు బలైన వారిగా చూడవలసి వుంటుంది.

చరిత్రలో మతం, రాజకీయం విడివిడి గానే ప్రమాదకరమైనవి అయినప్పుడు, ఆ రెండూ కలిసిన విష కషాయం మరెంత భయంకరంగా వుంటుందో వేరే చెప్పాలా? కనుక ఇక్కడ ఎ+బి అన్నట్టుగా గాక (ఎబి)^2 గా చూడాల్సి వుంటుంది. ఇలాంటిది దేశానికి తీవ్ర పరిణామాలు తెచ్చిపెడుతుందని మీకు మరీ వివరంగా చెప్పవలసిన అవసరం లేదు. మనం లోకువ అవుతాము గనకే మతాధి పతులు రాజకీయ నేతలు పెత్తనం చేయ గలుగుతారు. ఇది రాజకీయ నాయకులు, మతాధిపతులకు మంచి వార్తగానే వుంటుంది. మనకు, మన ముందు తరాలకు మాత్రం చాలా కీడు చేసే దుర్వార్త.

ధైర్యం, స్పష్టత, ఇంగిత జ్ఞానం చూపాల్సిన సమయమిది. విశుద్ధమైన స్వార్థాన్ని తగు మోతాదులో తీసుకోవలసిన సమయం. మీ స్వీయ ప్రయోజనాల కోసం, ప్రత్యేకించి దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం చూడండి. ఇది హోమియోపతి సూత్రం వంటిదే. ఇష్టంతో ఇష్టాన్ని నయం చేయడం. దయచేసి ఎటువంటి రాజీ లేకుండా స్వార్థంతో వ్యవహరించండి. కొందరి దుర్మార్గపు స్వార్థం కారణంగా మీరు ప్రమాదంలో పడుతున్న సమయమిది. ఇప్పుడు మీరు పవిత్రచిత్తం కాపాడుకోగలిగితే ఆ మేరకు స్వార్థపూరితంగా ఎందుకు వుండకూడదు?

(రచయిత సెయింట్ స్టీఫెన్స్ కాలేజీ మాజీ ప్రిన్సిపాల్, న్యూఢిల్లీ)

చర్చ

ప్రై'వేటు' ఎవరి కోసం?

రాష్ట్రంలోని 45,528 ప్రభుత్వ పాఠశాలల్లో 35 లక్షల మంది విద్యార్థులకు వర్తింప చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని నవప్రయాస్, ఏక్తాశక్తి వంటి ప్రైవేటు సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం అప్పజెప్పింది. నెల రోజులుగా ఈ సంస్థల ద్వారా రాష్ట్రంలోని పలు జిల్లాలలో మధ్యాహ్న భోజనం పంపిణీ జరుగుతోంది. ముఖ్యంగా విజయనగరం జిల్లాలో నెల్లిమర్ల కేంద్రంగా నెల్లిమర్ల, విజయనగరం మండలాల్లో సుమారు 87 పాఠశాలలకు భోజనాలు అందిస్తున్నారు. అయితే సమయానికి భోజనం అందించలేక పోవడం అటుంచితే అన్ని పాఠశాలలకు ఒకేసారి అందించాల్సి రావడంతో ముందురోజు అర్ధరాత్రి నుంచే వంట మొదలు పెడుతున్నారు. దీంతో పప్పు, సాంబారు, అన్నం పాచిపోయి కంపు కొడుతున్నాయి. ఈ కారణంతోనే కర్నూలు జిల్లాలో మొన్నటికి మొన్న 130 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 650 పాఠశాలల్లో మూడు క్లస్టర్ పాయింట్ల ద్వారా ఢిల్లీకి చెందిన ఏక్తా శక్తి ఫౌండేషన్‌కు బాధ్యతలు ఇస్తే, ఏలూరుకు సంబంధించిన 214 పాఠశాలల్లో 20,500 మందికి ఈ ఫౌండేషన్ భోజనం అందించ లేకపోయింది. దీంతో విద్యార్థులు బిస్కెట్లు, చిరుతిళ్లతో ఆకలి తీర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. తూర్పు గోదావరిలో 3 గంటల వరకు పాఠశాలలకు భోజనాలు చేరలేదు. అదీ ఉడికీ ఉడకని అన్నం, కంపుకొట్టే పప్పు. ఇదే పరిస్థితి విశాఖ, ఒంగోలు, రాష్ట్రంలో మిగతా జిల్లాల్లో కూడా! సమయానికి భోజనాలు రాకపోవడంతో తరగతుల నిర్వహణలో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



ప్రైవేటు సంస్థలు పంపిణీ చేస్తున్న భోజనాలు చంద్రబాబు నాయుడు చెప్పే లెక్కలకు తప్ప విద్యార్థులు తినడానికి ఉపయోగపడటం లేదు. 500 మంది చదువుతున్న పాఠశాలలో ప్రస్తుతం కేవలం 30 మంది మాత్రమే భోజనం చేస్తున్నారు. వీళ్లు కూడా తప్పనిసరి పరిస్థితుల్లోనే తింటున్నారు. అంటే లెక్కలు చెప్పడానికి తప్ప పేద విద్యార్థి ఆకలి తీర్చేందుకు ఈ ప్రైవేటు భోజనం ఉపయోగపడటం లేదు. సంక్షేమ హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థులకు ఈ ప్రైవేటు సంస్థలు పెట్టే మధ్యాహ్న భోజనం విషంలా మారింది. ఇంటి దగ్గర నుంచి వచ్చే విద్యార్థులు భోజనం బాగా లేకపోతే తల్లిదండ్రులతో చెప్పి ఏదో విధంగా భోజనం ఏర్పాటు చేసుకుంటున్నారు. కానీ సంక్షేమ హాస్టల్ విద్యార్థుల పరిస్థితి వేరు. విద్య కోసం దూర ప్రాంతాల నుండి వచ్చి ఇంటికి దూరంగా వుంటారు. ఉదయం, రాత్రి హాస్టల్‌లో భోజనం చేసినా మధ్యాహ్నం తప్పని సరిగా పాఠశాలలోనే తినాలి. అయితే పాఠశాల భోజనం ప్రైవేటుపర మవ్వడంతో వీరి పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. దీంతో పస్తులతోనే గడపాల్సిన పరిస్థితి వస్తోంది. విశేషం ఏమిటంటే పాఠశాలలో ముందు చెప్పిన 30 మంది తినే వాళ్లు వీరే.

మొన్న రాష్ట్ర ప్రభుత్వం మానవ వనరులపై విడుదల చేసిన శ్వేత పత్రంలో ఐదు రోజులు గుడ్లు, పప్పు, నూనె వంటివి కేంద్రీకృత సరఫరా చేయడం ద్వారా నాణ్యత పెంచాం అని చెప్పింది. కానీ క్షేత్రస్థాయిలో చూసుకుంటే, ఉత్తరాదికి చెందిన ప్రైవేటు సంస్థలు ఆధ్యాత్మిక పరమైనవి కావటంతో కీలకమైన గుడ్డు అందించడానికి నిరాకరిస్తున్నాయి. నిజానికి ఇది విద్యార్థులకు పౌష్టికాహారం అందాలన్న పథక లక్ష్యానికే విరుద్ధం. ఈ సంస్థలు వండుతున్న పప్పు, సాంబారులో ఉల్లిపాయగానీ వెల్లుల్లిగానీ ఉపయోగించే పరిస్థితి కూడా లేదు. విద్యార్థి దశలో తగిన పౌష్టికాహారాన్ని అందించి వారిని సంపూర్ణ ఆరోగ్యకర పౌరులుగా తీర్చిదిద్దటమే ప్రభుత్వ కర్తవ్యం. కానీ ప్రభుత్వం ఆ బాధ్యతల నుండి తప్పుకుంటోంది. ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలకు ఆ పనిని అప్పజెప్పి వారి దగ్గర కమీషన్ ఏజెంట్లుగా మారే దౌర్భాగస్థితిలో పాలకపార్టీ నేతలు ఉన్నారు. ఇటువంటి పరిస్థితిలో సంపూర్ణ ఆరోగ్యంతో బలంగా ఎదిగి రాష్ట్ర ప్రయోజనాల్ని కాపాడాల్సిన విద్యార్థి లోకం ఆదిలోనే పౌష్టికాహారం లోపంతో కృశించిపోతోంది. రాష్ట్రంలో భావి తరాల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. పైగా మధ్యాహ్న భోజనం ప్రైవేటుపరం చేయడం వల్ల 85 వేల మంది ఉద్యోగాలు కోల్పోయారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా మధ్యాహ్న భోజనం నాణ్యత పెంచింది కేరళలోని సిపిఎం ప్రభుత్వం. సాయంత్ర వేళలలో స్నాక్స్ ఇస్తూ విద్యార్థి వ్యక్తిత్వ వికాశానికి ఆరోగ్యకర జీవితానికి దోహదపడుతోంది. కానీ మన రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం కార్పొరేట్ విస్తరణకు, ప్రైవేటు దోపిడీకి దోహదం చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు మూసి వేసి కార్పొరేట్ విద్యావిస్తరణ లక్ష్యంగా పని చేయడమే దీనికి నిదర్శనం. విద్యా వ్యతిరేక విధానాలే సాక్ష్యం. ఇప్పుడు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటుపరం చేయడం తాజా ఉదాహరణ. రోజుకు 18 గంటలు పని చేస్తున్నానని చెప్పుకుంటున్న చంద్రబాబు నాయుడు నిజంగా విద్యార్థుల భవిష్యత్తు గురించి ఆలోచించివాడైతే మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నిర్వహించాలి. తద్వారా వారికి పోషకాహారాన్ని, ఆరోగ్యాన్ని అందించిన వారౌతారు.

పూడి రామ్మోహన్ రావు
ఎస్ఎఫ్ఐ విజయనగరం జిల్లా అధ్యక్షులు.

అభిప్రాయం

అవగాహన పెంచాలి



గత దశాబ్ద కాలంలో సహజ ప్రసవాలకంటే సిజేరియన్ ప్రసవాలే ఎక్కువైపోతున్నాయి. మన దేశంలో 2005-06లో 9 శాతంగా వున్న సిజేరియన్ ప్రసవాలు 2015-16 నాటికి 18.5 శాతానికి చేరుకున్నాయి. మన దేశంలోనే కాదు, ప్రపంచ వ్యాప్తంగా సిజేరియన్లు రెట్టింపయ్యాయి. వైద్య కారణాలతో సిజేరియన్ నిర్వహించవచ్చు. కొందరు తల్లిదండ్రులు జాతకాలపై నమ్మకంతో ముహూర్తం మంచి ఘడియలలో డెలివరీ చేయమని వైద్యులపై ఒత్తిడి చేస్తున్నారు. పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందంటే కొందరు డాక్టర్లు 'ఇక్కడ ముహూర్తాల ప్రకారం డెలివరీలు చేయబడవు' అని బోర్డు పెట్టాల్సి వస్తోంది. సరైన వైద్య కారణాలు లేకుండానే కొందరు వైద్యులు సిజేరియన్లు నిర్వహిస్తున్నారు. చిన్న చిన్న పట్టణాల్లో ఉన్న ఆస్పత్రుల్లో సిజేరియన్ పేరుతో పదిహేను వేల నుండి ఇరవై వేల రూపాయలు వసూలు చేస్తున్నారు. అదే కార్పొరేట్ ఆస్పత్రిలో రూ.నలభై నుండి యాభై వేల వరకు ఖర్చు పెడుతున్నారు. సిజేరియన్ ద్వారా పుట్టిన శిశువుకు సరైన మోతాదులో ఆక్సిజన్ అందకపోవడంతో రోజుల తరబడి పిల్లలను ఇంక్యుబులేటర్లలో వుంచుతున్నారు. ఫలితంగా ప్రసవం అయిన తొలి గంటలోపు తల్లి ఇవ్వాల్సిన ముర్రు పాలు బిడ్డకు అందడం లేదు. సరైన వ్యాయామం, కాలి నడక, పౌష్టికాహారం తీసుకోవడం, సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవడం, ద్రవ ఆహార పదార్థాలు తీసుకోవడం, బాల్య వివాహాలని నియంత్రించడం ద్వారా సహజ ప్రసవాలకు ఎక్కువ అవకాశం ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ దిశగా పాలకులు, స్వచ్ఛంద సంస్థలు మరింత కృషి చేయాలి.

యం ఆర్ ప్రదీప్.


సెటైర్

మావయ్య కొంటానన్న మోటర్ సైకిల్

సుబ్రమణ్యం

'ఆడు మగాడ్రా బుజ్జీ' అని అరమోడ్పు కన్నులతో ఆరోసారి అన్నాడు శాస్త్రి. అతగాడి తన్మయత్వం చూసి తక్కిన మిత్రులు గందరగోళంలో పడ్డారు. ఎప్పుడో పదిహేనేళ్ల క్రితం కాబోలు మహేష్‌బాబు బ్లాక్‌బాస్టర్ 'అతడు' రిలీజైంది. అందులో తనికెళ్ల భరణి డైలాగు ఇది. శాస్త్రి ఇప్పుడెందుకు అంత తన్మయానికి లోనయ్యాడో వాళ్లకి అర్థం కాలేదు. తన డైలాగుకు రెస్పాన్స్ రాకపోయే సరికి శాస్త్రి కళ్లు పూర్తిగా తెరిచి తాను చెప్పిన డైలాగు ప్రధాని మోడీని ఉద్దేశించినదని క్లారిఫికేషన్ ఇచ్చేడు. 'అవును, నిజమే!' అని శాస్త్రితో ఏకీభవించేడు రాజు. అగ్రవర్ణాలలోని పేదలకి రిజర్వేషన్ల అవసరం ఉందని గుర్తించి ధైర్యంగా పార్లమెంటులో బిల్లు పెట్టగలిగింది మోడీయేనని అక్కడున్న కుర్రాళ్లంతా దాదాపు అంగీకరించేరు. పదవీ కాలమంతా ఊరుకుని చివర్లో ఎన్నికలు మరో రెండు నెలల్లో రాబోతున్నాయనగా ఇప్పుడు ఈ రిజర్వేషన్ల బిల్లు ముందుకు తేవడంలో అంత మగతనం ఏమీ లేదని ప్రతిపక్షాలు విమర్శించిన సంగతినీ ఆ కుర్రాళ్లు చర్చించేరు. ఎప్పుడో ఒకప్పుడు మొత్తానికి ఇప్పుడైనా బిల్లు తెచ్చేడు కదా అని సంతృప్తి వ్యక్తం చేసేరు. అంత మగతనం వుంటే మహిళా రిజర్వేషను బిల్లు ఎందుకు పెట్టలేదన్న ఇంకో విమర్శనూ చర్చించేరు. ఆ బిల్లు కూడా పెట్టేసి వుంటే ఓ పనై పోయి వుండేదని, ఇబిసి రిజర్వేషను బిల్లు ఏ వివాదమూ లేకుండా అమలైపోతే అంతే చాలని ఆ కుర్రాళ్లు ముక్త కంఠంతో ప్రకటించేరు.

ఈ లోపు ఆ పక్క నుంచే పోతున్న రామాలయం పూజారి అవధాన్లు వాళ్లని పలకరించేడు. 'ఏంటయ్యా! కుర్రాళ్లంతా హుషారుగా ఉన్నారే!' అన్నాడు. వాళ్లు చెప్పింది విన్నాక కొంత గాభరాపడ్డాడు. 'ఇప్పుడు పౌరోహిత్యం వృత్తిలో వందకి వంద శాతమూ మేమే ఉన్నాం కదా! దీనిలో వేరే కులాలు వాళ్ళకి వాటా ఇవ్వాలా ఏంటి?' అని తన సందేహాన్ని వెళ్లగక్కేడు. కుర్రాళ్లకి ఏం చెప్పాలో తోచలేదు. ఒక కుర్రాడు మాత్రం 'అదేం లేదండీ! ఇది గవర్నమెంటు ఉద్యోగాలకీ, గవర్నమెంటు చదువులకీ మాత్రమే' అని వివరించేడు. అప్పటికి కొంత కుదుటపడిన అవధాన్లు ఇంటికి పోయేడు. ఈలోపు అక్కడికి వచ్చేడు సూర్యం. అతడో సీనియర్ నిరుద్యోగి. ఇబిసి బిల్లు గురించి కుర్రాళ్లు తమ ఉత్సాహాన్ని సూర్యంతో పంచుకోబోయేరు. అప్పుడు సూర్యం నవ్వేసి 'అబ్బాయిలూ మీకో చిన్న కథ చెప్పాలి' అన్నాడు. ఆ కథ ఇలా సాగింది.



'మీకు ఉద్యోగాలు కావాలి. ఉద్యోగాలు కల్పించకుండా వొట్టి రిజర్వేషన్లు ఇస్తే ఏం ప్రయోజనం? ఉన్న ఉద్యోగాలనే మింగేసే ఆర్థిక విధానాల వలన కొత్త కొలువులు ఎక్కడొస్తాయి? పోనీ, ప్రైవేటు రంగానికి కూడా రిజర్వేషను నియమం మీ మోడీ వర్తింపజేస్తాడేమో చెప్పగలవా? చెప్పలేవు. ప్రైవేటు యజమానులు రిజర్వేషను పద్ధతికే వ్యతిరేకం. సర్కారీ కొలువుల్లేవు. ఇక రిజర్వేషను వల్ల ఏం ఒరుగుతుంది మీకు? కాబట్టి ఉద్యోగాలు అర్హులందరికీ కల్పించే విధా నాలు మనకి అవసరం అని గమనించండి! బురిడీ కొట్టించే నినాదాలతో ముందుకొచ్చే నాయకుల ఉచ్చుల్లో పడకండి!'

'నా చిన్నతనంలో మా అమ్మమ్మ గారి ఊరెళ్లాను. మావయ్య దగ్గరికెళ్లి పలకరించేను. వెంటనే మావయ్య 'ఏరా! నీకు స్కూటర్ కావాలా? మోటర్ సైకిల్ కావాలా?' అనడిగేడు. మోటర్ సైకిల్ కావాలన్నా. 'సరే! కొనిస్తాన్లే' అని హామీ ఇచ్చేడు. నా సంతోషానికి హద్దుల్లేవిక. వెంటనే మా అమ్మ దగ్గరికెళ్లి ఈ సంగతి చెప్పాను. 'ఎంతైనా అన్నయ్య అన్నయ్యే' అని అమ్మ కూడా మావయ్యను మెచ్చుకుంది. కొంచెంసేపటికి మా పిన్ని కొడుకు వచ్చేడు. వాడికీ మోటర్ సైకిల్ సంగతి చెప్పేను. వెంటనే వాడు మావయ్య దగ్గరికి పరుగు తీసేడు. 'మావ-య్యా! నాకూ మోటర్ సైకిల్ కావాలి' అనడిగేడు. 'నీకు కొనేది లేదు పో' అన్నాడు మావయ్య. పిన్ని కొడుకు ఏడుస్తూ వచ్చి వాళ్లమ్మకి చెప్పుకున్నాడు. పిన్నికి కోపం వచ్చి వాళ్లన్నయ్యతో తగువుకు దిగింది. 'అక్క కొడుకుకి ఓలాగ, నా కొడుక్కు ఓలాగ ప్రవర్తిస్తావా? ఇది న్యాయమేనా? అని నిలదీసింది. 'న్యాయమే అని డిక్లేర్ చేసేశాడు మావయ్య. దాంతో తగువు అమ్మమ్మ దగ్గరికొచ్చింది. 'అక్క కొడుకుకి కొన్నప్పుడు నా కొడుకుకూ కొనాల్సిందే' అని పట్టుబట్టింది పిన్ని. 'నా ఊసెందుకే నీకు? నీకు కావాల్సిందేదో అడుగు. అంతేకాని నా కొడుకు జోలికి రాకు' అంది మా అమ్మ. వాతావరణం వేడెక్కింది. ఈ లోపు మావయ్య అక్కడికి వచ్చేడు. 'ఏరా! అసలు వీడికి మోటర్ సైకిల్ కొనడానికి నీకు డబ్బెక్కడిది?' అని మావయ్యని అడిగింది అమ్మమ్మ. మావయ్య చిద్విలాసంగా నవ్వి జేబులోంచి తమిళనాడు లాటరీ టిక్కెట్టు తీసేడు. 'ఈ రోజు దీన్ని కొనేటప్పుడే అనుకున్నాను. లాటరీ గనుక తగిల్తే మొట్టమొదట నన్ను పలకరించిన మేనల్లుడికి స్కూటరో, మోటర్ సైకిలో కొనివ్వాలని అనుకున్నాను. పెద్ద చెల్లి కొడుకు నన్ను ముందు పలకరించేడు. అందుకే వాడికే కొంటాను' అన్నాడు. మా అమ్మమ్మ పకపకా నవ్వి కూతుళ్లతో 'అదర్రా వీడి వ్యవహారం. మీరే వాడికేదన్నా డబ్బూ, దస్కం ఇచ్చి వెళ్లండి. వాడి మొహం! వాడేం కొంటాడు?' అంది. అప్పచెల్లెళ్ళిద్దరూ నవ్వుకుని కబుర్లలో పడ్డారు. నేను మాత్రం చాలా కాలం మావయ్య నాకు ప్రామిస్ చేసిన మోటర్ సైకిల్ ఎప్పుడొస్తుందా అని ఎదురు చూసేవాడిని. మావయ్యకి లాటరీ తగిలిందీ లేదు. నాకు మోటర్ సైకిల్ కొన్నదీ లేదు. ఇదీ కథ.

'దీనికీ, ఇబిసి రిజర్వేషన్లకీ ఏమిటి సంబంధం?' అనడిగేడు రాజు. 'గవర్నమెంటు ఉద్యోగాలు భర్తీ చేపడితేనేగదా రిజర్వేషన్లు అమలయ్యేది? అసలు ఉద్యోగాలేవి? అంతా ఓ పెద్ద గుండు సున్నా. సున్నాలో ఎంత వాటా ఎవరికిచ్చినా దక్కేది సున్నాయే. మోడీ ప్రతి యేడూ రెండు కోట్ల ఉద్యోగాలిస్తానని ఎన్నికల ముందు చెప్పేడు. గెలిచాక రెండు లక్షల ఉద్యోగాలనైనా నింపలేదు. యువత అంతా చాలా కోపం మీదున్నారు. అందుకే ఎన్నికల ముందు ఇబిసి రిజర్వేషన్ల ప్రతిపాదన తెచ్చేడు. ఉద్యోగాలు భర్తీ చేయలేదన్న సంగతి మరిచిపోయి యువత ఈ బిల్లు విషయంలో తగువుల్లోకి దిగుతారు. కొంతమందైనా మళ్లీ మోడీకే ఓట్లేస్తారు. అదీ అసలు రాజకీయం' అని వివరించాడు సూర్యం.

'ఇంతకీ ఇబిసిలకి రిజర్వేషన్లు అవసరం లేదంటావా?' అని రెట్టించేడు శాస్త్రి. 'మీకు ఉద్యోగాలు కావాలి. ఉద్యోగాలు కల్పించకుండా వొట్టి రిజర్వేషన్లు ఇస్తే ఏం ప్రయోజనం? ఉన్న ఉద్యోగాలనే మింగేసే ఆర్థిక విధానాల వలన కొత్త కొలువులు ఎక్కడొస్తాయి? పోనీ, ప్రైవేటు రంగానికి కూడా రిజర్వేషను నియమం మీ మోడీ వర్తింపజేస్తాడేమో చెప్పగలవా? చెప్పలేవు. ప్రైవేటు యజమానులు రిజర్వేషను పద్ధతికే వ్యతిరేకం. సర్కారీ కొలువుల్లేవు. ఇక రిజర్వేషను వల్ల ఏం ఒరుగుతుంది మీకు? కాబట్టి ఉద్యోగాలు అర్హులందరికీ కల్పించే విధా నాలు మనకి అవసరం అని గమనించండి! బురిడీ కొట్టించే నినాదాలతో ముందుకొచ్చే నాయకుల ఉచ్చుల్లో పడకండి!' అని సూర్యం చెప్పడంతో కుర్రాళ్లు ఆలోచనలో పడ్డారు.

'మరో మాట! మగతనం వంటి పదాలు వాడడం మానెయ్యండి!' అని చెప్పి సూర్యం అక్కడి నుండి కదిలేడు.

వ్యాసాలు, ఉత్తరాలు పంపాల్సిన చిరునామా
editpageps@gmail.com

జున్నులో దాగున్న పోషకాలు



అందరూ ఏదో ఒక సందర్భంలో జున్ను తినే ఉంటారు. అయితే సాధారణంగా జున్నులో పాల కన్నా పోషకాలు ఎక్కువగా ఉంటాయి. జున్నులో దాగున్న ఎన్నో పోషకాలు ఆరోగ్యాన్ని అందిస్తాయని నిపుణులు సూచిస్తున్నారు.

- జున్నులో క్యాల్షియం ఎక్కువగా ఉంది. ఇది దంతాలు, ఎముకలను దృఢంగా చేస్తుంది. గర్భిణీలు జున్ను తినడం వల్ల బిడ్డ ఎదుగుదల సరిగ్గా ఉంటుంది.
- విటమిన్ డి లోపం ఉన్న వారు జున్ను తినడం వల్ల ఆ లోపాన్ని సరి చేసుకోవచ్చు. జున్నును తరచూ తీసుకోవడం వల్ల ఆస్టియోపోరోసిస్ రాకుండా ఉంటుంది.
- హైబీపీ ఉన్న వారు జున్ను తినడం మంచిది. బరువు పెరగాలనుకునే వారికి జున్ను ద్వారా ప్రోటీన్లు, కొవ్వులు అందుతాయి.
- జున్నులో ఉండే విటమిన్ బి2 జీవక్రియలు సరిగ్గా జరిగేందుకు దోహదపడుతుంది. జున్ను తినడం వల్ల చర్మ సౌందర్యం మెరుగుపడుతుంది. జున్నులో ఉండే విటమిన్ ఎ శరీర రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తుంది. విరేచనాలు, మలబద్ధకం వంటి సమస్యలు తగ్గుతాయి. ★

సెలూన్ సిస్టర్స్

పట్టణాల్లో కానీ.. పల్లెల్లో కానీ సెలూన్ షాపుల్లో పురుషులే ఎక్కువగా పనిచేస్తుంటారు. కానీ, ఉత్తరప్రదేశ్‌లోని కుశీనగర్ జిల్లాలోని ఓ సెలూన్‌లో మాత్రం ఇద్దరమ్మాయిలు పనిచేస్తున్నారు. అదీ పురుషులకు హెయిర్ కట్ చేయడం, షేవింగ్ చేయడం వంటి పనులు చేస్తున్నారు. అసలు ఆ ఇద్దరమ్మాయిలెవరో? వారెందుకు ఇలాంటి వినూత్నమైన పనికి పూనుకున్నారో తెలుసుకుందాం.

యుపిలోని బన్‌వారి గ్రామానికి చెందినవారు జ్యోతి, నేహా. జ్యోతికి పద్దెనిమిదేళ్లు, నేహాకు పదహారేళ్లు. ఈ ఇద్దరూ అక్కాచెల్లెళ్లు. అందరిలా కాకుండా వీరు చేసే పనుల్లో విభిన్నంగా ఉంటారు. ఇద్దరూ కలిసి వారి గ్రామంలో ఓ సెలూన్ షాపును నడుపుతున్నారు. నేహా, జ్యోతిల తండ్రి పేరు ధ్రువనారాయణ. అతనికి ఆరుగురు అమ్మాయిలు. అతను గ్రామంలోని వారికి హెయిర్ కట్, షేవింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఓ చిన్న దుకాణంలో ఈ పనిని కొనసాగించేవాడు. ఆ పని చేయగా వచ్చే డబ్బులతో నలుగురు అమ్మాయిల పెళ్లిళ్లు చేసేశాడు. కొన్ని సంవత్సరాల క్రితం వీరి కుటుంబంలో అనుకోని సంఘటన జరిగింది. 2014లో అకస్మాత్తుగా తండ్రి అనారోగ్యంతో మంచానపడ్డాడు. దాంతో సెలూన్




షాప్‌ను మూసివేయాల్సి వచ్చింది. ఆ సమయంలో నేహాకి పదకొండేళ్లు. జ్యోతికి పదమూడేళ్లు. తండ్రి అనారోగ్యంతో ఇంట్లో ఆర్థిక సమస్యలు చుట్టుముట్టాయి. తినడానికి తిండి కూడా లేని పరిస్థితి వచ్చింది. అలాంటి సమయంలో జ్యోతికి ఏం చేయాలో పాలుపోలేదు. తల్లి లీలావతి వయసు రీత్యా ఏ పని చేయలేని పరిస్థితి. ఇక, కుటుంబ బాధ్యత జ్యోతిపై పడింది. దాంతో తండ్రి వృత్తినే చేపట్టి, జీవితాన్ని మలుచుకోవాలని నిర్ణయించుకుంది జ్యోతి.

మెరుపులాంటి నిర్ణయం

మూతపడ్డ సెలూన్ షాపును పున:ప్రారంభించింది జ్యోతి. మొదట్లో ఆ పనిని నేర్చుకోవడం కోసం చాలా కష్టపడింది. కుటుంబ పోషణను గుర్తుచేసుకుంటూ, పట్టువదలకుండా ప్రయత్నాన్ని కొనసాగించింది. కానీ, సెలూన్ తెరిచిన తర్వాత అబ్బాయిలు చేసే పని అమ్మాయి చేయడంతో ఆ ఊర్లో వారు వింతగా చూశారు. ఎవ్వరూ అటువైపు అడుగు పెట్టేవారు కాదు. ఏం చేయాలో అర్థం కాక జ్యోతి తనలో తానే మథనపడింది. అబ్బాయి చేసే పనిని అబ్బాయిలా మారి ఎందుకు చేయకూడదు అనుకుంది. అనుకున్నదే తడవుగా తన ఆలోచనకు పదునుపెట్టింది. అబ్బాయిలా కటింగ్ చేయించుకుంది. తన వస్త్రధారణను మార్చుకుంది. వేషం మాత్రమే కాదు, తన మాటతీరును, ప్రవర్తననూ మార్చుకుంది. అంతేకాదు! తన పేరును దీపక్‌గా మార్చుకుంది.

దాంతో మెల్లమెల్లగా సెలూన్‌కు జనాలు రావడం ప్రారంభించారు. ఐదేళ్లలో చిన్న దుకాణం కాస్త పెద్ద సెలూన్ షాపుగా మారిపోయింది. తనతోపాటు చెల్లి నేహా కూడా ఆ పనిని నేర్చుకుంది. అక్కకు తనవంతు సాయమందించింది. ప్రస్తుతం ఇద్దరూ కలిసి సెలూన్ షాపు నడుపుతున్నారు. ఒకపక్క ఇంటిపని, సెలూన్ పని చూసుకునే జ్యోతికి, నేహా సాయంతో కాస్త తీరిక దొరుకుతోంది. వచ్చిన డబ్బులతో తండ్రికి చికిత్స చేయించాలనుకున్నారు. అలా తన తండ్రి ఆరోగ్యం కోసం ఆ ఇద్దరు కూతుళ్లు కష్టపడుతున్నారు. 'మేమిద్దరం కలిసి రోజుకు 400 రూపాయలు సంపాదిస్తున్నాం. కానీ, ఈ పనిని శాశ్వతంగా కొనసాగించాలనుకోవడం లేదు. ఎందుకంటే, ఈ పనిలో మాకేమాత్రం గౌరవం లభించడం లేదు. నాన్న కోలుకునే వరకూ ఈ పని చేయక తప్పదు' అంటోంది జ్యోతి. 'నా కూతుళ్లిద్దరినీ



చూస్తుంటే నాకెంతో గర్వంగా ఉంది. వారిద్దరి ధైర్యం వల్లే మా కుటుంబం మళ్లీ కోలుకుంది. వారి కష్టం వల్లే ఇల్లు నడుస్తుంది' అని గతాన్ని ఓసారి గుర్తుచేసుకుంది తల్లి లీలావతి. 'సమాజం ఏమంటుందోనన్న భయం నాకు లేదు. నా కూతుళ్ల పని చేసి మరీ నన్ను బతికిస్తున్నారు. భవిష్యత్తులో కూడా వారు మరిన్ని గొప్ప పనులు చేస్తారు' అని ఎంతో సంతోషంగా చెబుతున్నాడు తండ్రి. అమ్మాయిలు కడుపులోనే చిదిమేసేవారు, మాకెందుకు ఆడపిల్లల బాధ్యత అనుకునేవారెందరికో వీరిద్దరి జీవితమే ఓ కనువిప్పు కావాలి. ★



సంక్రాంతి పండగ సందడి మొదలయ్యింది. అంటే.. పిండివంటల హడావుడీ మొదలైనట్టే. ఊళ్లల్లో అయితే పెద్దపండగకు నెల ముందే.. రోకటి దంపుళ్ళ చప్పుడు వీధివీధినా లయబద్ధంగా సాగాల్సిందే. సంక్రాంతి పండగ పిండివంటల రుచుల ఘుమఘుమ అలాంటిది. పిల్లలు, పెద్దలూ ఎంతో ఇష్టంగా తినే అచ్చతెలుగు సంప్రదాయ పిండివంటల రుచుల ఆస్వాదనకు సరియైన సమయమూ ఇదే. అయితే, ఇటీవల కాలంలో వస్తున్న జీవనశైలి మార్పుల కారణంగా పిండివంటలకు చాలామంది కాస్త దూరమవుతున్నారు. గ్యాస్ట్రిక్, షుగర్, అజీర్తి వంటి సమస్యలు అందుకు కారణం. అయితే.. అలాంటి వారూ తినేలా, రుచిలోనూ వెరైటీగా ఉండేలా రాగులతో, పుదీనాతో, మజ్జిగతో చేసే పిండివంటల్నీ ఈ పండగవేళ చేసుకోవచ్చు. అలాంటి పసందైన పిండివంటల్ని మీరూ ట్రైచేసి చూడండి!



సంక్రాంతికి సరికొత్తగా

కాజాలు

కావల్సిన పదార్థాలు : గోధుమపిండి - పావుకేజి, కారం - రెండు టేబుల్ స్పూన్లు, జిలకర్ర - టేబుల్ స్పూను, నువ్వులు - టేబుల్ స్పూను, వేడి నూనె - రెండు టేబుల్ స్పూన్లు, నీరు - తగినంత, ఉప్పు - తగినంత. నూనె - డీప్ ఫ్రైకి సరిపడా.

తయారుచేసే విధానం : ముందుగా ఒక బౌల్ తీసుకుని అందులో గోధుమపిండి, కారం, జీలకర్ర, నువ్వులు, తగినంత ఉప్పు వేసి బాగా కలుపుకోవాలి. అందులో కొద్దిగా వేడిచేసిన నూనె కూడా వేసుకోవాలి. ఆ పిండిని కొద్ది కొద్దిగా నీటిని కలుపుకుంటూ చపాతీ పిండిలా కలుపుకోవాలి. ఈ పిండిని ఇరవై నిమిషాల పాటు పక్కన ఉంచాలి. ఇప్పుడు ఈ పిండిని పల్చగా కాకుండా కొద్దిగా మందంగా ఉండే చపాతీలా చేసుకుని డైమండ్ షేప్‌లా కట్ చేసుకోవాలి. ఇప్పుడు స్టౌపై పాన్ పెట్టి, నూనె వేడి చేసుకొని అందులో ముందుగా కట్ చేసి పెట్టుకున్న డైమండ్ కాజాల్ని వేసి బంగారురంగు వచ్చేవరకూ వేయించుకోవాలి.

కొబ్బరి చెగోడీలు

కావల్సిన పదార్థాలు : బియ్యం పిండి - ఒకటిన్నర కప్పు, తాజా కొబ్బరితురుము - అరకప్పు, పెసరపప్పు - టేబుల్‌స్పూను, కారం - చెంచా, ఉప్పు - తగినంత, నూనె - వేయించేందుకు సరిపడా.

తయారుచేసే విధానం : పెసరపప్పును అరగంట ముందు నానబెట్టుకోవాలి. కొబ్బరి తురుమును మిక్సీలో అవసరాన్నిబట్టి నీళ్లు కలుపుకుంటూ మెత్తని మిశ్రమంలా చేసుకోవాలి. ఇప్పుడు అడుగు మందంగా ఉన్న గిన్నెలో ఒకటిన్నర కప్పు నీళ్లు తీసుకుని పొయ్యిమీద పెట్టాలి. అవి మరిగాక మూడు చెంచాల నూనె, కొద్దిగా ఉప్పూ, నానబెట్టిన పెసరపప్పూ, కారం, కొబ్బరి ముద్ద, బియ్యప్పిండి వేసుకుంటూ మంట తగ్గించాలి. రెండు నిమిషాలకు అది గట్టిగా అవుతుంది. దీన్నే ఉక్కిరిపట్టడం అంటారు. తర్వాత దించేయాలి. ఇది చల్లారాక చేతులకు నూనె రాసి, చేగోడీల్లా చేసుకోవాలి. వీటిని కాగుతోన్న నూనెలో వేసి, వేగాక తీసేసుకుంటే సరిపోతుంది.

చల్ల చక్రాలు

కావల్సిన పదార్థాలు : పెరుగు - రెండు కప్పులు (పెరుగుకు బదులు మజ్జిగని కూడా ఉపయోగించుకోవచ్చు), బియ్యపిండి ఐదు కప్పులు, ఉప్పు- తగినంత, కారం - సరిపడా, నువ్వులు - పావుకప్పు, నూనె- డీప్ ఫ్రై కి సరిపడా.

తయారుచేసే విధానం : ఒక గిన్నెలో పెరుగు, బియ్యపిండి, ఉప్పు, కారం, నువ్వులు, కొద్దిగా కాచిన నూనె వేసి నీటిని తగినంతగా కలుపుకుంటూ, పిండిని ముద్దలా తయారుచేసుకోవాలి. తర్వాత స్టౌపై పాన్‌లో నూనె వేడి చేసుకోవాలి. నూనె వేడెక్కాక ముందుగా తయారుచేసి పెట్టుకున్న ఈ పిండి ముద్దని కొద్ది కొద్దిగా తీసుకుంటూ, చక్రాల గిద్దలలో పెట్టి, వత్తుకోవాలి. అవి ఎర్రగా వేగాక ప్లేట్‌లోకి తీసుకుంటే చల్ల చక్రాలు రెడీ!



జానకి బడుగు, పోషకాహార నిపుణులు

ఎవరైనా తినొచ్చు

రాగిపిండిలో క్యాల్షియంతో పాటు ఐరన్ పుష్కలంగా ఉంటుంది. ఇంకా విటమిన్-బి ఉంటుంది. చల్ల చక్రాలు క్యాల్షియం నిస్తాయి. కొబ్బరి పుదీనా చక్రాలలో ఫైబర్ అధికంగా ఉంటుంది. వీటిలోనూ విటమిన్ - బి ఉంటుంది. కారం కాజాలు శక్తిని ఇవ్వడమే కాకుండా ఎక్కువకాలం నిల్వ ఉంటాయి. వీటిని పిల్లలు, పెద్దలు, షుగర్ వ్యాధిగ్రస్తులు తినొచ్చు.



రాగిపిండి చెక్కలు

కావాల్సిన పదార్థాలు : రాగి పిండి - కప్పు, పుట్నాలు - ఐదు చెంచాలు, ఉప్పు - రుచికి సరిపడా, కారం - చెంచా, నూనె - వేయించడానికి సరిపడా, వాము- కొద్దిగా, నీరు - గ్లాసు, బియ్యం పిండి - నాలుగు చెంచాలు.

తయారుచేసే విధానం : ముందుగా స్టవ్ వెలిగించి గిన్నె పెట్టుకొని కొన్ని నీళ్ల పోసి అందులో కొంచెం వాము వేసి ఐదు నిమిషాలపాటు వేడి చేసుకొని, స్టవ్ కట్టేయాలి. ఇప్పుడు మరొక గిన్నె తీసుకొని అందులో రాగి పిండి, ఉప్పు, కారం, పుట్నాలు వేసుకొని, కలుపుకోవాలి. ఇందులో కాచిన నూనె, కొంచెం బియ్యం పిండి, వాము నీళ్ల పోసి, పిండికి సరిపడా మరికొన్ని నీళ్ల కలుపుకుంటూ ముద్దలా చేసుకోవాలి. ఇప్పుడు అరచేతిలో నూనె రాసుకొని చెక్కల్లా ఒత్తుకోవాలి. (లేకపోతే పూరీప్రెస్‌పై కూడా ఒత్తుకోవచ్చు). ఇలా అన్నీ చేసి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు పొయ్యి వెలిగించి, నూనె వేడి అయ్యాక తయారుచేసిపెట్టుకున్న చెక్కలు కొన్ని కొన్ని వేసి, ఫ్రై చేసుకోవాలి. ఇవి కరకరలాడుతూ బాగుంటాయి.




పుదీనా చక్రాలు

కావల్సిన పదార్థాలు : బియ్యం పిండి - కప్పు, శనగపిండి - అరకప్పు, బాదంపప్పులు - ఐదు, పుదీనా ఆకులు - పది, వెల్లుల్లి - రెండు, కారం - టేబుల్ స్పూను, నువ్వులు - ఒకటిన్నర టేబుల్ స్పూను, ఉప్పు - తగినంత, నెయ్యి లేదా బటర్ - టేబుల్ స్పూను, ఇంగువ- కొద్దిగా, నూనె - డీప్ ఫ్రైకి సరిపడా.

తయారుచేసే విధానం : పుదీనా ఆకులు, బాదంపప్పు, వెల్లుల్లిని కలిపి మెత్తగా పేస్ట్‌లా చేసుకోవాలి. తర్వాత ఒక గిన్నె తీసుకొని అందులో బియ్యం పిండి, శనగపిండి, ఉప్పు, కారం, కొద్దిగా ఇంగువ, నువ్వులు, నెయ్యి లేదా వెన్న, ముందుగా తయారుచేసి పెట్టుకున్న పుదీనా పేస్ట్‌ని కూడా వేసి కొద్దిగా కొద్దిగా నీటిని పోస్తూ పిండిని బాగా మెత్తగా కలుపుకోవాలి. స్టౌపై పాన్‌లో నూనె వేడి చేసుకొని, ఇప్పుడు ఈ పిండి మిశ్రమాన్ని చక్రాల గిద్దలలో పెట్టి, వేడి నూనెలో ఒత్తుకోవాలి. అవి బంగారువర్ణంలోకి వచ్చేవరకూ వేయించుకోవాలి. చల్లారిన తర్వాత గాలిచొరవని డబ్బాల్లో పెట్టుకుంటే నిల్వ ఉంటాయి. ఈ పుదీనా చక్రాలు భలే రుచిగా ఉంటాయి.

బహుమతి పొందిన ముగ్గు



ఎ. రాధ, ఒంగోలు, ప్రకాశంజిల్లా.



13 చుక్కలు
7 వచ్చే వరకు
మధ్యచుక్క

21 చుక్కలు
11 వచ్చేవరకు
మధ్యచుక్క





ఎ.లక్ష్మీ ప్రసన్న, మండపేట, తూర్పుగోదావరిజిల్లా.



మీకోసం

టూత్ పేస్టుపై కాస్త పసుపు వేసి తోముకుంటే పళ్లపై పచ్చని గార పోతుంది.

జీవన సౌరభం

నలుగురి కోసం నడిచేదారిలో నడక కష్టం. అయినా దారి మంచిదైతే నడక ఆపకూడదు. ఎందుకంటే భవిష్యత్తులో అదే పూలబాట కాగలదు.

సెన్సెక్స్ ⬆ 131
35,980

నిఫ్టీ ⬆ 30
10,802

రూపాయి ⬇ 51 పై
అమెరికా డాలరుకు రూ. 70.19

బ్యాంబూ రీసెర్చ్‌తో ఐటిసి ఒప్పందం



ప్రముఖ ఎఫ్‌ఎంసిజి కంపెనీ ఐటిసి తన మంగళదీప్ అగర్‌బత్తీల కోసం మహారాష్ట్రలోని చిచ్‌పల్లిలోని బ్యాంబూ రీసెర్చ్ అండ్ ట్రెయినింగ్ సెంటర్ (బిఆర్‌టిసి)తో ఒప్పందం కుదుర్చుకుంది. ఆ రాష్ట్ర కేబినెట్ మంత్రి కిరన్ ముంగటివ సమక్షంలో ఐటిసి అగర్‌బత్తి బిజినెస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ రవి రాయవరమ్, మహారాష్ట్ర బంబూ డెవలప్‌మెంట్ బోర్డు ఎండి టిఎస్‌కె రెడ్డి ఒప్పందాలపై సంతకాలు చేశారు.

ఐఎంఎఫ్ ముఖ్య ఆర్థికవేత్తగా తొలి మహిళ



గీతా గోపీనాథ్

వాషింగ్టన్ : అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్) సంస్థకు ముఖ్య ఆర్థికవేత్తగా గీతా గోపీనాథ్ నియమితులయ్యారు. ఐఎంఎఫ్‌లో ఈ హోదాలో ఒక మహిళ నియామకం కావడం ఇదే తొలిసారి. అందులోనూ భారత్‌కు చెందిన గీతా ఐఎంఎఫ్‌కు 11వ చీఫ్ ఎకనమిస్ట్‌గా గుర్తింపు పొందడం విశేషం. కర్ణాటకకు చెందిన గీతా ఐఎంఎఫ్‌లో అత్యున్నత పదవి పొందిన తొలి మహిళగా రికార్డు సృష్టించారు. హార్వర్డ్ యూనివర్సిటీలో ఆర్థశాస్త్ర ప్రొఫెసర్. ఐఎంఎఫ్ పరిశోధన విభాగం డైరెక్టర్‌గా పనిచేసిన మౌరీ ఆస్ట్‌ఫెల్డ్ డిసెంబరు 31 పదవీ విరమణ పొందారు. దీంతో 47 ఏళ్ల గీతను ఈ అవకాశం వరించింది. గత ఏడాది అక్టోబరు 1వ తేదీనే గీతా గోపీనాథ్‌ను చీఫ్ ఎకనమిస్ట్‌గా నియమించుకుంటున్నట్లు ఐఎంఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టీన్ లగార్డే వెల్లడించారు. ప్రపంచంలోని అత్యుత్తమ ఆర్థికవేత్తల్లో గీతా ఒకరని లగార్డే ప్రశంసించారు.

ఈ పదవి దక్కడం చాలా అరుదైన గౌరవంగా భావిస్తున్నానని గీత సంతోషం వ్యక్తంచేశారు. ప్రస్తుతం ప్రపంచీకరణ నుంచి వెనక్కి తగ్గడం, సుంకాలు పెంపు పెద్ద సవాళ్లుగా మారాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇలాంటి పరిణామాలు గత 50-60 ఏళ్లలో ఎప్పుడూ జరగలేదన్నారు. బహుళజాతి సంస్థలకు ఇబ్బందులు పెరిగాయన్నారు. గత కొద్ది నెలలుగా అమెరికా ప్రభుత్వం చైనా, ఇతర దేశాల ఉత్పత్తులపై టారీఫ్‌లు పెంచుతుందన్నారు. దీంతో వాణిజ్య విధానంలో అనిశ్చితి చోటు చేసుకుందన్నారు. అమెరికా వడ్డీ రేట్లను క్రమంగా పెంచుతున్న నేపథ్యంలో వర్ధమాన దేశాల పరిస్థితి కూడా ఆందోళనకరంగా మారిందన్నారు.

ఒఎన్‌జిసి సేవలు అభినందనీయం

కలెక్టర్ కార్తికేయ మిశ్రా

అంతర్వేదిలో స్వచ్ఛ జలధారకు శ్రీకారం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి



సమాజాభివృద్ధికి ఒఎన్‌జిసి చేస్తున్న కృషి అభినందనీయమని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా అన్నారు. రాజోలు మండలం అంతర్వేదిలో ఒఎన్ జిసి రూ.60 లక్షల సిఎస్‌ఆర్ నిధులతో నిర్మించిన మంచినీటి సరఫరా యంత్రాలతోపాటు బయోటాయిలెట్‌లను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ అంతర్వేదిలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని గుర్తించిన ఒఎన్‌జిసి సిఎస్‌ఆర్ నిధులు కేటాయించి స్వచ్ఛందంగా తాగునీటి సమస్య పరిష్కరించేందుకు ముందుకు వచ్చిందన్నారు. ఒఎన్‌జిసి స్వచ్ఛజలధార కార్యక్రమంలో భాగంగా వాటర్ ఎటిఎం కార్డు ద్వారా ప్రతి ఆధార్ కార్డ్ హోల్డర్‌కూ రోజుకు 20 లీటర్ల చొప్పున తాగునీటిని అందిస్తుందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా సుమారు రూ.20 లక్షలతో ఒఎన్‌జిసి బయోటాయిలెట్లను ఏర్పాటు చేయడాన్ని కలెక్టర్ ప్రశంసించారు. ఎంఎల్‌ఎ గొల్లపల్లి సూర్యారావు మాట్లాడుతూ కోరిన వెంటనే తాగునీటి సమస్యను తీర్చేందుకు ఒఎన్‌జిసి ముందుకొచ్చి కోటి రూపాయల వరకూ ఒఎన్‌జిసి ఖర్చు చేసిందన్నారు. అంతర్వేది దేవస్థానానికి తాగునీటి సమస్యను పరిష్కరించడానికి జిల్లా కలెక్టర్ రూ.72 లక్షలు కేటాయించారన్నారు. ఒఎన్‌జిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డిఎంఆర్ శేఖర్ మాట్లాడుతూ అంతర్వేది పరిసర ప్రాంతాల్లో రూ.65 లక్షల వ్యయంతో వివిధ కార్యక్రమాలను చేపట్టామన్నారు. ఆధార్‌కార్డుతో అనుసంధానం చేసిన 3,500 వాటర్ ఎటిఎం కార్డులను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఒఎన్‌జిసి సీనియర్ అధికారులు టికె పాండే, ఎన్.ఆనంద్, ఆలిండియా ఎస్‌సి, ఎస్‌టి అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు వి.విజయపాల్, డి.ప్రసాదరావు, రాజమహేంద్రవరం అసెట్ ఎస్‌సి, ఎస్‌టి అసోసియేషన్ నాయకులు ఎ.సత్యనారాయణ, పివియు ప్రధాన కార్యదర్శి డివి కృష్ణంరాజు, సెక్రటరీ డి.సురేష్‌కుమార్, ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు రామ్‌నాయక్, రాజేష్, డబ్ల్యుడిఎఫ్ ఛైర్మన్ ఉషా, ఒబిసి అండ్ ఎంఎబిసి ప్రతినిధులు సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఐటి ఎగుమతుల్లో 10% వృద్ధి..!

- 2018-19పై ఇఎస్‌సి ఇడి అంచనా
- గత మూడేళ్లలో హార్డ్‌వేర్‌లో ప్రతికూలత
- సోలార్, యుపిఎస్ సిస్టమ్స్‌లో విస్తృతావకాశాలు

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత ఐటి, ఐటి ఆధారిత ఉత్పత్తుల ఎగుమతుల్లో 8 నుంచి 10 శాతం పెరిగే అవకాశం ఉందని ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ఎక్స్‌పోర్ట్స్ ప్రమోషన్ కౌన్సిల్ (ఇఎస్‌సి) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డికె సరీన్ అన్నారు. ఇదే సమయంలో ఎలక్ట్రానిక్ హార్డ్‌వేర్ ఎగుమతుల్లోనూ సానుకూల వృద్ధి నమోదయ్యే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా సోలార్ పవర్ ఎలక్ట్రానిక్స్, యుపిఎస్ సిస్టమ్స్, ఎలక్ట్రానిక్ ఎనర్జీ మీటర్స్ ఉత్పత్తుల్లో 7-8 శాతం పెరుగొచ్చన్నారు. అయితే ఆర్‌బిఐ తుది గణంకాలు వస్తే తప్పా ఐటి, ఐటిఇఎస్ ఎగుమతుల ఖచ్చిత



మీడియాతో మాట్లాడుతున్న ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డికె సరీన్

గణంకాలు చెప్పలేమన్నారు. కాగా క్రితం రెండు, మూడు త్రైమాసికాల్లో అంచనాలకు తగ్గట్లుగా ఐటి కంపెనీల ప్రగతి ఉందన్నారు. స్థూలంగా 8 నుంచి 10 శాతం వృద్ధి నమోదయ్యే అవకాశాలున్నాయని సరీన్ విశ్లేషించారు.

ఐటి ఎగుమతులు 8 శాతం పెరిగి 137 బిలియన్ డాలర్లుగా ఉండొచ్చని గతేడాది ఫిబ్రవరిలో ఐటి పరిశ్రమ బాడీ నాస్కామ్ అంచనా వేసింది. ఇంతక్రితం 2017-18లో ఐటి ఎగుమతులు 126 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. క్రితం మూడేళ్లలో హార్డ్‌వేర్, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల ఎగుమతుల్లో ప్రతికూలత చోటు చేసుకుందని సరీన్ పేర్కొన్నారు. ముఖ్యంగా చెన్నయ్‌లోని నోకియా ప్లాంట్ ఉత్పత్తిని నిలిపివేయడంతో ఈ రంగం ఎగుమతుల్లో 7 నుంచి 8 శాతం వరకు తగ్గుదల చోటు చేసుకున్నట్లు పేర్కొన్నారు. నోకియా భారీ మొత్తంలో ఉత్పత్తి చేసే ఈ ప్లాంట్‌ను మూసివేయడమే ఇందుకు ప్రధాన కారణమన్నారు. అయితే సోలర్ పవర్ ఎలక్ట్రానిక్స్, యుపిఎస్ సిస్టమ్స్ ఎలక్ట్రానిక్స్ ఎనర్జీ మీటర్లు తదితర కొత్త రంగాల్లో విస్తృత అవకాశాలు కలిసి వస్తున్నాయన్నారు. చైనా నుంచి భారత్‌కు తయారీ పరిశ్రమల రాక పెరిగిందని దీంతో ఎలక్ట్రానిక్ హార్డ్‌వేర్ ఎగుమతులు పెరుగుతున్నాయన్నారు. ఫిబ్రవరి 4, 5 తేదిల్లో హైదరాబాద్‌లో ఇండియా సాఫ్ట్ 19వ ఎడిషన్ ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ అండ్ కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ ఛైర్మన్ నలిని కోహ్లి తెలిపారు. దీనికి 60 దేశాల నుంచి 500 మంది విదేశీ ఐసిటి కొనుగోలుదారులు హాజరు కానున్నారన్నారు. భారత్‌లోని 250 ఐటి కంపెనీలు, 20 విదేశీ కంపెనీలు తమ ఉత్పత్తులను ఇక్కడ ప్రదర్శించనున్నాయని తెలిపారు.

బ్యాంకింగ్ షేర్ల మెరుపులు

ఎస్‌బిఐ, కెనరా బ్యాంకు సూచీలు 3% ర్యాలీ

ముంబయి : మొండి బాకీలు తగ్గొచ్చన్న అంచనాల్లో మంగళవారం ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సూచీలు పరుగులు పెట్టాయి. నిఫ్టీలో పిఎస్‌యు బ్యాంకింగ్ సూచీ 2.6 శాతం లాభపడింది. కాగా స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా సూచీ 3.04 శాతం పెరిగి రూ.305.10కి చేరింది. కాగా కెనరా బ్యాంకు సూచీ ఏకంగా 3.45 శాతం లాభపడి రూ.287.85 వద్ద ముగిసింది. బ్యాంకు ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంకు, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, కార్పొరేషన్ బ్యాంకు సూచీలు 1 శాతం నుంచి 3 శాతం వరకు పెరిగాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులు మెరుగైన ప్రగతిని కనబర్చుతున్నాయని, మొండి బాకీలు తగ్గుతున్నాయని ఆర్‌బిఐ గవర్నర్ దాస్ సోమవారం పేర్కొన్నారు. ఆయన వ్యాఖ్యలు పిఎస్‌బి సూచీలకు మద్దతునిచ్చింది.

క్యూ3 ఫలితాలపై ఆశలు..

దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో రోజూ లాభపడ్డాయి. డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికంలో కార్పొరేట్ కంపెనీలు మెరుగైన ఫలితాలు ప్రకటించనున్నాయనే అంచనాల్లో మార్కెట్లకు మద్దతు లభించింది. మంగళవారం బిఎస్‌ఇ సెన్సెక్స్ 131 పాయింట్లు లేదా 0.36 శాతం పెరిగి 35,981కి చేరింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 30 పాయింట్లు లాభపడి 10,802 వద్ద ముగిసింది. సెన్సెక్స్-30లో 16 స్టాక్స్ లాభపడగా, 14 స్టాక్స్ ప్రతికూలతను ఎదుర్కొన్నాయి. సన్ ఫార్మా అధికంగా 3.98 శాతం లాభపడింది. ఆ తర్వాత ఐసిఐసిఐ, ఎస్‌బిఐ, యస్ బ్యాంకు, టాటా మోటార్స్, యాక్సిస్ బ్యాంకు షేర్లు 3.46 శాతం పెరిగాయి. నిఫ్టీ-50లో 26 స్టాక్స్ నష్టపోగా, 24 స్టాక్స్ లాభపడ్డాయి. టెలికం, బ్యాంకింగ్, వైద్య రంగాల సూచీలు అత్యధికంగా పెరిగి మార్కెట్లకు ప్రధాన మద్దతునిచ్చాయి. మరోవైపు కాపిటల్ గూడ్స్, రియాల్టీ స్టాక్స్ అధికంగా నష్టపోయిన వాటిలో టాప్‌లో ఉన్నాయి.

డిజిటల్ చెల్లింపుల ప్యానెల్ హెడ్‌గా నిలేకని

ఆర్‌బిఐ నియామకం

ముంబయి : దేశంలో డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించేందుకు రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) ఐదుగురి సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. దీనికి నందన్ నిలేకనిని హెడ్‌గా నియమించింది. ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుల్లో ఒక్కరైన నిలేకని, ఆధార్ యుఐడిఎఐ ఛైర్మన్‌గా కూడా పని చేసిన అనుభవం ఉంది. డిజిటల్ చెల్లింపుల్లో భద్రతలు, ఈ రంగాన్ని బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఈ కమిటీ సూచనలు చేయనుంది. ఈ కమిటీకి చట్టబద్ధత కూడా కల్పించినట్లు ఆర్‌బిఐ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ కమిటీలో ఆర్‌బిఐ డిప్యూటీ గవర్నర్ హెచ్‌ఆర్ ఖాన్, విజయా బ్యాంకు మాజీ ఎండి, సిఇఒ కిశోర్ సాన్సీ, ఐటి మంత్రిత్వ శాఖ మాజీ కార్యదర్శి అరుణా శర్మ, సిఐఐఇ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ సంజయ్ జైన్ సభ్యులుగా ఉన్నారు.


ఇన్ఫోసిస్‌కు టాప్ ఎగ్జిక్యూటివ్ రాజీనామా

బెంగళూరు : దేశంలోనే రెండో అతిపెద్ద ఐటి సేవల కంపెనీ ఇన్ఫోసిస్‌కు మరో టాప్ ఎగ్జిక్యూటివ్ గుడ్‌బై చెప్పారు. దాదాపు రెండు దశాబ్దాల పాటు సేవలందించిన ఇన్ఫోసిస్ ఎనర్జీ, యుటిలిటీస్, రిసోర్సెస్ అండ్ సర్వీసెస్ యూనిట్ గ్లోబల్ హెడ్ సుదీప్ సింగ్ తాజాగా రాజీనామా చేశారు. అయితే రాజీనామాకు దారి తీసిన కారణాలపై అటు ఇన్ఫీ, ఇటు సుదీప్ కాని వెల్లడించలేదు. గత సంవత్సరం జనవరిలో యూరోప్ ఆపరేషన్స్ ప్రెసిడెంట్ రాజేష్ కష్ణమూర్తి, అక్టోబర్‌లో గ్లోబల్ హెడ్ కెన్ టూమ్స్, అంతకుముందు, కంపెనీ సిఇఒ ఉన్న రంగనాథ్ ఆ కంపెనీ నుంచి వైదొలిగారు. తాజాగా సుదీప్ రాజీనామా చేయడం ఐటి వర్గాల్లో చర్చనీయాంశం అయ్యింది.

డీఎస్సీ, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

ప్రపంచంలో అత్యధికంగా ప్రోటీన్స్ ఉన్న జీవి?

ఉపాధి





ఎస్.పి. మనోహర్ కుమార్,
టీచర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
నున్న, కృష్ణాజిల్లా.
సెల్ : 9490300637

పిండి పదార్థాలు

పాలీహైడ్రాక్సీ ఆల్డిహైడ్స్ లేదా కీటోన్స్‌నే కార్బోహైడ్రేట్స్ అంటారు.

✧ ఒక రోజుకి కావాల్సిన పరిమాణం: 500 గ్రాములు
✧ వీటిలోని మూలకాలు C, H, O (సి,హెచ్,ఒ)
✧ వీటిలో సి, హెచ్, ఒ ల సాధారణ నిష్పత్తి - 1:2:1
★ **వీటి ముఖ్యవిధి :** శక్తిని అందించడం. కావున, వీటిని శక్తిజనకాలు/ శక్తి ఉత్పాదకాలు అంటారు.
✧ 1 గ్రాము కార్బోహైడ్రేట్ నుంచి 4 కిలో క్యాలరీల శక్తి లభిస్తుంది.
✧ వీటిని గుర్తించడానికి చేసే పరీక్ష అయోడిన్ టెస్ట్. ఈ పరీక్షలో పిండిపదార్థాలు నీలిరంగులోకి మారుతాయి.
★ **ముఖ్యమైన పిండిపదార్థాలు**
1. మోనోశాకరైడ్లు 2. డైశాకరైడ్లు
3. పాలీశాకరైడ్లు

1. మోనోశాకరైడ్లు : ఇవి జలవిశ్లేషణ చెంది, ఇతర పదార్థాలను ఏర్పరచవు.
✧ ఇవి సులభంగా నీటిలో కరిగి, శక్తిని అందిస్తాయి.
ఉదా : గ్లూకోజ్, ఫ్రక్టోజ్, గాలక్టోజ్, రైబోజ్, డీఆక్సీరైబోజ్
ఎ. గ్లూకోజ్ : దీనిని గ్రేప్ సుగర్ అని పిలుస్తారు. బ్లడ్ సుగర్ అంటారు.
✧ రక్తంలో ఉండాల్సిన గ్లూకోజ్ స్థాయి 80-120 మిల్లీగ్రాములు/ 100 మిల్లీగ్రాములు.
✧ దీన్ని కొలిచే పరికరం - గ్లూకోమీటర్
✧ ఇది క్రీడాకారులకు తక్షణ శక్తిని అందిస్తుంది.
✧ మొక్కలలో కిరణజన్య సంయోగక్రియ అనే క్షయకరణ ప్రక్రియ ద్వారా ఏర్పడుతుంది. కావునా రెడ్యూస్డ్ సుగర్ (క్షయకరణ శక్తి) అని అంటారు.
బి. ఫ్రక్టోజ్ : ఇది ప్రపంచంలో అతి తియ్యని చక్కెర.
✧ దీన్ని ఫ్రూట్ సుగర్, హనీ సుగర్ అంటారు.
సి. గాలక్టోజ్ : ఇది పాలలో కరిగిన స్థితిలో ఉంటుంది.
డి. రైబోజ్ : ఇది ఆర్ఎన్ఎలో ఉంటుంది.
ఇ. డీ ఆక్సీ రైబోజ్ : ఇది డిఎన్ఎలో ఉంటుంది.
2. డైశాకరైడ్లు : వీటిలో రెండు మోనోశాకరైడ్లు గ్లైకోసిడిక్ బంధాలతో కలసి ఉంటాయి. కావున నీటిలో కరగడానికి కొంచెం సమయం పడుతుంది.
ఉదా : సుక్రోజ్ (గ్లూకోజ్ + ఫ్రక్టోజ్)
మాల్టోజ్ (గ్లూకోజ్ + గ్లూకోజ్)
లాక్టోజ్ (గ్లూకోజ + గాలక్టోజ్)
ఎ. సుక్రోజ్ : చెరకు నుంచి లభించడం వల్ల కేన్ సుగర్ అని, నిత్యజీవితంలో వాడడంతో టేబుల్ సుగర్ అని అంటారు.
నోట్: ధ్రువ ప్రాంతాల్లోని దేశాలు చక్కెరను బీట్‌రూట్, పొటాటో నుంచి తయారుచేస్తున్నారు.
బి. మాల్టోజ్ : ఇది బార్లీ గింజల్లో ఉండటం వల్ల మాల్ట్ సుగర్ అంటారు. దీనిని ఆల్కహాల్ తయారీలో ఉపయోగిస్తారు.
సి. లాక్టోజ్ : ఇది పాలకు తెలుపు రంగునిస్తుంది. కావున మిల్క్ సుగర్ అంటారు.
3. పాలీశాకరైడ్లు : వీటిలో అనేక గ్లూకోజ్ అణువులు ఒకదాని చేత మరొకటి బంధించి ఉంటాయి.
★ **వీటి మధ్య బంధం :** గ్లైకోసైడిక్ బంధం
✧ ఇవి సులభంగా నీటిలో కరగవు.
ఉదా : సెల్యులోజ్, స్టార్చ్, గ్లైకోజన్, ఖైటిన్.
✧ ఇవి ఒకరకమైన పాలీమర్స్ అనగా నిర్మాణాత్మక ప్రమాణం పదే పదే పునరావృతమవడం.
1. సహజ పాలిమర్లు : పట్టు, ఉన్ని, నూలు, రబ్బర్, కేంద్రక ఆమ్లాలు.
2. కృత్రిమ పాలీమర్లు : పాలీవినైల్ క్లోరైడ్ (పివిసి), నైలాన్, టెరిలీన్, ప్లాస్టిక్.
ఎ. సెల్యులోజ్ : ప్రపంచంలో అతి ఎక్కువగా ఉండే సహజ పాలీమర్
✧ మొక్కలలోని కణకవచంలో ఉండి జంతువుల్లో లోపిస్తుంది.
✧ ఇది మానవుడు వంటి మాంసాహారుల్లో జీర్ణం కాదు. కారణం సెల్యులేజ్‌లోని ఎంజైమ్ లోపం. కానీ శాకాహారులలో ఈ ఎంజైమ్ ఉండటం వల్ల సెల్యులోజ్ జీర్ణమవుతుంది.
బి. స్టార్చ్ : ఇది కూడా మొక్కల్లో మాత్రమే ఉండి, జంతువుల్లో లోపిస్తుంది.
ఉదా : వరి, గోధుమ, మొక్కజొన్న, బంగాళాదుంప
సి. గ్లైకోజన్ : ఇది జంతువుల్లో మాత్రమే ఉండి, మొక్కల్లో లోపిస్తుంది. కావున దీనిని యానిమల్ స్టార్చ్ అంటారు.
✧ ఇది కాలేయం, మెదడు, కండరాల్లో నిల్వ ఉంటుంది.
డి. ఖైటిన్ : ఇది కీటకాల (బొద్దింక) బాహ్య అస్థిపంజరంలో, శిలీంధ్రాల (ఫంగస్) కణకవచంలో ఉంటుంది.
కృత్రిమ చక్కెరలు
✧ డయాబెటిక్ వ్యాధిగ్రస్తుల కోసం తీపిని పెంచి, క్యాలరీలను తగ్గించేవే కృత్రిమ చక్కెరలు.
1. శాకరిన్ : చక్కెర కన్నా 550 రెట్లు ఎక్కువ తీపి.
✧ ఆహరపదార్థాలకు తీపినిచ్చే కృత్రిమ పదార్థం ఇదే.
2. అస్పర్టేమ్ : చక్కెర కన్నా 100 రెట్లు తీపి ఎక్కువ
3. అలిటేమ్ : చక్కెర కన్నా 2000 రెట్లు తీపి ఎక్కువ
4. సుక్రలోజ్ : ఇది చక్కెర కన్నా 320-1000 రెట్లు ఎక్కువ తీపిని కలిగి ఉంటుంది.

మాంసకృత్తులు

వీటిలోని మూలకాలు : C H O N S (Carbon, Hydrogen, Nitrogen, Sulphur)
✧ ఒక గ్రాము ప్రోటీన్ నుంచి లభించే శక్తి = 4 కిలో క్యాలరీలు
✧ ఒక రోజుకి కావాల్సినవి 70 - 100 గ్రాములు.
★ **వీటి ముఖ్య విధులు**
1. పెరుగుదల, అభివృద్ధి
2. ఎంజైమ్, హార్మోన్ల తయారీ
3. యాంటీబాడీస్ (ప్రతిరక్షకాలు) తయారీ
✧ ఇవి శరీరంలోకి వచ్చే బ్యాక్టీరియా, వైరస్‌ల వంటి ప్రతి జనకాల పైన దాడి చేసి, వ్యాధినిరోధక శక్తిని పెంచుతాయి.
✧ వీటిని తయారుచేసే కణంలోని భాగం రైబోజోమ్. కావున దీనిని 'ప్రోటీన్ ఫ్యాక్టరీ' అంటారు.
✧ వీటి తయారీలో రెండు దశలు ఉన్నాయి.
1. అనులేఖనం (ట్రాన్స్‌క్రిప్షన్)
డిఎన్ఎ నుంచి (డీఆక్సీ రైబో న్యూక్లిక్ యాసిడ్) ఎం-ఆర్ఎన్ఎ (మెసెంజర్ ఆర్ఎన్ఎ) ఏర్పాటు.
✧ దీనిలో డిఎన్ఎలోని సమాచారం ఎం-ఆర్ఎన్ఎలోకి వెళ్తుంది.
2. అనువాదం (ట్రాన్స్‌లేషన్) : సమాచారం కలిగిన ఎంఆర్ఎన్ఎ రైబోజోమ్‌ల వద్దకెళ్లి, ప్రోటీన్లను తయారు చేయడాన్ని అనువాదం అంటారు.
★ **ప్రోటీన్లు లభించే పదార్థాలు :** పప్పులు, పాలు, గుడ్లు, మాంసం, చేపలు.
✧ పప్పులను ఇచ్చే మొక్కల సమూహం 'ఫాబేసి/ లెగ్యుమినేసి'
✧ సోయాబీన్‌లో ప్రోటీన్లతో పాటు కార్బోహైడ్రేట్స్, కొవ్వులు, పాలు కూడా ఉంటాయి.
నోట్ : 1. ప్రపంచంలో అత్యధికంగా ప్రోటీన్స్ గల జీవి **- స్పైరులీనా**
2. ప్రపంచంలో అత్యధికంగా ప్రోటీన్స్‌గల పప్పు మొక్క సోయాబీన్.
3. ప్రపంచంలో అత్యధికంగా ప్రోటీన్స్ గల జంతు పదార్థం **- మాంసం**


సోయాబీన్	45 - 50 % ప్రోటీన్లు
చేపలు	15 - 25 % ప్రోటీన్లు
స్పైరులీనా శైవలం	60 - 70 % ప్రోటీన్లు
మాంసం	50 % ప్రోటీన్లు
పుట్టగొడుగులు	19 - 35 % ప్రోటీన్లు

✧ అత్యధిక శాతంలో ప్రోటీన్లు ఉన్నందు వల్ల స్పైరులీనా అనే శైవలాన్ని టాబ్లెట్స్‌గా తయారుచేస్తున్నారు.
✧ ప్రోటీన్ల లోపం వల్ల చిన్న పిల్లల్లో కనబడే వ్యాధి - **క్వాషియోర్కర్ (రెడ్ హెయిర్డ్)**
✧ ఈ పదానికి ఆఫ్రికా భాషలో అర్థం నిర్లక్ష్యానికి గురైన శిశువు (డిస్‌ప్లేస్డ్ చైల్డ్)

ప్రోటీన్ పేరు	**ఉండే ప్రదేశం**
హీమోగ్లోబిన్	రక్తంలోని ఆర్‌బిసి
అల్బుమిన్స్	గుడ్డులోని తెల్లసొన
అల్బుమిన్స్, గ్లోబ్యులిన్స్	రక్తంలోని ప్లాస్మా
కెసిన్	పాలు
కెరాటిన్	చర్మం, వెంట్రుకలు, రోమాలు, ఉన్ని, గోళ్లు, గిట్టలు, కొమ్ములు
ఫైబ్రోయిన్, సిరిసిన్	పట్టుదారం
మయోసిన్	కండరాలు
హిస్టోన్స్	డి.ఎన్.ఎ
కొల్లాజన్	కణబాహ్య వాతావరణం
ఆక్సిన్	ఎముక

అమైనో ఆమ్లాలు

ఇవి ఒకదానితో ఒకటి కలవడం వల్ల ప్రోటీన్లు ఏర్పడతాయి.
✧ వీటిని ప్రోటీన్ల యొక్క 'నిర్మాణాత్మక ప్రమాణాలు' అంటారు.
✧ వీటిలో అమైనో సమూహం (-ఎన్‌హెచ్2), కార్బాక్సిలిక్ సమూహం (సిఒఒహెచ్) ఉంటుంది.
✧ రెండు అమైనో ఆమ్లాల మధ్య ఉండే బంధాన్ని 'పెప్టైడ్ బంధం' అంటారు.
✧ అనేక పెప్టైడ్ బంధాల కలయిక వల్ల ఏర్పడే అమైనో ఆమ్లాల గొలుసును 'పాలీ పెప్టైడ్ గొలుసు' అంటాం.
★ **సృష్టిలోని మొత్తం అమైనో ఆమ్లాల సంఖ్య :** 24
★ **ప్రోటీన్ల తయారీలో పాల్గొనేవి :** 21
★ **చిన్నపిల్లల్లో మాత్రమే ఉండే అమైనో ఆమ్లం :** హిస్టిడిన్
✧ సల్ఫర్ కలిగిన అమైనో ఆమ్లాలు **- మిథియోనిన్, సిస్టీన్, సిస్టైన్**
★ **ఇవి రెండు రకాలు...**



1. ఆవశ్యక అమైనో ఆమ్లాలు : (ఎసెన్షియల్ అమైనో యాసిడ్స్) వీటి సంఖ్య తొమ్మిది.
✧ శరీర పెరుగుదల, అభివృద్ధికి అవసరం.
ఉదా : ట్రిప్టోఫాన్, లైసిన్, హిస్టిడిన్, మిథియోనిన్, ఫినైల్ అలినిన్
2. అనావశ్యక అమైనో ఆమ్లాలు : (నాన్ ఎసెన్షియల్ అమైనో యాసిడ్స్) వీటి సంఖ్య - 12
✧ శరీర పెరుగుదల, అభివృద్ధికి అంతగా అవసరం లేదు.
ఉదా : గ్లుటామిన్, గ్లైసిన్, ఆస్పార్టిక్ ఆమ్లం, ప్రోలిన్, టైరోసిన్ మొదలైనవి.

కొవ్వులు

వీటిలో మూలకాలు - C H O
✧ ఇవి కూడా కార్బోహైడ్రేట్స్ వల్ల శక్తినిస్తాయి. కావున వీటిని శక్తిజనకాలు/ ఉత్పాదకాలు అంటారు.
✧ 1 గ్రాము కొవ్వు నుంచి 9.4 కిలో కేలరీల శక్తి లభిస్తుంది. కావున కార్బోహైడ్రేట్స్, ప్రోటీన్స్ కన్నా ఇది చాలా ఎక్కువ.
✧ ఈ శక్తి భవిష్యత్ అవసరాల కోసం శరీరంలో నిల్వ చేయబడి ఉంటాయి.
✧ ఆహారంలో లభించే, శరీరంలో నిల్వ ఉండే కొవ్వు రూపంలో - ట్రై ఆసైల్ గ్లిసరైడ్స్
✧ ఇవి నీటిలో కరగవు. కానీ క్లోరోఫామ్, ఈథర్, బెంజీన్ వంటి కర్బన ద్రావణాల్లో కరుగుతాయి.
✧ వీటి ఏర్పాటులో ముఖ్యపాత్ర పోషించేవి ఫ్యాటీ ఆమ్లాలు, గ్లిజరాల్. కావున వీటిని కొవ్వుల నిర్మాణాత్మక ప్రమాణాలు అంటారు.
★ **సరళ కొవ్వు ఆమ్లం :** ఫార్మిక్ ఆమ్లం.
★ **కొవ్వు ఆమ్లాలు (ఎఫ్.ఎ) రెండు రకాలు :**
1. అసంతృప్త కొవ్వు ఆమ్లాలు
2. సంతృప్త కొవ్వు ఆమ్లాలు
1. అసంతృప్త కొవ్వు ఆమ్లాలు : ఒక కొవ్వు ఆమ్లంలోని కార్బన్‌ల మధ్య కనీసం ఒక ద్విబంధం/ త్రిబంధం ఉంటే అవి 'అసంతృప్త కొవ్వు ఆమ్లాలు'
✧ ఇక కొవ్వు ఆమ్లంలోని కార్బన్ మధ్య కేవలం ఒక ద్వి లేక త్రిబంధం ఉంటే అవి మోనో అన్‌సాచురేటెడ్ ఫ్యాటీ యాసిడ్స్/ మోనోఇనోయిక్స్.
✧ ఎక్కువ ద్వి లేదా త్రిబంధాలు ఉండేవి. పాలీ అన్‌శాచురేటెడ్ ఫ్యాటీ యాసిడ్స్ (పియుఎఫ్ఎ)
✧ ఇవి మన శరీరంలో ఉత్పత్తి కావు. బయట నుంచి ఆహారంగా తీసుకోవాలి.
✧ ఇవి రక్తప్రసరణను సాఫీగా జరిగేటట్లు చేస్తాయి. ఇవి ఆరోగ్యరీత్యా ఉపయోగకరం.
✧ ఇవి జంతు సంబంధ ఆహార పదార్థాలైన పాలు, గుడ్లు, మాంసం, చేపల్లో ఎక్కువగా ఉంటాయి.
✧ సాల్మన్, మెకరల్, ట్యూనా చేపల్లోని పియుఎఫ్ఎ ను 'ఒమేఘా 3 ఫ్యాటీ యాసిడ్స్' అంటారు.
★ **పత్తి నూనెలోని అసంతృప్త కొవ్వు ఆమ్లాలు :** లినోలిక్, లినోలెనిక్ ఆమ్లం.
★ **వేరుశనగలోని అసంతృప్త కొవ్వు ఆమ్లం :** అరాఖిడినిక్ ఆమ్లం.
నోట్ : 1. చేపలలో, సన్‌ఫ్లవర్ నూనెలో ఎక్కువ మొత్తంలో ఉంటాయి.
2. మొక్కలలోని అసంతృప్త కొవ్వు ఆమ్లాలకు హైడ్రోజన్‌ను కలిపి, వాటిని సంతృప్త స్థితిలోకి మార్చి, డాల్డా/ వనస్పతి (వెజిటేబుల్ ఘీ) ని తయారుచేసే ప్రక్రియను 'హైడ్రోజనేషన్' అంటారు.
★ **ఈ ప్రక్రియకు తోడ్పడే ఉత్ప్రేరకాలు -** Ni, Pt, Pd (నికెల్, ప్లాటినం, పెల్లాడియం)
2. సంతృప్త కొవ్వు ఆమ్లాలు : ఇవి మన శరీరంలో ఉత్పత్తి అవుతాయి. కావున బయటి నుంచి తీసుకోవాల్సిన అవసరం ఉండదు.
✧ ఇవి ఆరోగ్యరీత్యా మంచివి కావు. చెడు కొలెస్ట్రాల్ శాతాన్ని పెంచి, హృదయంపై ప్రభావం చూపుతాయి.
✧ ఇవి ఎక్కువగా మొక్కలలో నూనెల రూపంలో ఉంటాయి.
✧ ద్రవరూపంలోని కొవ్వులను 'నూనెలు/ ఆయిల్స్' అంటారు.
ఉదా : నువ్వు, కొబ్బరి మొదలైనవి.
★ **ద్రాక్షరసంలోని సంతృప్త కొవ్వు ఆమ్లం :** ఎసిటిక్ యాసిడ్
★ **ఆముదంలోని సంతృప్త కొవ్వు ఆమ్లం :** కాప్రిక్ యాసిడ్
★ **ఆవలోని సంతృప్త కొవ్వు ఆమ్లం :** మైరిస్టిక్ యాసిడ్
★ **లో డెన్సిటీ లైపోప్రోటీన్ (ఎల్‌డిఎల్)**
✧ దీన్ని చెడు కొలెస్ట్రాల్ అంటారు.
✧ ఇది సంతృప్త కొవ్వులను ఎక్కువగా తీసుకోవడం వల్ల ఏర్పడుతుంది.
★ **హై డెన్సిటీ లైపోప్రోటీన్ (హెడిఎల్) :** దీన్ని మంచి కొలెస్ట్రాల్ అంటారు.
✧ ఇది అసంతృప్త కొవ్వులను ఎక్కువగా తీసుకోవడం వల్ల ఏర్పడుతుంది.
★ **కొలెస్ట్రాల్ :** ఇది బైల్ నుంచి ఏర్పడిన ఘనస్థితి ఆల్కహాల్.
✧ ఇది మెదడు, నాడీకణాలు, అడ్రినల్ గ్రంథులు, గుడ్డుసొనలో ఎక్కువగా లభిస్తుంది.
✧ శక్తినిచ్చే పదార్థాలైన కార్బోహైడ్రేట్లు, కొవ్వులను ఎక్కువగా తీసుకొని, పని తక్కువగా చేస్తే ఎక్కువ శక్తి 'కొలెస్ట్రాల్' రూపంలోకి మారుతుంది.
✧ ఇది 'అడిపోజ్' అనే కణజాలంలో నిల్వ అవుతుంది.
✧ దీనిలో ఉండే కణాలు **- అడిపోసైట్స్**
★ **దీనివల్ల లాభాలు**
1. శరీర ఉష్ణోగ్రతను బయటకు వెళ్లకుండా నిరోధించడం
నోట్ : 1. మానవ శరీర ఉష్ణోగ్రత -37 డిగ్రీల సెల్సియస్ లేదా 98.4 ఫారన్‌హీట్
2. ఉపవాస సమయంలో శక్తినివ్వడం
3. విటమిన్ డి తయారీ
4. జంతువులు, మొక్కలలోని ప్లాస్మా త్వచం తయారీ
నోట్ : నీటి తిమింగలం, ధృవపు ఎలుగుబంటి, పెంగ్విన్‌లలో శీతల పరిస్థితుల నుంచి తమను తాము రక్షించుకోవడానికి చర్మం కింద ఏర్పడే కొవ్వు పొర **- బ్లబ్బర్.** ★

గిరిజన సమస్యలపై స్పందించిన సిసోడియా

తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశం

ప్రజాశక్తి- గుమ్మలక్ష్మీపురం (విజయనగరం)

విజయనగరం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలంలోని మారుమూల గిరిశిఖర గ్రామాల్లో నెలకొన్న దుర్భర పరిస్థితులను చూసి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆర్‌పి సిసోడియా చలించిపోయారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన బల్లిడి, గడివండరా, రసాబడి, గొయ్యిపాక గ్రామాలను సందర్శించారు. ఇందుకుగాను సుమారు 12 కిలోమీటర్ల దూరం కొండలెక్కి కాలినడకన వెళ్లారు. ఈ గ్రామాల్లోని గిరిజనుల ఇళ్లకు వెళ్లి ఓటరుగా నమోదు చేసుకున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. వారి పేర్లు ఓటరు జాబితాల్లో ఉన్నదీ లేనిదీ స్వయంగా పరిశీలించారు. ఓటరు జాబితాలో కొందరి పేర్లు, ఫొటోలు సరిగా లేకపోవడంతో వాటిని సరిచేయాలని సబ్ కలెక్టర్ చేతన్‌ను ఆదేశించారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరినీ ఓటరుగా నమోదు చేసే బాధ్యత బిఎల్‌ఒలు, రెవెన్యూ సిబ్బందిపై ఉందన్నారు. టంకు గ్రామంలో పాఠశాల భవనం పూర్తి కాకపోవడం, మరుగుదొడ్ల నిర్మాణాలు నాసిరకంగా ఉండటం, తాగునీరు అందుబాటులో లేక గెడ్డనీరు తాగుతుండడాన్ని ఆయన పరిశీలించారు.

పరిశీలన



స్వాధీనం చేసుకున్న ఆభరణాలను పరిశీలిస్తున్న విజయవాడ సిపి ద్వారకా తిరుమలరావు

నగల అక్రమ విక్రేతల గుట్టురట్టు

నలుగురు అరెస్టు - రూ.5.06 కోట్ల ఆభరణాలు స్వాధీనం

ప్రజాశక్తి - విజయవాడ సిటీ ప్రతినిధి

అక్రమ మార్గంలో బంగారాన్ని దిగుమతి చేసుకోవడమే గాకా అడ్డదారిలో దానిని విక్రయించేందుకు యత్నిస్తున్న నలుగురిని విజయవాడ సిటీ టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. విజయవాడ టాస్క్‌ఫోర్స్ ఎసిపి రాజీవ్‌కుమార్‌కు వచ్చిన సమాచారం మేరకు ఓ లాడ్జిలో దాడులు చేయగా 5 కోట్ల 5 లక్షల 98 వేల 765 రూపాయల విలువైన 16.617 కిలోల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నలుగురిని అరెస్టు చేశారు. నగర పోలీసు కమిషనర్ ద్వారకా తిరుమలరావు వివరాలు వెల్లడించారు. ముంబయికి చెందిన జయేష్ జైన్, శైలేష్ జైన్ అనే వారు నగరాన్ని కేంద్రంగా చేసుకుని అక్రమమార్గంలో బంగారం దిగుమతి చేసుకుంటున్నారు. అలా దిగుమతి చేసుకున్న బంగారాన్ని రాష్ట్రంలోని విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం వంటి ప్రాంతాల్లోని వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఈవిధంగా నెలకొకసారి నగరానికి వచ్చి బంగారాన్ని విక్రయిస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ ఎసిపి రాజీవ్‌కుమార్ వీరి కదలికలపై నిఘా పెట్టారు. ఈ నేపథ్యంలో పోలీసులు నలుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు రూ.5.06 కోట్ల విలువైన 16.617 కిలోల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నగరానికి చెందిన మనీష్‌జైన్, పంకజ్‌జైన్ వీరివద్ద నగలను కొనుగోలు చేసి ప్రభుత్వానికి ఎటువంటి పన్నులూ చెల్లించకుండా వాటిని మార్కెట్‌ధరకు ప్రజలకు విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

నేడు దేశవ్యాప్త గ్రామీణ బంద్

- రైతుల సమస్యలపై రహదారులు దిగ్బంధం

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

ఈనెల 8, 9వ తేదీల్లో కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై దేశవ్యాప్త సమ్మె జరుగుతున్న నేపథ్యంలో రెండోరోజైన బుధవారం గ్రామీణ ప్రాంత సమస్యలపై ఆందోళన జరగనుంది. ఇందులో కార్మికులు, రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు పాల్గొననున్నారు. 'గ్రామీణ సడక్ బంద్' (గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల దిగ్బంధనం) చేపట్టాలని కార్మిక సంఘాలతో పాటు, రైతు సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు రాష్ట్రంలోనూ ఎపి రైతు సంఘం (సిపిఎం), ఎపి రైతు సంఘ (సిపిఐ), ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, ఎపి కౌలురైతుల సంఘం ఇతర రైతు సంఘాలు కార్మిక సంఘాలతో కలసి సమ్మెలో పాల్గొంటున్నాయి. దేశవ్యాప్తంగా రైతాంగాన్ని పీడిస్తున్న ప్రధాన సమస్య గిట్టుబటు ధర లభించకపోవడం. స్వామినాథన్ కమిటీ సిఫారసుల మేరకు రైతులకు గిట్టుబాటు ధర అందించే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నది ఈ సమ్మెలో ప్రధాన డిమాండ్‌గా ఉంది. ఇందుకు ధర స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయలని రైతు సంఘాలు కోరతున్నాయి. తరువాతది రైతులను రుణవిముక్తులను చేయాలని, ఇందుకు పార్లమెంటులో చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నాయి. బలవంతపు భూసేకరణను ఆపాలని, సాగునీటి వసతి కల్పనపై సమగ్ర ప్రణాళిక ఉండాలని సూచిస్తున్నాయి. ప్రభుత్వం గత కొన్నేళ్లుగా భూ పంపిణీ నిలిపివేసి కార్పొరేట్లకు భూములు కట్టబెడుతున్నాయని, అలాకాకుండా రైతులకు భూ పంపిణీ చేపట్టాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. పసలేని ఫసల్‌బీమా వల్ల రైతులకు కాకుండా ప్రయివేటు బీమా సంస్థలకు లాభాలు చేకూర్చే విధంగా ఉంటున్నాయి. ఈ విధానంలో మార్పులు తీసుకొచ్చి ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయే రైతుకు పూర్తి స్థాయిలో సహయం అందే విధానం కావాలని కోరుతున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న ఈ సమస్యలతో పాటు రాష్ట్రంలోనూ ఉల్లి, టమోట తదితర పంటలకు సరైన గిట్టుబాటు ధర లేదు. ఉద్యానవన పంటల పరిస్థితి అదే రకంగా ఉంది. వీటికి మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. రాయలసీమ నాలుగు జిల్లాలతో పాటు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలో తీవ్రమైన దుర్భిక్షంతో రైతులు పెద్దఎత్తున నష్టపోయారు. వారిని ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ డిమాండ్ల సాధాన కోసం కార్మికులతో కలసి రైతులు కూడా సమ్మెలో భాగస్వాములవనున్నారు.



సమ్మెను జయప్రదం చేయండి : పి.పెద్దిరెడ్డి ఎపి రైతు సంఘ ప్రధాన కార్యదర్శి

కార్మికులు, కర్షకులు తలపెట్టిన రెండు రోజుల సమ్మెల్లో కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు అందరూ భాగస్వాములవ్వాలి. ఈనెల తొమ్మిదిన అన్ని గ్రామీణ ప్రాంతాల్లోనూ రహదారుల దిగ్బంధనం ఉంటుంది. ఇందులో అందరూ పాల్గొని సమ్మెను జయప్రదం చేయడం ద్వారా ప్రభుత్వం కళ్లు తెరిపించాలి.

ధర స్థిరీకరణ ఉండాలి : వెంకటనాయుడు, దానిమ్మ రైతు, వెంకటాంపల్లి గ్రామం, నార్పల మండలం

నేను ఎకరానికి లక్ష రూపాయలకుపైగా ఖర్చుపెట్టి దానిమ్మ సాగు చేశాను. ఈ పంట చేతికొచ్చి మార్కెట్‌కు అమ్మడానికిపోతే టన్ను రూ.25 వేలలోపే ఉంటోంది. వాస్తవానికి టన్ను రూ.70 వేలకుపైగా ధర ఉంటేనే పెట్టిన పెట్టుబడిపోనూ ఎంతో కొంత మిగులు ఉంటుంది. ఒకప్పుడు టన్ను లక్ష రూపాయలకుపైగా పోయింది. ఇప్పుడు చూస్తే రూ.25 వేలే ఉంది. ఇలా కాకుండా మార్కెట్‌లో ధర నిలకడ ఉంటే రైతుకు మేలు జరుగుతుంది. లేకపోతే పంట వచ్చినా ఫలితముండదు. ప్రభుత్వం ధర స్థిరీకరణకు చర్యలు తీసుకోవాలి.

అప్పుల బాధతో మా తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడు

మాదయ్య, రాంపురం, కంబదూరు మండలం

నాలుగు ఎకరాల పొలముంది. అందులో రెండున్నర ఎకరాల్లో టమోట సాగు చేశాం. మిగిలిన దానిలో వేరుశనగ పంటపెట్టాం. గిట్టుబాటు ధరలేకపోవడంతో పూర్తిగా నష్టం వచ్చింది. అప్పుల బాధలు ఎక్కువ కావడంతో తండ్రి మల్లన్న పొలంలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రభుత్వం చేస్తామన్న రుణమాఫీ చేసివున్నా తండ్రి బతికేవాడేమో. రుణమాఫీకి సంబంధించి ప్రభుత్వమిస్తామన్న నాలుగైదు విడతల డబ్బులు కలిపితే రూ.50 వేల దాకా రావాల్సిఉంది. ఒకవైపు గిట్టుబాటు ధర లేకపోవడం, మరోవైపు పంటలు పండకపోవడంతో చనిపోయే పరిస్థితి వచ్చింది. ప్రభుత్వం ఇప్పటికైనా రైతులను ఆదుకునే చర్యలు చేపట్టాలి.



విజయవాడలో సిపిఎం నాయకులను ఈడ్చుకెళ్తున్న పోలీసులు

రైతులపై 'చింతమనేని' బూతు పురాణం

పైగా 12 మందిపై కేసులు - ఇద్దరు అదుపులోకి

మంత్రి సాక్షిగా సిపిఎం నేతలపై పాశవిక చర్య

ప్రజాశక్తి యంత్రాంగం

జన్మభూమి సభల్లో మంత్రులు, శాసనసభ్యులు, అధికార పార్టీ నేతల తీరును ప్రజలు ఎండగడుతున్నారు. మంగళవారం విజయవాడ 55వ డివిజన్ జన్మభూమి సభలో ప్రజాసమస్యలపై ప్రశ్నించిన సిపిఎం నేతలను పోలీసులు అడ్డుకున్నారు. సభలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు సమక్షంలో సిపిఎం నేతలను పాశవికంగా నేలపై పడేసి ఈడుస్తూ అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వ విప్, దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ మరోసారి రెచ్చిపోయారు. పశ్చిమగోదావరి జిల్లా పెదపాడు మండలం వట్లూరు పంచాయతీ కార్యాలయం వద్ద జన్మభూమి సభ వద్ద తమకు న్యాయం చేయాలని రక్షణ రంగ పరిశ్రమ వల్ల భూములు కోల్పోయిన రైతులు ప్లకార్డులతో ఒకపక్కగా నిలుచున్నారు. అక్కడికి చేరుకున్న ఎంఎల్ఎ చింతమనేని 'నా కొడుకుల్లారా..' అంటూ బూతులు తిట్టారు. ఎందుకు తిడుతున్నారని రైతులు ప్రశ్నించడంతో తహశీల్దార్, పోలీసులనుద్దేశించి 'వీరిపై కేసులు పెట్టి వీళ్ల అంతు చూడాలి. ఏ ఒక్కరినీ వదలబోను' అంటూ విరుచుకుపడ్డారు. ఎంఎల్ఎ చెప్పడమే ఆలస్యమైనట్లు రైతులపై పోలీసులు బెదిరింపులకు దిగారు. 12 మందిపై కేసులు నమోదు చేశారని రైతులు చెబుతున్నారు. ఇద్దరు రైతులను ఏలూరు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. రైతుల్లో ఒకరికి ఫోన్ చేసి మీరంతా పోలీస్‌స్టేషన్‌కు రావాలని హుకుం జారీ చేశారు. మేరుగు పౌలు, కోటే రవి, మలపు మరియన్న, లూర్దుయా, నంబూరు తంబి, తిరిగే ఏసుబాబు, కిషోర్, పేట్ల ఏసు, మెన్నం పురుషోత్తం, కారెం బాబూరావు, గంధం చిన్నోడు, మేడపల్లి ఛార్లెస్‌పై కేసు పెట్టినట్లు తెలిసింది. గ్రామంలో పోలీసులు కలియతిరుగుతూ బెదిరింపులకు గురి చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. ప్రజలు సమస్యలు చెప్పుకునేందుకు వస్తే అరెస్టులు చేయడం, వేధించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ఏలూరు త్రీటౌన్ ఎస్ఐ పైడిబాబును వివరణ కోరగా పెదపాడు తహశీల్దార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు. రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేయకపోవడాన్ని నిరసిస్తూ శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలం కనుగులవలసలో ప్రభుత్వ విప్ కూన రవికుమార్‌ను రైతులు నిలదీశారు. కృష్ణాజిల్లా ఉయ్యూరు 10,12 వార్డుల్లో జీప్లస్ త్రీ ఇళ్ల కేటాయింపులో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ ఎమ్మెల్సీ వై.వి.బి.రాజేంద్రప్రసాద్‌పై మహిళలు ఆగ్రహం వ్యక్తంచేశారు. పలు సమస్యలపై వైసిపి నాయకులు కూడా అధికారులు, ప్రజాప్రతినిధులను నిలదీశారు. మొవ్వ మండలంలో పామర్రు ఎమ్మెల్యే ఉప్పులేటి కల్పనను రైతులు నిలదీశారు. పేకేటి రవీంద్రరెడ్డి, యలమల్లి కుటుంబరావు తదితరులు పెథాయ్ తుపాను కారణంగా కాజ పరిధిలో 300 ఎకరాల వరిపనలు నీటిలో నాని మొక్కలు నిలిచినా... సంబంధిత అధికారులు రాకుండా పంట నమోదులో నిబంధనల పేరుతో తాత్సారం చేశారన్నారు.

బాధితులకే బహిష్కరణ శిక్షలా?

రాజమహేంద్రవరం చేరుకున్న డిగ్నిటీ మార్చ్

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

అత్యాచారాలకు గురై, న్యాయం కోరిన బాధితులనే గ్రామ బహిష్కరణలకు గురిచేసే ఆటవిక న్యాయానికి అంతం పలకాలని, సమాజంలో గౌరవాన్ని, ఆత్మాభిమానంతో జీవించే అవకాశాన్ని కల్పించాలని బాధిత మహిళలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. తమ డిమాండ్లపై ముంబయి నుంచి ఢిల్లీ వరకూ చేపట్టిన డిగ్నిటీ మార్చ్ సంఘసంస్కర్తలు నడయాడిన తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం మంగళవారం చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బాధిత మహిళలు మాట్లాడారు. తమ హృదయ విదారకమైన పరిస్థితులను వివరించారు. అత్యాచారాలకు గురైన మహిళలు, బాలికలు గౌరవంగా జీవించే అవకాశం ఇవ్వాలని కోరారు. నిందితులు తప్పించుకోకుండా కఠిన శిక్షలు విధించాలని కోరారు. డిగ్నిటీ మార్చ్ హెల్ప్‌లైన్ డైరెక్టర్ ప్రశాంతి మాట్లాడారు.

విద్యుత్ చట్ట సవరణలు దుర్మార్గం

రాష్ట్రవ్యాప్త నిరసనలు

ప్రజాశక్తి యంత్రాంగం

2003 విద్యుత్ చట్టానికి సవరణలు తెచ్చే ఆలోచనను కేంద్ర ప్రభుత్వం తక్షణం విరమించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (1104) ఆధ్వర్యాన మంగళవారం రాష్ట్ర వ్యాపితంగా నిరసనలు జరిగాయి. 2018 విద్యుత్ బిల్లు అమలుకు యత్నించడం దుర్మార్గమైన చర్య అని యుఇఇయు రాష్ట్ర అధ్యక్షులు డి.సూరిబాబు అన్నారు. యుఇఇయు ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లా కావలి, నెల్లూరు, నాయుడుపేట, గూడూరు, ఆత్మకూరు డివిజన్ల ఆఫీసుల ఎదుట ఉద్యోగులు, కార్మికులు ఆందోళన నిర్వహించారు. 2018 విద్యుత్ బిల్లు పాసైతే విద్యుత్ రంగం పూర్తిగా విచ్ఛిన్నం కానుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలపై విపరీతమైన భారాలు పడడంతో ఆరంగంలో పనిచేస్తోన్న కార్మికుల భద్రత కరువవుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్, జాకీర్‌హుస్సేన్, పి.కృష్ణ పాల్గొన్నారు. విశాఖ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సామూహిక నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షా శిబిరాన్ని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఇఎఎస్ శర్మ, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ మాట్లాడారు. రాజమహేంద్రవరంలోని సామూహిక నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాంతీయ శాఖ కార్యదర్శి వివిఎస్ నాగేశ్వరరావు మాట్లాడుతూ యూనియన్ కేంద్ర కార్యవర్గం పిలుపు మేరకు 250 మంది ఉద్యోగులు దీక్షలో పాల్గొన్నారని చెప్పారు. విద్యుత్ సవరణ బిల్లు 2018ను వెంటనే ఉపసంహరించుకుని, ఉద్యోగులందరికీ పాత పింఛను విధానాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులోని జిల్లా పరిషత్ సెంటర్లో మంగళవారం ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వందలాది మంది ఉద్యోగులు దీక్షలో కూర్చొని తమ నిరసన తెలిపారు.

అప్పుల బాధతో కుటుంబం ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి- పెందుర్తి, విశాఖ

అప్పుల బాధతో ఓ కుటుంబం ఆత్యహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటనలో తల్లి మృత్యువాత పడగా, ఇద్దరు కుమారులు చావుబతుకుల మధ్య కొట్టు మిట్టాడుతున్నారు. పోలీసుల కథనం మేరకు పెందుర్తి సమీపంలో నివాసముంటున్న కీదరశెట్టి రమా (44), ఈమె కుమారులు గణేష్ తేజ (24), దుర్గా వరహాలశెట్టి(20) మంగళ వారం ఉదయం పురుగులమందు తాగారు. అపస్మారక స్థితికి చేరుకున్న వీరిని స్థానికులు గుర్తించి హుటాహుటీన కెజిహెచ్‌కి తరలించగా, మార్గం మధ్యలో తల్లి రమా మృతి చెందారు. ఇద్దరు కుమారులు చికిత్స పొందుతున్నారు.

నకిలీ ఎరువుల ముఠా అరెస్టు

ప్రజాశక్తి-త్రిపురాంతకం (ప్రకాశం)/ఈపూరు (గుంటూరు)

కర్నాటక కేంద్రంగా తయారవుతున్న నకిలీ ఎరువులను జిల్లాలో విక్రయిస్తున్న ముఠాను త్రిపురాంతకం పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. శ్రీ రాఘవేంద్ర ఫర్టిలైజర్ యజమాని దోగిపర్తి గుప్త, శ్రీ లక్ష్మి సుబ్రహ్మణ్యేశ్వర ట్రేడర్స్ యజమాని అన్నా సుబ్రహ్మణ్యం, నడిగడ్డకు చెందిన మాధవి ఫర్టిలైజర్ యజమాని నాగిరెడ్డి కలిసి బళ్లారిలో తయారవుతున్న నకిలీ ఎరువులను పోటాస్ పేరుతో అనంతపురం డీలర్ రాజు ఆధ్వర్యంలో విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో గుంటూరు జిల్లా నరసరావుపేటలో ఉన్న ఏజెంట్ నాగేశ్వరరావుకు ఇటీవలనే ఎరువుల లోడ్ పంపించారు. చీరాల ప్రాంతానికి కూడా నకిలీ ఎరువులు పంపించారు. తీరా ఆ ఎరువులు పని చేయకపోవడంతో రైతులు విజిలెన్స్ అధికారులను ఆశ్రయించారు. అధికారులు ఈ నెల 3, 7వ తేదీల్లో బాలత్రిపుర సుందరీ దేవి ఫర్టిలైజర్, శ్రీరామ్ ట్రేడర్స్, వెంకట కదాంబలి, వెంకటేశ్వర ట్రేడర్స్‌పై దాడులు నిర్వహించి ఎరువులను సీజ్ చేశారు. మంగళవారం విజిలెన్స్ సిఐ భూషణం ఆధ్వర్యంలో నడిగడ్డలోని మాధవి ఫర్టిలైజర్స్‌పై దాడులు నిర్వహించగా షాపు యజమాని నాగిరెడ్డి పరారయ్యాడు. అందులోని సరుకును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం శ్రీ రాఘవేంద్ర ఫర్టిలైజర్, శ్రీ లక్ష్మి సుబ్రహ్మణ్యేశ్వర ట్రేడర్స్‌ల, శ్రీ లక్ష్మి శ్రీనివాస ట్రేడర్స్‌పై దాడులు నిర్వహించి ఎరువులను సీజ్ చేశారు. నకిలీ ఎరువులు విక్రయించే ముఠాలో కీలకమైన వ్యక్తులు నాగిరెడ్డి, దోగిపర్తి గుప్తలు పరారయ్యారు.

రూ.1.75 కోట్ల ఎర్రచందనం స్వాధీనం

- పది మంది స్మగ్లర్లు అరెస్ట్

ప్రజాశక్తి నెల్లూరు క్రైమ్

జిల్లాలో భారీగా ఎర్ర చందనం దుంగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు అంతర్జాతీయ స్మగ్లర్లతో పాటు మరో ఎనిమిది మందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.కోటి 75 లక్షలు విలువ చేసే ఎర్రచందనం దుంగలు, వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలో గత కొంతకాలంగా చాటు మాటుగా జరుగుతున్న ఎర్రచందనం అక్రమ రవాణాను జిల్లా పోలీసులు ఛేదించారు. ఎస్‌పి ఐశ్వర్య రస్తోగి ఆదేశాల మేరకు నిఘా పెట్టిన పోలీసులు ఎర్రచందనం స్మగ్లర్లను పట్టుకున్నారు. మంగళవారం ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డక్కిలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఐదుగురు స్మగ్లర్లను, వెంకటగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో మరో ఐదుగురిని అరెస్టు చేశారన్నారు. వారిలో ఇద్దరు కర్ణాటకాకు చెందిన వారు. వారి నుంచి 122 ఎర్రచందనం దుంగలు, రెండు మినీ లారీలు, మూడు ద్విచక్ర వాహనాలు, రూ.50 వేలు సెల్‌ఫోన్ యంత్రం స్వాధీనం చేసుకున్నారు వీటి విలువ సుమారు రూ.కోటి 75 లక్షలు ఉంటుందని తెలిపారు. ఎర్రచందనం స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపుతున్నట్లు తెలిపారు. వెంకటగిరి డక్కిలి పోలీసులు ఈ స్మగ్లర్లను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా జరగడానికి కారణం సింగపూర్ మలేషియా, అరబ్బు దేశాలలో ఎర్రచందనంతో తయారు చేసిన వస్తువులకు అధిక శక్తులు ఉంటాయనే భావన ఉంటుందని అందువల్లే ఆయా దేశాలలో ఎర్ర చందనానికి ఎక్కువ డిమాండ్ ఎక్కువని తెలిపారు 15వ అంతర్జాతీయ సదస్సులో ఎర్రచందనం ఎగుమతులను అన్ని దేశాలు నిషేధించినట్లు తెలిపారు ఐదేళ్ల నుంచి సుమారు 40 వేల మెట్రిక్ టన్నుల ఎర్రచందనం ఎపి నుంచి విదేశాలకు తరలినట్లు పేర్కొన్నారు. జిల్లాలో అటవీ విస్తీర్ణం 21శాతం మిగిలి ఉన్నట్లు చెప్పారు. అడిషనల్ ఎస్‌పి పరమేశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

9 మంది మిలిషియా సభ్యులు లొంగుబాటు

ప్రజాశక్తి - కాకినాడ సిటీ

తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో జిల్లా ఎస్‌పి విశాల్ గున్నీ ఎదుట మావోయిస్టు మిలిషియా దళ కమాండర్ సహా ఎనిమిది మంది మంగళవారం లొంగిపోయారు. ఈ మేరకు ఎస్‌పి వివరాలు వెల్లడించారు. దిర్ధి జోగయ్య శబరి దళ సభ్యునిగా పనిచేస్తూ హరిభూషణ్ (లక్కా దాదా)కు గార్డుగా పని చేసేవాడు. లక్ష్మణరావు, దువ్వల రఘు హత్యలు సహా పలు కేసులలో నిందితునిగా ఉన్నాడు. దిర్ధి సోమయ్య, కుంజ బండి, ముచ్చిక మల్లి, ముచ్చిక ఉంగయ్య, సోడి ఇడమయ్య, మడకం దిలీప్, పంజం పాండు, శబరి దళ సభ్యుడైన మడకం జోగయ్య పలు హత్య కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు.

రూ.184 కోట్ల పనులకు టిటిడి ఆమోదం

నిర్ణయాలు

- భజన కళాకారులకు బస్సు ఛార్జీల చెల్లింపునకు అంగీకారం
- 31న అమరావతిలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి భూకర్షణ
- టిటిడి ధర్మకర్తల మండలి సమావేశం ముఖ్య నిర్ణయాలు

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల తిరుపతి దేవస్థానంలో రూ.184 కోట్లతో అభివృద్ధి పనులకు ధర్మకర్తల మండలి గ్రీన్‌సిగ్నల్ తెలిపింది. 31న అమరావతిలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి ఆగమోక్తంగా భూకర్షణ చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వస్తారని వెల్లడించారు. తిరుమలలో నిర్వహించే అఖండ హరినామ సంకీర్తనకు వచ్చే భజన బృందాలకు ఆర్డినరీ బస్సు ఛార్జీలను చెల్లించనున్నట్లు తెలిపారు. దుకాణాలు, హాకర్ల లైసెన్సుల సమస్యలపై టిటిడి ఛైర్మన్ అధ్యక్షతన సబ్‌కమిటీని వేశారు. కమిటీ పది రోజుల్లో నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

టిటిడి ధర్మకర్తల మండలి సమావేశం మంగళవారం తిరుమలలోని అన్నమయ్య భవనంలో జరిగింది. కార్యక్రమానికి టిటిడి ఛైర్మన్ పుట్టా సుధాకర్‌యాదవ్ అధ్యక్షత వహించారు. సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. తిరుపతిలోని అలిపిరి వద్ద యాత్రికులకు వసతి కల్పించేందుకు మొదటి బ్లాక్‌లో 384 గదులను రూ.67.29 కోట్లతో నిర్మించేందుకు టెండర్లు ఖరారు చేశారు. తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే వారికి భద్రతను కల్పించేందుకు రెండో దశలో 1050 సిసి కెమెరాల ఏర్పాటుకు రూ.15.79 కోట్ల నిధులను మంజూరు చేశారు. సర్వదర్శనం కాంప్లెక్స్ నుంచి ఆళ్వార్ ట్యాంక్ రెస్టుహౌస్ గేటు వరకు రూ.17.21 కోట్లతో క్యూలైన్ నిర్మించేందుకు టెండర్లు ఖరారు చేశారు. స్మార్ట్‌డేటా సెంటర్ ఏర్పాటుకు రూ.2.63 కోట్లు మంజూరు చేశారు. తిరుపతిలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న డేటా సెంటర్‌కు సంబంధించిన హార్డ్‌వేర్ ఏర్పాటుకు 1.97 కోట్లు విడుదల చేయనున్నారు. అమరావతిలో ఆలయాన్ని నిర్మించే ప్రక్రియలో భాగంగా మహారాజగోపురం, ఆర్జితసేవా మండపం, అద్దాల మండపం, వాహన మండపం, రథ మండపం, ఆంజనేయస్వామివారి ఆలయం, పుష్కరిణి నిర్మించేందుకు రూ.27.28 కోట్లకు టెండర్లను ఖరారు చేశారు. వేదాంతం దేశికాచార్యులు స్థానంలో టిటిడి అర్చకులు ఎ.అనంతశయన దీక్షితులను రెండేళ్ల కాలపరిమితికి గాను ఆగమసలహాదారుగా నియమించేందుకు ఆమోదం తెలిపారు. విజయనగరం జిల్లా పార్వతీపురంలో రూ.2.90 కోట్లు, శ్రీకాకుళం జిల్లా సీతం పేటలో రూ.2.86 కోట్లు, తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురంలో రూ.2.99 కోట్లు కేటాయిస్తూ తీర్మానించారు.



ధర్మకర్తల మండలి నిర్ణయాలను వెల్లడిస్తున్న టిటిడి ఛైర్మన్‌పుట్టా సుధాకర్‌యాదవ్

ప్రజ్ఞ

జవాబులు

1. గీత గోపీనాథ్
2. కాలిఫోర్నియా
3. బొహెమియన్ రాప్సాడీ(డ్రామా), గ్రీన్‌బుక్(కామెడీ)
4. రమి మలెక్(డ్రామా), క్రిస్టియన్ బాలె(కామెడీ)
5. రోమా

రుణాలపై సర్కారు కాకి లెక్కలు

కౌలు రైతు సంఘం

ప్రజాశక్తి-ఏలూరు అర్బన్

రాష్ట్రంలో 11 లక్షల మంది కౌలు రైతులకు 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.4841 కోట్ల పంట రుణాలిచ్చినట్లు రాష్ట్రప్రభుత్వం కాకిలెక్కలు చెబుతోందని ఎపి కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య విమర్శించారు. అవి తప్పుడు లెక్కలని నిరూపించేందుకు బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని, ప్రభుత్వం సిద్ధంగా ఉందా అని సవాల్ విసిరారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు అన్నే భవనంలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్‌తో కలిసి మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నాలుగున్నరేళ్లలో రైతుమిత్ర, జెఎల్ గ్రూపులు, ఎల్ఇసి కార్డులపై రుణాలు పొందిన రైతులకు రుణమాఫీ చేయలేదని, వారికి పెద్దఎత్తున పంట రుణాలిచ్చినట్లు చెప్పటం విడ్డూరంగా ఉందని అన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో మూడు లక్షల పది వేల మందికి రూ.1695 కోట్లు, కృష్ణా జిల్లాలో మూడు లక్షల 40 వేల మందికి రూ.1366 కోట్లు, తూర్పుగోదావరి జిల్లాలో రెండు లక్షల 49 వేల మందికి రూ.856 కోట్లు కౌలు రైతులకు పంట రుణాలు ఇచ్చినట్లు ప్రకటించడం దారుణమన్నారు. భూ యజమాని పంట రుణం పొందిన తర్వాత ఆ సర్వే నెంబరుపై మరొకరికి పంట రుణం ఇవ్వడం సాధ్యం కాదంటూ బ్యాంకులు కౌలు రైతులను ఇబ్బందులకు గురిచేస్తుంటే, ప్రభుత్వం తప్పుడు లెక్కలు ప్రకటించడాన్ని ఖండించారు. పశ్చిమగోదావరి జిల్లా పెదపాడు మండలం కొత్తూరులో రైతు మిత్ర, జెఎల్ గ్రూపులకు రుణమాఫీ కాకపోవడంతో వారు తిరిగి పంట రుణాలు పొందలేకపోయారని, ఈ పేరుతో కొత్త వారికి కూడా రుణాలు ఇవ్వలేదని తెలిపారు. దెందులూరు, ఏలూరు, భీమడోలు తదితర మండలాల్లో బ్యాంకులు కౌలు రైతులకు రుణాలు ఇవ్వకపోగా, ఇప్పటివరకూ ఉన్న రైతు మిత్ర, జెఎల్ గ్రూపుల అకౌంట్లను పూర్తిగా రద్దు చేశారని వివరించారు. 2011 భూ అధీకత సాగుదారు చట్టాన్ని అమలుచేయాలన్నారు. వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకు రబీలో అయినా లక్ష రూపాయలు చొప్పున వడ్డీ లేని పంట రుణాలిచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులు, రైతు మిత్ర, జె ఎల్ గ్రూపులకు ఎటువంటి షరతులు లేకుండా రుణ మాఫీ చేయాలని కోరారు. చంద్రబాబు ప్రభుత్వం కౌలు రైతులను మోసగిస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు.



పాట్నాలో మహిళా కార్మికులపై దౌర్జన్యం చేస్తున్న పోలీసులు

సమ్మె సక్సెస్

• పాల్గొన్న 20కోట్ల మంది కార్మికులు • స్తంభించిన ఉత్పత్తి, రవాణా రంగాలు • వేలాదిగా అరెస్టులు

న్యూఢిల్లీ : కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 10 కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం జరిగిన సార్వత్రిక సమ్మె జయప్రదమైంది. బుధవారం కూడా ఈ సమ్మె కొనసాగనుంది. సంఘటిత, అసంఘటిత రంగాలకు చెందిన దాదాపు 20కోట్ల మంది కార్మికులు ఈ సమ్మెలో పాల్గొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగ, బహుళ జాతి కంపెనీలు, క్వాసీ ప్రభుత్వ రంగాలు, పథకాల కార్మికులు అందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని సమ్మెను విజయవంతం చేశారు. ఈ సమ్మెకు అన్నిరంగాల ప్రజల నుండి అశేషమైన మద్దతు, సంఘీభావం లభించింది. దాదాపు అన్ని రాష్ట్రాల్లో రైతులు, వ్యవసాయ కార్మికులు, విద్యార్థులు, యువత, మహిళలు తదితరులు సమ్మెలో చేతులు కలిపారు. ప్రదర్శనలు, ర్యాలీల్లో భారీ సంఖ్యలో పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా పలు చోట్ల రాస్తారోకోలు, రైల్‌రోకోలు జరిగాయి. దీంతో చాలా చోట్ల రైళ్ళు నిలిచిపోయాయి. కేరళ, అసోం, ఒడిషా, కర్నాటకలోని పలు జిల్లాలు, ఈశాన్య రాష్ట్రాలతో సహా పలు రాష్ట్రాల్లో బంద్ తరహా వాతావరణం కనిపించింది. కేరళ, కర్నాటక, మహారాష్ట్ర, బీహార్, హర్యానా, పంజాబ్, ఉత్తరాఖండ్‌లతో సహా పలు రాష్ట్రాల్లో రవాణా స్తంభించింది. మధ్యప్రదేశ్‌లో 22 జిల్లాల్లో రాకపోకలు పూర్తిగా స్తంభించాయి.. జమ్మూ కాశ్మీర్‌లో అంతర్రాష్ట్ర బస్సులు తిరగలేదు. తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తలు ఎంతగా భయోత్పాతాన్ని సృష్టించినప్పటికీ పశ్చిమ బెంగాల్‌లో బంద్ ప్రభావం చాలా స్పష్టంగా కనిపించింది. సరుకుల రవాణా, ప్రయాణికుల రాకపోకలు స్తంభించాయి. జనపనార, ఇంజనీరింగ్ పరిశ్రమలతో సహా పలు పారిశ్రామిక సంస్థలు మూతపడ్డాయి. త్రిపురలో బిజెపి ప్రభుత్వం, పార్టీ ఎంతగా ఒత్తిడి తీసుకువచ్చినా 30శాతానికి మించి బస్సులు నడవలేదు. 30శాతం దుకాణాలు కూడ తెరవలేదు. ఇక గిరిజన ప్రాంతాలైతే బంద్ పూర్తిగా పాటించారు.

నిలిచిన బొగ్గు ఉత్పత్తి, రవాణా

బొగ్గు పరిశ్రమలో ఉత్పత్తి, రవాణా పూర్తిగా స్తంభించిపోయింది. వైజాగ్, సేలం ఉక్కు కర్మా గారాల్లో పూర్తిగా, రూర్కెలా, భద్రావతి కర్మాగారాల్లో దాదాపు 50శాతం పనులు నిలిచిపోయాయి. అన్ని ప్రభుత్వ రంగ సంస్థల్లోని కాంట్రాక్టు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని బంద్‌ను జయప్రదం చేశారు. పలు రాష్ట్రాల్లోని ఎలక్ట్రిసిటీ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో సమ్మెలో పాల్గొన్నారు.

కార్మికుల హెచ్చరిక

తమ మౌలిక హక్కులు, జీవన పరిస్థితులపై దాడి చేస్తే సహించేది లేదని భారత ప్రభుత్వానికి కార్మిక లోకం ఇచ్చిన హెచ్చరిక ఇది. కార్పొరేట్ ప్రయోజనాల కోసం దేశాన్ని తాకట్టు పెట్టే విధానాలను సహించబోమని, రోజువారీ సమస్యల నుండి ప్రజల దృష్టిని మళ్ళించేందుకు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ వంటి మతోన్మాద శక్తులు పాల్పడే కుట్రలు, కుయుక్తులను పారనివ్వబోమని కార్మికులు హెచ్చరించారు.

రైల్వే ఉద్యోగులు సమ్మెలో పాల్గొననప్పటికీ పలు చోట్ల మద్దతు తెలిపారు. రైల్వే కాంట్రాక్టు కార్మికులు, గూడ్స్ షెడ్ కార్మికులు, సఫారీ కర్మాచారిలు ఈ నిరసన గళంతో గొంతు కలిపారు. అసోం, పశ్చిమ బెంగాల్, కేరళల్లోని తేయాకు తోటల్లో కార్యకలాపాలు స్తంభించాయి.

సంఘటితమైన అసంఘటిత రంగం

బీడి కార్మికులు, నిర్మాణరంగం, లోడింగ్, అన్‌లోడింగ్ కార్మికులు, దుకాణాలు, ప్రైవేటు ఆస్పత్రుల ఉద్యోగులు అందరూ సమ్మెతో చేతులు కలిపారు. రైలు రోకో, రాస్తారోకోలతో ట్రాఫిక్ స్తంభించింది. అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులు కూడా పెద్ద సంఖ్యలో దేశవ్యాప్తంగా సమ్మెలో పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో సంపూర్ణం

బీమా, బిఎస్‌ఎన్‌ఎల్‌ల్లో బంద్ సంపూర్ణంగా జరిగింది. పోస్టల్, ఆదాయ పన్ను, అణు ఇంధన శాఖల ఉద్యోగులతో సహా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఉద్యోగులు విధులను బహిష్కరించడంతో కార్యాలయాలు వెలవెలబోతూ కనిపించాయి. త్రిపురలో టీచర్లు పాఠశాలలకు హాజరు కావాలని బలవంతం చేసినా విద్యార్థులు కనిపించలేదు.

సిఐటియు అభినందనలు

సమ్మెను సంపూర్ణంగా జయప్రదం చేసిన కార్మిక లోకానికి సిఐటియు అభినందనలు తెలియచేసింది. కార్మిక చట్టానికి తీసుకురానున్న కార్మిక వ్యతిరేక సవరణలను తక్షణమే నిలుపుచేయాలని, సంయుక్త కార్మికోద్యమం లేవనెత్తిన డిమాండ్లపై వెంటనే నిర్దిష్ట చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. కింది స్థాయి నుండి కార్మికుల ఐక్యత మరింత బలోపేతం కావడానికి చర్యలు తీసుకోవాలని పిలుపిచ్చింది. నయా ఉదారవాద విధానాలను తిరస్కరించేందుకు మరింత ఉధృత పోరాటాలకు సమాయత్తం కావాలని కార్మిక లోకానికి పిలుపునిచ్చింది.

వేలాదిమంది అరెస్టు

పశ్చిమ బెంగాల్, అసోం, జార్ఖండ్‌లతో సహా పలు రాష్ట్రాల్లో పోలీసులు పెద్ద సంఖ్యలో కార్యకర్తలను అరెస్టు చేశారు. వేలాదిమంది సిఐటియు, వామపక్షాల కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. సమ్మెకు వ్యతిరేకంగా బిఎంఎస్ సాగించిన ప్రచారాన్ని కార్మికలోకం యావత్తు నిర్ద్వంద్వంగా తిరస్కరించిందని బంద్ జయప్రదంతో స్పష్టమైంది. పలు రాష్ట్రాలు, రంగాల్లో బిఎంఎస్ కార్మికులు కూడా సమ్మెల్లో పాల్గొన్నారు. అనూహ్యమైన రీతిలో సమ్మె సక్సెస్ కావడంతో కేంద్రంలోని మోడీ సర్కార్ అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాల పట్ల ప్రజలు ఎంత ఆగ్రహంతో వున్నారో మరోసారి స్పష్టమైంది. ఒకపక్క బడా కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాస్తూ, మరోపక్క నయా ఉదారవాద విధానాలతో కార్మికుల జీవన భృతిపై చేస్తున్న దాడుల పట్ల తమ ఆవేశాన్ని, మోడీ ప్రభుత్వం పట్ల అసంతృప్తిని వెళ్లగక్కారు.



బెంగళూరులో ప్రదర్శన చేస్తున్న కార్మికులు

స్తంభించిన పారిశ్రామిక వాడలు



గువాహటిలో నిలిచిపోయిన బస్సులు

ఎన్‌సిఆర్ ఢిల్లీ పారిశ్రామిక ప్రాంతాలు, 24 పరగణాలు, హుగ్లీ, హౌరా జిల్లాల్లో సమ్మె ప్రభావంగా బాగా కనిపించింది. అసోంలోని చమురు శుద్ధి కర్మాగారాల్లో, పూనే, నాసిక్, ఔరంగాబాద్, బెంగళూరు, మైసూరు, లూథియానా, జైపూర్‌లోని బొకారో, రాంచి, ఆదిత్యాపూర్ పారిశ్రామిక ప్రాంతాల్లో కూడా బంద్ బాగా జరిగింది. బరోడాలోని ఇంజనీరింగ్ యూనిట్లలో, సూరత్, భావ్‌నగర్, రాజ్‌కోట్, జునాఘడ్, అహ్మదాబాద్‌ల్లో, హైదరాబాద్, దాని చుట్టుపక్కల జిల్లాల్లోని పారిశ్రామిక వాడల్లో బంద్ ప్రశాంతంగా, జయప్రదంగా జరిగింది. బాష్, సియట్, క్రాంప్టన్, శాంసొనైట్, వోల్వో, టయోటా అన్ని శాఖల్లోనూ బంద్ సంపూర్ణం. దేశవ్యాప్తంగా కార్మికులందరూ తమ కార్యకలాపాలను బహిష్కరించారు. వేలాదిగా బహిరంగ సభలు, ర్యాలీలు, ప్రదర్శనల్లో పాల్గొన్నారు.

సమ్మెలో 10లక్షల మంది బ్యాంక్ ఉద్యోగులు



న్యూఢిల్లీ : మంగళవారం జరిగిన సార్వత్రిక సమ్మెలో పది లక్షల మంది బ్యాంక్ ఉద్యోగులు పాల్గొన్నారు. బ్యాంకింగ్ రంగానికి సంబంధించిన డిమాండ్ల సాధనకు అఖిల భారత బ్యాంక్ ఉద్యోగుల సమాఖ్య (ఎఐబిఇఎ), భారత బ్యాంక్ ఉద్యోగుల సమాఖ్య (బిఇఎఫ్‌ఐ)లు సంయుక్తంగా సమ్మెకు పిలుపునిచ్చాయి. ఆర్‌ఆర్‌బి, కేంద్ర సహకార బ్యాంకుల ఉద్యోగులు, ఆఫీసర్లు కూడా రెండు రోజుల పాటు సమ్మెలో పాల్గొంటున్నారని బిఇఎఫ్‌ఐ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ బిశ్వాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమ్మెకు ఎఐబిఓసి, ఎఐబిఓఎలు మద్దతు తెలిపాయి. మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక ఆర్థిక విధానాలను, బ్యాంకింగ్ రంగ సంస్కరణలను వ్యతిరేకించాలని ఆయన, ప్రభుత్వ బ్యాంకుల్లో ప్రభుత్వ ఈక్విటీ వాటాలను కుదించడానికి చేస్తున్న యత్నాలను తిప్పికొట్టాలని బ్యాంకింగ్ యూనియన్లు పిలుపిచ్చాయి. బ్యాంకులను విలీనం చేయడాన్ని, సంఘటితం చేయడాన్ని, బ్యాంకుల్లో శాశ్వత ఉద్యోగాలను కాంట్రాక్టుపరం చేయడాన్ని యూనియన్లు వ్యతిరేకిస్తున్నాయి. తక్షణమే ప్రభుత్వ రంగ బ్యాంకులను మరింత బలోపేతం చేసేలా చర్యలు తీసుకోవాలని, తగిన రీతిలో రిక్రూట్‌మెంట్‌లు చేపట్టాలని యూనియన్లు డిమాండ్ చేస్తున్నాయి.

పశ్చిమ బెంగాల్‌లో సమ్మె విజయవంతం

వెయ్యిమందికి పైగా అరెస్టు



తృణమూల్ గూండాల దాడిలో గాయపడిన కార్మికుడు

కోల్‌కతా : మంగళ వారం పశ్చిమ బెంగాల్‌లో సమ్మె జయప్రదమైంది. పాలక తృణమూల్ కాంగ్రెస్ ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ఎంత అరాచకానికి పాల్పడినా వాటన్నింటినీ ఎదుర్కొని మరీ కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. ప్రజాస్వామిక శక్తుల మద్దతు వున్న కార్మికుల కృత నిశ్చయం ముందు ప్రభుత్వానికి పరాభవం తప్పలేదు. రాష్ట్రవ్యాప్తంగా తేయాకు తోటలు, జనపనార పరిశ్రమ, ప్రభుత్వ రంగ సంస్థలైన బ్యాంకు, బీమా, బిఎస్‌ఎన్‌ఎల్, పోస్టల్, టెలిగ్రాఫ్, షిప్పింగ్ రంగాల్లో వంద శాతం సమ్మె విజయవంతమైంది. దుకాణాలు, వాణిజ్య, వ్యాపార సంస్థలు మూతపడ్డాయి. దాదాపు 1000మంది కార్యకర్తలను అరెస్టు చేసారు. 115మంది గాయపడ్డారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి సూర్యకాంత మిశ్రా తెలిపారు. బుధవారం కూడా సమ్మె మరింత ఉధృతంగా జరుగుతుందని చెప్పారు. సామాన్యులపై మోడీ సర్కార్ సాగించిన అణచి వేత చర్యల కారణంగానే అసాధారణ రీతిలో సమ్మె విజయవంతమైందని సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు సుభాష్ ముఖర్జీ నేతృత్వంలోని పది కార్మిక సంఘాల నేతలు పత్రికా సమావేశంలో వెల్లడించారు.

అయోధ్య కేసు విచారణపై సుప్రీం నిర్ణయం రేపు

న్యూఢిల్లీ : అయోధ్య కేసును ఎప్పుడు విచారణకు చేపట్టాలనే అంశాన్ని ప్రధాన న్యాయమూర్తి రంజన్ గగోయ్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం గురువారం నిర్ణయించనుంది. ఆ ధర్మాసనంలోని ఇతర న్యాయమూర్తుల్లో జస్టిస్ ఎస్.ఎ.బొడ్డె, జస్టిస్ ఎన్.వి.రమణ, జస్టిస్ యు.యు.లలిత్, జస్టిస్ డి.వై.చంద్రచూడ్‌లు వున్నారు. ఆలయం-మసీదు కేసు గత ఆరు దశాబ్దాలుగా నలుగుతోంది. 16వ శతాబ్దానికి చెందిన బాబ్రి మసీదును హిందూ కార్యకర్తలు కూలగొట్టిన ప్రాంతంలో రామాలయాన్ని నిర్మించాలని డిమాండ్లు వస్తున్న నేపథ్యంలో ఇప్పుడు దీనిపై నిర్ణయం వెలువడుతోంది. ఎన్నికల తేది ప్రకటించేలోగా, ఆలయ నిర్మాణాన్ని ప్రారంభించేందుకు వీలుగా ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ ఆదేశాలు లేదా ఆర్డినెన్స్ తీసుకురావాలని పాలక బిజెపి సభ్యులు, కొన్ని మిత్రపక్షాలు, కాషాయ శక్తులు వత్తిడితెస్తున్నాయి. . అయితే సత్వరమే ఈ అంశాన్ని విచారించేందుకు గతేడాది సుప్రీం కోర్టు తిరస్కరించింది. గత శుక్రవారం కేవలం ఒక నిముషం పాటు విచారించిన సుప్రీం కోర్టు జనవరి 10కి విచారణను వాయిదా వేసింది.

రాజ్యసభ ఒక రోజు పొడిగింపు... వ్యతిరేకించిన ప్రతిపక్షాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాజ్యసభను ఒక రోజు పొడిగించడాన్ని వ్యతిరేకిస్తూ ప్రతిపక్షాలు పార్లమెంట్ ఆవరణలోని మహాత్మ గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. తమను సంప్రదించకుండా సభను ఎలా పొడిగిస్తారని ప్రతిపక్ష నేతలు నిలదీశారు. బిఎసిలో చర్చించకుండా కేంద్ర ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయం తీసుకోవడం దారుణమని విమర్శించారు. నోటిఫికేషన్, ముందస్తు సమాచారం లేకుండా రాజ్యసభను వాయిదా వేశారని, అజెండాలో ఏం పొందుపరుస్తున్నారనే విషయం కూడా చెప్పట్లేదని, వ్యవస్థలను నాశనం చేస్తున్నట్లే పార్లమెంట్ పనితీరును కూడా దెబ్బతీయాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈబిసి రిజర్వేషన్లకు ఎవ్వరూ వ్యతిరేకం కాదు

సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఈబిసిలకు 10 శాతం రిజర్వేషన్లకు ఎవ్వరూ వ్యతిరేకం కాదని సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ తెలిపారు. మంగళవారం నాడిక్కడ స్థానిక ఏపి భవన్‌లో నారాయణ మీడియాతో మాట్లాడుతూ కేంద్రం రాజ్యాంగ సవరణ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టిందని, ఈ బిల్లుకు ఎవ్వరూ వ్యతిరేకం కాదని, కానీ సమగ్ర చర్చ జరిగే సమయం లేకుండా బిల్లును పెట్టారని విమర్శిం చారు. రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతిపాదనలు ఉన్నాయని, వాటిని పట్టించుకోలేదని విమర్శించారు. రిజర్వేషన్లతో ప్రజల మధ్య చిచ్చు పెట్టేలా కేంద్ర నిర్ణయం ఉందని అన్నారు. అగ్ర కులాల వారికి రిజర్వేషన్లు ఇవ్వడంతో జనరల్ కేటగిరిలో తమకి స్థానం దక్కదని వేరే వాళ్లు అనుకుంటే ఇబ్బందులు తలెత్తుతాయని తెలిపారు.

లోక్‌సభలో కార్మిక సంఘాల చట్ట సవరణ బిల్లు

వ్యతిరేకించిన సిపిఎం, కాంగ్రెస్ ఎంపిలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభలో మంగళవారం నాడు కేంద్ర కార్మిక శాఖ మంత్రి సంతోష్ కుమార్ గంగ్వార్ కార్మిక సంఘాల చట్ట సవరణ బిల్లు-2019ను ప్రవేశపెట్టారు. ఈ బిల్లును సిపిఎం, కాంగ్రెస్, ఆరెస్పీలు వ్యతిరేకించాయి. సిపిఎం ఎంపి సంపత్ మాట్లాడుతూ ఇది రాజ్యాంగ వ్యతిరేకమని, ఆర్టికల్స్ 19(1)(సి), పార్ట్ 3లో పొందుపరిచిన స్ఫూర్తికి ఈ బిల్లు విరుద్ధంగా ఉందన్నారు. రాజాంగంలోని ఆర్టికల్స్ 23, 24, పార్ట్ 4కు ఈ బిల్లు వ్యతిరేకమని, ఆర్టికల్స్ 43, 43(ఎ)లను ఉల్లంఘించడమే అవుతుందని అన్నారు. రూల్స్ 72, 172, 174లను కూడా ఉల్లంఘిస్తుందని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలపై 20 కోట్ల మంది కార్మికులు ఇప్పటికే వీధుల్లోకి వచ్చారని తెలిపారు. ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని, రైతుల ఆత్మహత్యలు పెరిగాయని, నిరుద్యోగం పెరిగిందని అన్నారు. "యు ద పీపుల్" అని రాజ్యాంగం చెబుతోందని, కానీ ప్రస్తుత మోడీ సర్కార్ ప్రజలను కష్టాలపాలు చేస్తోందని విమర్శించారు.

మరోసారి పాక్ కాల్పుల విరమణ ఉల్లంఘన

పూంచ్ సెక్టార్‌లో కాల్పులు

శ్రీనగర్ : జమ్ము-కాశ్మీర్‌లోని పూంచ్ సెక్టార్‌లో వాస్తవాధీన రేఖ వద్ద మంగళవారం తెల్లవారు జామున ఐదు గంటల సమయంలో పాకిస్తాన్ సైనికులు కాల్పులకు దిగారని అధికారులు తెలిపారు. పూంచ్ జిల్లాలో పలు చోట్ల దాడులకు దిగినట్లు అధికారులు తెలిపారు. సైనికుల శిబిరాలు, పౌరులను లక్ష్యంగా ఈ దాడులకు పాల్పడ్డారని, అయితే ఎవరికీ గాయాలు కాలేదని అన్నారు. గత 15 ఏళ్లలో 2018లోనే అత్యధికంగా 2,936 కాల్పుల ఉల్లంఘనలు నమోదైనట్లు వెల్లడించారు. కాగా, గతేడాది ఈ కాల్పులో 61మంది మృతిచెందగా, 250 మందికి గాయాలైనట్లు అధికారులు తెలిపారు.

గువాహటిలో ఆత్మహత్య చేసుకున్న ఆంధ్రప్రదేశ్ విద్యార్థి

గువాహటి : మేఘాలయ రాజధాని గుహవటిలోని ఐఐటి చివరి సంవత్సరం చదువుతున్న ఆంధ్రప్రదేశ్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం విద్యార్థి పన్నెమ్ పవన్ ఫోన్ తీయకపోవడంతో అతని తల్లిదండ్రులు స్నేహితులకు ఫోన్ చేశారు. స్నేహితులు అతనిగదికి వెళ్లి చూసేసరికి పవన్ ఉరివేసుకుని ఉండటం గమనించారు. వెంటనే అతనిని క్యాంపస్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అయితే అతని ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదని కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఉన్నతాధికారులు వెల్లడించారు.

దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో :

దేశంలో ఆర్థిక వృద్ధితోపాటు నిరుద్యోగం కూడా పెరిగిపోతుందని, 2018 సంవత్సరంలో దాదాపు కోటి 10 లక్షల మంది ఉద్యోగాలు కోల్పోవడమే ఇందుకు ఉదాహరణ అని భారత ఆర్థిక వ్యవస్థ పర్యవేక్షణ సంస్థ(సిఎంఐఇ) తన నివేదికలో పేర్కొంది. ఈ ప్రభావానికి గ్రామీణ ప్రాంతానికి చెందిన వారు ఎక్కువగా గురయ్యారు. ఈ సమస్యను ఎన్నికల ముందు వినియోగించు కోవాలన్న ఆలోచనలో ప్రతిపక్షాలు ఉన్నాయి. ఇది కేవలం ఇప్పటికిప్పుడు వచ్చిన ఉద్యోగ సంక్షోభమేమికాదు. దశాబ్దాల కాలం నుంచి పాలకుల నిర్లక్ష్యం వలన ఈ పరిస్థితి దాపురించింది. దేశంలో ప్రతి సంవత్సరం నిరుద్యోగిత రేటు పెరుగుతున్నట్లు ఈ నివేదిక తెలిపింది. డిసెంబర్ 2017 సంవత్సరానికి 40 కోట్ల 79 లక్షల మంది ఉన్న ఉద్యోగుల సంఖ్య డిసెంబర్ 2018 సంవత్సరానికి అది 39 కోట్ల 70 లక్షలకు తగ్గింది. ఈ సంవ త్సర కాలంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు ఈ నిరుద్యోగిత బారిన పడ్డారు. అనేక మంది నిరక్ష్యరాస్యులు, వ్యవసాయ కార్మికులు, చిన్న వ్యాపారస్తులు తమ పని కోల్పో తుంటే ఈ విషయంపై మోడీ ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన ప్రతిపక్షం ఏం చేసింది. బిజెపి ప్రభుత్వం చేసిన నోట్ల రద్దు వలన 2018లో దాదాపు 37 లక్షల మంది ఉద్యోగస్తులు, 65 లక్షల మంది గ్రామీణ మహిళలు, 23 లక్షల మంది పట్టణ మహిళలు తమ జీవనోపాధిని కోల్పోయారు. దేశంలో మూడింట రెండొంతుల వున్న గ్రామీణ జనాభా అదే స్థాయిలో ఉద్యోగాలు కోల్పోయిన జాబితాలో 84 శాతం ఉన్నారు. ఈ నిరుద్యోగిత, దాని ప్రభావంపై పరిశోధన చేసిన సిఎంఐఇ సంస్థ తమ అభిప్రాయాన్ని వెల్లడించింది. ప్రధానంగా నిరక్షరాస్య గ్రామీణ మహిళలు, వేతన కార్మికులు, వ్యవసాయ కార్మికులు, చిన్న వ్యాపారస్తులు, మొత్తంగా 40 సంవత్సరాల వయసు కన్నా తక్కువ, 60 సంవత్సరాల కన్నా ఎక్కువ ఉన్నవారు తమ ఉపాధిని కోల్పోయారు. 2018 నవంబర్‌లో 6.6 శాతంగా ఉన్న నిరుద్యోగిత రేటు డిసెంబర్‌కు 7.4 శాతానికి పెరిగింది. గత 15 నెలల కాలంలో డిసెంబర్‌లో అత్యధిక నిరుద్యోగిత వృద్ధిరేటు నమోదైంది. 2014 ఎన్నికల సమయంలో 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని మోడీ ఇచ్చిన హామీని ప్రశ్నించాల్సిన సమయం ఆసన్నమైంది. అయితే 60 సర్వేల నుంచి ప్రపంచ బ్యాంకు 2001 నుంచి తీసిన సమాచారాన్ని తన సౌత్ ఇండియన్ ఫోకస్ సిరీస్ నివేదికలో వివరించింది. 2015లో 50 శాతంగా ఉన్న ఉద్యోగిత అనంతరం దేశ ఆర్థిక వృద్ధితోపాటు పెరిగిందని తెలిపింది. అయితే ఇక్కడ ఉద్యోగాలు కోల్పో తున్న వారిని ప్రపంచ బ్యాంకు గుర్తించకపోవడం గమనార్హం. సంత్సరానికి సరా సరిగా 5 లక్షల 40 వేల ఉద్యోగాలు మార్కెట్‌లోకి వస్తున్నట్లు వారు పేర్కొన్నారు. అయితే ప్రపంచ బ్యాంకు చెబుతున్న ఈ గణాంకాలు ఏమాత్రం ఆమోద యోగ్యం కానివి. వారు చెప్పిన విధంగా కూడా భారతదేశ తలసరి ఆదాయంతో సమానంగా ఉన్న దేశాలతో పోల్చుకుంటే మన ఉద్యోగిత రేటు తక్కువే. వారిని అందుకోవాలంటే సంవత్సరానికి దాదాపు కోటి 35 లక్షల ఉద్యోగాలను కల్పిం చాల్సి ఉంటుంది. 2019 సాధారణ ఎన్నికల్లో మొదటిసారిగా ఓటు వేసేవారు 13 కోట్ల 30 లక్షల మంది ఉన్నారు. 2014లో ఓటు పొందిన వారిని కలుపు కుంటే వీరు 30 కోట్ల వరకూ ఉన్నారు. మొత్తంగా 80.5 కోట్లు ఉన్న ఓటర్లలో ఈ యువతతో వచ్చే ఎన్నికల్లో ఫలితాలు ముడిపడి ఉన్నాయనేది వాస్తవం.

సిటిజన్‌షిప్ బిల్లు ఆమోదం



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో : వివాదాస్పద పౌరసత్వ సవరణ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందింది. ఈ బిల్లును కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లును ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ, ఈ సవరణ వల్ల అస్సాంలో పెద్ద ఎత్తున అల్లర్లు జరుగుతాయని, దీన్ని సెలక్టు కమిటీకి పంపించాలని ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే డిమాండ్ చేశారు. అయితే ఇందుకు స్పీకర్ సుమిత్రా మహజన్ నిరాకరించారు. దీంతో ప్రభుత్వం తీరుకు నిరసనగా కాంగ్రెస్ ఎంపిలు సభ నుంచి వాకౌట్ చేశారు. టిఎంసి ఎంపి సౌగత్ రాయ్ మాట్లాడుతూ బిల్లు ఆమోదం పొందితే అస్సాం సహా ఈశాన్య రాష్ట్రాలు భగ్గుమంటాయని హెచ్చరించారు. ఢిల్లీలో ఉన్నవాళ్లకు ఈ బిల్లు ప్రభావం గురించి తెలియట్లేదని వ్యాఖ్యానించారు.

రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం: ఎండి సలీం

సిపిఎం ఎంపి ఎండి సలీం మాట్లాడుతూ పౌరసత్వ సవరణ బిల్లు భారత రాజ్యాంగ స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధమని అన్నారు. ఆరు ముస్లిం దేశాల నుంచి భారత్‌కు వచ్చే హిందువులకు మాత్రమే పౌరసత్వం ఇవ్వాలని బిజెపి ప్రయత్నించడం బాధాకరమని అన్నారు. మతం, కులం, వర్ణం ప్రకారం ఒక పౌరుడికి పౌరసత్వం ఇవ్వడం భారత రాజ్యాంగానికి విఘాతం కలిగించడమేనని ఆయన నొక్కి చెప్పారు. ఈ సవరణ బిల్లు వలన లౌకికవాదానికి ప్రమాదం వాటిల్లుతుందని హెచ్చరించారు. దేశాన్ని లౌకికతత్వానికి చిరునామాగా నిలపాలని రాజ్యాంగ రూపకర్తలు ప్రయత్నించారని గుర్తు చేశారు. మోడీ సర్కారు మాత్రం భారత్‌ను హిందూ దేశంగా మార్చేందుకు కుట్రలు చేస్తుందని విమర్శించారు. ఎన్‌ఆర్‌సి సవరణ చేయడంతో అస్సాం మరో ఇజ్రాయిల్‌గా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 పౌరసత్వానికి సంబంధించిన విషయాలను పూర్తిగా తెలియజేస్తుందని చెప్పారు. అందులో పేర్కొన్న ప్రతి అంశం దేశంలో లౌకికవాదాన్ని కాపాడేందుకు చేసిన ప్రయత్నమని వివరించారు. అస్సాంలో విభిన్న జాతులు సంఘటితంగా జీవిస్తున్నాయని అన్నారు. బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా భారత్‌కు వలస వచ్చేందుకు ఈ చట్ట సవరణ పెద్ద ఎత్తున ఉపయోగపడే ప్రమాదం ఉందన్నారు. దీంతో అస్సాంలో మత విభజన జరుగుతుందని ఆయన హెచ్చరించారు. బిజెడి ఎంపి భర్తహరి మెహతాబ్, ఆర్జేడి ఎంపి జయప్రకాశ్ యాదవ్, ఎంఐఎం నేత అసదుద్దిన్ ఒవైసి తదితరులు మాట్లాడారు.

త్రిపురలో పోలీసు కాల్పులు

అగర్తల : కేంద్రం ప్రవేశపెట్టిన పౌరసత్వ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ త్రిపురలో గిరిజన యువజన, విద్యార్థి సంఘాలు సమ్మెకు పిలుపునిచ్చాయి. ఈ సందర్భంగా మధబ్రి వద్ద పికెటింగ్‌ను ఏర్పాటు చేయడానికి పోలీసులు ప్రయత్నించారు. దీనిని వ్యతిరేకించడంతో యువకులపై పోలీసులు కాల్పులకు తెగబడ్డారు. దీంతో ఆరుగురు యువకులకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని వెంటనే జెబి పంత్ హాస్పటల్‌కు తరలించారు. వీరిని మాణిక్ సర్కార్‌తో సహా పలువురు సిపిఎం నేతలు పరామర్శించి పోలీస్ కాల్పులను తీవ్రంగా ఖండించారు.

సంక్షిప్తం

నలుగురు తమిళ మత్స్యకారుల అరెస్ట్

రామేశ్వరమ్ /చెన్నై : నలుగురు తమిళనాడుకు చెందిన మత్స్యకారులను శ్రీలంక నావికాదళం మంగళవారం అరెస్టు చేసింది. శ్రీలంక సముద్రజలాల్లోని నెడుంతీవ్ ప్రాంతంలో చేపలను పడుతుండగా సోమవారం రాత్రి వారిని అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నలుగురు మత్స్యకారులు పుదుకొట్టాయ్ జిల్లాలోని కొట్టాయ్‌పట్టణమ్ ప్రాంతానికి చెందినవారని మత్స్యశాఖ ఉన్నతాధికారులు తెలిపారు. ఇదే జిల్లాకు చెందిన నలుగురు మత్స్యకారులను అధికారులు గతంలో అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.

మాంసం దుకాణంపై హిందూత్వ మూకదాడి

ముజఫర్ నగర్ : మాంసం దుకాణాన్ని మూసివేయాలంటూ హిందూత్వమూక దాడులకు దిగిన ఘటన యుపిలోని ముజఫర్ నగర్ జిల్లాలో మంగళవారం చోటు చేసుకుంది. కామ్‌పూర్ గ్రామంలోని ఛాపర్ ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. దీంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణలు తలెత్తాయని, స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ప్రవేశించి వారిని అడ్డుకున్నట్లు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించినట్లు పోలీసులు తెలిపారు.

వేడుకలో మద్యం సీసాలు పంపిణీ చేసిన బిజెపి నేత


హర్డోయి/లక్నో : ఉత్తరప్రదేశ్‌లోని హర్డోయి గ్రామంలో జరిగిన ఒక వేడుకలో మద్యం సీసాలు పంచడం సంచలనం రేపింది. స్థానిక పశి కమ్యూనిటీకి చెందిన శవరణా దేవి ఆలయంలో జరిగిన ఒక ఉత్సవంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఇటీవల సమాజ్‌వాది పార్టీ నుండి బిజెపిలోకి మారిన నరేష్ అగర్వాల్ కుమారుడు నితిన్ అగర్వాల్ పశి 'సమ్మేళన్' పేరుతో ఒక వేడుకను ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి వచ్చిన గ్రామస్తులకు ఆయన బాక్సులను పంపిణీ చేశారు. ఈ బాక్సులో పూరీ, సబ్జీ, మిఠాయితో పాటు ఒక మద్యం సీసా కూడా ఉన్నాయి. అలాగే ఈ వేడుకకు హాజరైన మైనర్‌లకు కూడా ఈ విధంగా బాక్సలను అందించడం గమనార్హం. అయితే ఈ ఘటనపై నితిన్ అగర్వాల్ స్పందించలేదు.

ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడి ఆకస్మిక రాజీనామా

కొత్త అధ్యక్షుడిగా క్రిస్టాలినా జార్జియేవా!

న్యూయార్క్: ప్రపంచ బ్యాంకు గ్రూపు అధ్యక్షుడు జిమ్‌యోంగ్ కిమ్ అనూహ్యమైన రీతిలో తన పదవికి రాజీనామా చేశారు. ఆయన పదవీ విరమణకు ఇంకా మూడేండ్ల సమయం ఉంది. పదవీ కాలం పూర్తికాకముందే ఆయన వైదొలగడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఫిబ్రవరి1 నుంచి అధ్యక్షుడి బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్టు ఆయన వెల్లడించారు. మౌలిక రంగంలోని సంస్థలో అవకాశం రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆయన వెల్లడించారు. ప్రపంచ సంస్థకు అధ్యక్షుడిగా ఉండటం ఎంతో గౌరవంగా భావిస్తున్నానని, పేదరికం నిర్మూలన కోసం ఎంతో కృషి చేసినట్టు జిమ్ యాంగ్ తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా పేదరికం పెరుగుతున్న దశలో ప్రపంచ బ్యాంక్ సేవలు ఎంతో అవసరమని ఆయన అన్నారు.

జిమ్ ప్రపంచ బ్యాంక్ అధ్యక్షుడిగా 2012లో తొలిసారి బాధ్యతలు స్వీరించారు. 2017లో రెండోసారి ఎన్నికైన జిమ్ పదవీ కాలం 2022తో ముగియనుంది. 2030 నాటికి పేదరికాన్ని నిర్మూలించడం, వర్ధమాన దేశాల్లోని వ్యక్తుల ఆదాయాన్ని పెంచడం అనే రెండు లక్ష్యాలను బ్యాంకుకు ఆయన నిర్దేశించారు. ప్రపంచ బ్యాంకు ప్రస్తుత సీఈవో క్రిస్టాలినా జార్జియేవా ఆయన స్థానంలో తాత్కాలిక అధ్యక్షురాలిగా వచ్చే నెల ఒకటో తేదీ నుంచి బాధ్యతలను స్వీకరించనున్నట్టు సమాచారం. వాతావరణ మార్పులపై పోరాడేందుకు ప్రపంచబ్యాంకు వచ్చే అయిదేళ్లలో రెట్టింపు స్థాయిలో అంటే 2వేల కోట్ల డాలర్లు పెట్టుబడిగా పెడుతుందని కొద్ది మాసాల క్రితమే ఆయన



ప్రకటించారు. వాతావరణ మార్పులు, అంటు వ్యాధులు, కరువు, శరణార్థుల వంటి అనేక సంక్లిష్టమైన సమస్యలను పరిష్కరించేందుకు ప్రపంచ బ్యాంకు కృషి చేయాల్సి వుందని ఆయన పేర్కొన్నారు.

నాలుగోసారి ప్రధానిగా హసీనా ప్రమాణస్వీకారం



ఢాకా: ఇటీవలి పార్లమెంట్ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన అవామీ లీగ్ పార్టీ నేత షేక్ హసీనా సోమవారం నాడు వరుసగా నాలుగోసారి బంగ్లాదేశ్ ప్రధానిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. 71 ఏళ్ల హసీనాతో అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్ హమీద్ సోమవారం ఇక్కడి బంగభవన్‌లో మూడోసారి ప్రమాణస్వీకారం చేయించారు. తొలిసారిగా 1996లో బంగ్లాదేశ్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన హసీనా తరువాత 2008, 2014ల్లో కూడా ప్రధానిగా బాధ్యతలు స్వీకరించి పూర్తి పదవీ కాలం నిర్వహించారు. హసీనాతో పాటు 24 మంది కేబినెట్ మంత్రులు, 19 మంది సహాయ మంత్రులు, ముగ్గురు ఉప మంత్రులతో కూడా అధ్యక్షుడు హమీద్ ప్రమాణస్వీకారం చేయించారు. కొత్త మంత్రివర్గంలో అధికశాతం మంది కొత్త వారే కావటం విశేషం. పలువురు సీనియర్లకు మంత్రిమండలిలో చోటు దక్కలేదు. రక్షణ వంటి ప్రధాన మంత్రిత్వశాఖలను ప్రధాని హసీనా తన వద్దే వుంచుకున్నారు.

జర్మనీ ఎంపీపై దుండగుల దాడి

బెర్లిన్ : జర్మనీ ఏఎఫ్‌డీ (ఆల్టర్నేటివ్ ఫర్ జర్మనీ) పార్టీ ఎంపీ ఫ్రాంక్ మాగ్నిట్జ్‌పై గుర్తు తెలియని దుండగులు దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడ్డ మాగ్నిట్జ్ ప్రస్తుతం అపస్మారక స్థితిలో ఉన్నారని వైద్యులు తెలిపారు. తల భాగంపై, నుదుటిపై బలమైన గాయాలు ఉన్నాయని అన్నారు. స్థానిక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...సోమవారం బెర్లిన్ నగరంలో మాగ్నిట్జ్‌పై దాడి జరిగింది. ఈ దాడి వెనుక రాజకీయ కుట్ర దాగివుందని పోలీసులు అనుమానిస్తున్నారు. దాడి జరిగిన పరిసర ప్రాంతాల్లోని అన్ని సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నారు. ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామని పోలీస్ అధికారులు తెలిపారు. ఎంపీ అపస్మారక స్థితి నుంచి బయటకు వచ్చినట్టయితే దాడికి సంబంధించి పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశముంది. మాగ్నిట్జ్‌పై జరిగిన దాడిని పలువురు ఎంపీలు ఖండించారు. దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులు జరగకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని కోరారు.

జిన్‌పింగ్‌తో కిమ్ భేటీ

సతీసమేతంగా మూడు రోజుల పర్యటన

బీజింగ్: ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జొంగ్ ఉన్ సతీసమేతంగా చైనాలో పర్యటించారు. ఈనెల 10వరకు ఆయన చైనాలో ఉంటారని ఉత్తరకొరియా అధ్యక్ష కార్యాలయం వెల్లడించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో కలసి తాను త్వరలో సమావేశంలో పాల్గొననున్న నేపథ్యంలో కిమ్ చైనాలో పర్యటిస్తుండడం గమనార్హం. వారిద్దరి మధ్య గత ఏడాది జూన్‌లో అణ్వస్త్ర నిరాయుధీకరణ వంటి అంశాలపై సమావేశం జరిగిన విషయం తెలిసిందే. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో కిమ్ భేటీ కానున్నారు. గతేడాది వీరిద్దరి మధ్య మూడు సార్లు సమావేశాలు జరిగాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జే ఇన్‌తో కిమ్ చర్చలు నిర్వహించడానికి ముందు, తర్వాత ఆయన జిన్ పింగ్‌తో భేటీ అయ్యారు. త్వరలో ట్రంప్‌తో రెండోసారి సమావేశం కానున్న నేపథ్యంలో మళ్లీ చైనా అధ్యక్షుడితో ఆయన చర్చించనున్నట్టు తెలుస్తోంది. సోమవారం మధ్యాహ్నం ఉత్తరకొరియా నుంచి కిమ్ తన భార్య, తమ దేశ అధికారులతో ప్రత్యేక రైలులో చైనా బయలుదేరారని ఆ దేశ మీడియా తెలిపింది. జనవరి 8న ఆయన పుట్టినరోజు వేడుక కూడా ఉందని చెప్పింది. జిన్ పింగ్ పంపిన ఆహ్వానం మేరకు ఆయన తమ దేశంలో పర్యటిస్తున్నట్టు చైనా మీడియా పేర్కొంది. ఉత్తరకొరియాకు చైనా ప్రధానమైన ఆర్థిక, దౌత్యపర మిత్ర దేశంగా ఉంది. ఇటీవల నూతన సంవత్సరం సందర్భంగా కిమ్ మాట్లాడుతూ.. తాను ట్రంప్‌ను కలవడానికి సిద్ధంగా ఉన్నానని అన్నారు. అలాగే, తమ దేశంపై ఉన్న ఆంక్షలను సడలించాలని డిమాండ్ చేశారు.





అణ్వస్త్ర దేశాల మధ్య యుద్ధం ఆత్మహత్యాసదృశమే : ఇమ్రాన్



ఇస్లామాబాద్ : అణ్వస్త్ర దేశాల మధ్య యుద్ధం ఆత్మహత్యాసదృశమే అవుతుందని తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ అధినేత, పాకిస్తాన్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ వ్యాఖ్యానించారు. టర్కీకి చెందిన టీఆర్‌టీ వరల్డ్ మీడియా సంస్థతో ఇమ్రాన్ మాట్లాడారు. భారత్, పాకిస్తాన్ వద్ద అణ్వాయుధాలు ఉన్నాయని, ఈ రెండు దేశాల మధ్య యుద్ధం సంభవించినట్టయితే అది ఆత్మహత్యకు పాల్పడటం లాంటిదని అన్నారు. ఇరు దేశాల మధ్య శాంతి ప్రక్రియ కోసం తాను చేసిన ప్రతిపాదనలపై భారత్ స్పందించడంలేదని ఆరోపించారు. తాము ఇప్పటికీ భారత్‌తో ద్వైపాక్షికచర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నామని ఉద్ఘాటించారు. చర్చల ద్వారా ఇరు దేశాలు సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. చర్చల ప్రతిపాదనను భారత్ పలుమార్లు తోసిపుచ్చిందని ఆరోపించారు. రెండు అణ్వాయుధ దేశాలు యుద్ధం గురించి కనీసం ఆలోచించడం కూడా సరికాదని ఇమ్రాన్ చెప్పారు. ప్రచ్ఛన్న యుద్ధాన్ని సైతం ఆలోచించకూడదన్నారు. దాని వల్ల పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందన్నారు. ద్వైపాక్షిక చర్చలు మాత్రమే ఏకైక మార్గమని చెప్పారు. కాశ్మీరీల హక్కులను భారత ప్రభుత్వం కాలరాస్తోందని మరోసారి ఆరోపించారు. కాశ్మీర్ పౌరుల హక్కులను భారత్ ఎన్నడూ అణిచివేయలేదన్నారు.

వైపీజీకి మద్దతిస్తే ఖబడ్దార్

అమెరికాకు ఎర్డోగన్ హెచ్చరిక

అంకారా : సిరియాలోని కుర్దు తిరుగుబాటుదారులకు (వైపీజీ) ట్రంప్ సర్కార్ మద్దతిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని టర్కీ అధ్యక్షుడు ఎర్డోగన్ ట్రంప్ సర్కార్‌ను హెచ్చరించారు. పార్లమెంట్‌లో అధికార ఏకే పార్టీ సభ్యులతో ఆయన మాట్లాడారు. ' అమెరికా బలగాలు సిరియా నుంచి వైదొలగాలని మేం కోరుతున్నాం. యూఎస్ బలగాల ఉపసంహరణకు సంబంధించి అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జాన్ బోల్టన్ పలు షరతులు పెట్టారు. ట్రంప్ సర్కార్ వైపీజీకి మద్దతు ఇవ్వడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. టర్కీలో నిషేధిత ఉగ్రసంస్థల జాబితాలో వైపీజీ కూడా ఒకటి. అలాంటి సంస్థకు అమెరికా మద్దతి స్తోంది. అంకారా బలగాలకు, వైపీజీకి మధ్య పోరు కొనసాగుతూనే



ఉంటు ంది. అమెరికా తక్షణమే వైపీజీకి మద్దతు ఇవ్వడాన్ని ఉపసంహరించుకోవాలి' అని అన్నారు. కాగా, సిరియాలో పెట్రేగిపోయిన ఉగ్రసంస్థల నిర్మూలనలో వైపీజీ కూడా తన వంతు పాత్ర పోషిస్తున్నది. టర్కీ ప్రభుత్వం దృష్టిలో వైపీజీ ఓ నిషేధిత ఉగ్రసంస్థ. అయితే, అమెరికా మాత్రం వైపీజీకి ఆయుధాలు, క్షిపణులు సరఫరా చేస్తూ కొంతకాలంగా టర్కీని రెచ్చగొడుతున్నది.

బ్రిటన్ వీసాలు ఇక మరింత భారం

లండన్ : బ్రిటన్ వీసాలు ఇకపై భారం కానున్నాయి. ఇమ్మిగ్రేషన్ హెల్త్ సర్‌చార్జీలను (ఐహెచ్‌ఎస్) రెండింతలు పెంచాలని బ్రిటన్ ప్రభుత్వం నిర్ణయించుకుంది. వీసాలకు దరఖాస్తు చేసుకునే సమయంలోనే ఐహెచ్‌ఎస్ చెల్లించాల్సి ఉంటుంది. బ్రిటన్ తాజా నిర్ణయంతో భారతీయ విద్యార్థులు, ఉద్యోగులు, కుటుంబ సభ్యులకు ఇబ్బందులు తప్పవు. 2015లో బ్రిటన్ ఐహెచ్‌ఎస్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఐహెచ్‌ఎస్ చెల్లించిన వీసాదారులు బ్రిటన్‌లో నివసించినంత కాలం నేషనల్ హెల్త్ సర్వీసెస్ స్కీమ్ ద్వారా వైద్య సేవలు పొందేందుకు అవకాశం ఉంటుంది. ప్రస్తుతం 200 యూరోలు ఉన్న ఐహెచ్‌ఎస్ సర్‌ఛార్జీలు రెట్టింపయ్యాయి. పెరిగిన ధరలు బుధవారం నుంచి అమల్లోకి రానున్నాయి. బ్రిటన్ వీసాలకు దరఖాస్తు చేసుకున్న కుటుంబ సభ్యులంతా కచ్చితంగా ఐహెచ్‌ఎస్ చెల్లించాల్సి ఉంటుంది. ఒక్కో కుటుంబం నుంచి నలుగురు సభ్యులు వీసాలకు దరఖాస్తు చేసుకున్నట్టయితే వారంతా వేర్వేరుగా ఐహెచ్‌ఎస్ చెల్లించాల్సి ఉంటుంది. ఈ చార్జీలు రెట్టింపు కావడంతో భారతీయులు ఎక్కువగా ఇబ్బందిపడే అవకాశముంది. ఈయూ సభ్యదేశాలకు ఈ చార్జీలు వర్తింపవు. ఈయూలో సభ్యత్వం లేని దేశాలకు ఐహెచ్‌ఎస్ పెను భారంగా మారే అవకాశముంది.

గాబన్‌లో సైనిక కుట్ర విఫలం, దేశంలో ఇంటర్నెట్ నిలిపివేత

గాబన్: ప్రస్తుతం మొరాకోలో వైద్య చికిత్స పొందుతున్న గాబన్ అధ్యక్షుడు ఆలీ బొంగోను గద్దె దింపి అధికారం చేజిక్కించుకునేందుకు సోమవారం ఆ దేశ సైన్యం పన్నిన కుట్ర విఫలమైంది. కుట్ర విఫలంతో అప్రమత్తమైన గాబన్ ప్రభుత్వం దేశంలో ఇంటర్నెట్, మీడియా సేవలను నిలిపివేసింది. దీనితో తిరుగుబాటు చేసిన సైనికులను అరెస్ట్ చేశారా? లేక చంపివేశారా? అన్న అంశంపై స్పష్టత వెలువడలేదు. మంగళవారం కూడా ఈ అనిశ్చితి కొనసాగింది. అయితే సమాచారాన్ని అడ్డుకుంటూ ప్రభుత్వం చేపట్టిన చర్యను కమిటీ టు ప్రొటెక్ట్ జర్నలిస్ట్స్ (సిపిజె) తీవ్రంగా ఖండించింది. సంక్షోభసమయాల్లో సమాచార, ప్రసార సేవలను నిలిపివేస్తే జర్నలిస్టులు తమ విధులను సమర్థవంతంగా, సురక్షితంగా నిర్వహించటం కష్టసాధ్యమవుతుందని సిపిజె ఆఫ్రికా సమన్వయకర్త ఏంజెలా క్వింటాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వెంటనే సమాచార, ప్రసారసేవలను పునరుద్ధరించాలని ఆమె తన ప్రకటనలో గాబన్ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

దేశానికి నమూనా ఎపి అంగన్‌వాడీలు

- కరువు నివారణకు యుద్ధప్రాతిపదికన చర్యలు
- 'జన్మభూమి-మాఊరు'పై సిఎస్ పునేఠా టెలికాన్ఫరెన్స్

ప్రజాశక్తి - అమరావతిబ్యూరో

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో రాష్ట్రానికి చెందిన నలుగురు అంగన్‌వాడీ కార్యకర్తలకు జాతీయ అవార్డులొచ్చాయని, ఇలాగే కృషిచేస్తే దేశానికి ఎపి నమూనాగా నిలుస్తుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠా అన్నారు. ఏడు రోజులుగా జరుగుతున్న 'జన్మభూమి-మా ఊరు' కార్యక్రమంపై జిల్లా కలెక్టర్లు, నోడల్ అధికారులు, ప్రజాప్రతినిధులతో మంగళవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పునేఠా మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన ఫిర్యాదుల్ని త్వరితగతిన పరిష్కరించి, అన్ని వర్గాల అభిమానం పొందాలన్నారు. జన్మభూమిలో లక్షలాది పశువులకు వైద్యం అందిస్తున్నామని, పశు పోషకులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రంగు మారిన ధాన్యం కొనుగోలులో రైతుల్ని అధికారులు ఇబ్బందులు పెట్టొద్దని, సక్రమంగా ధాన్యం కొనుగోలు చేయాలని, ఇప్పటికే ధాన్యం కొనుగోలుపై సమీక్షించామని చెప్పారు. అవసరాన్ని బట్టి రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీలు ఇస్తామన్నారు. గ్రామాల్లో పశుగ్రాసం సాగు ముమ్మరం చేయాలన్నారు. వేసవిలో నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బంది పడకుండా నీటి సరఫరా చేస్తామన్నారు. కరువు నివారణకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడతామన్నారు. గ్రామ, వార్డు సభల్లో అభివృద్ధి ప్రణాళికలపై చర్చించాలని, అందరూ వాటిని ఆమోదించాలని, కార్యాచరణకు సిద్ధంకావాలని అధికారుల్ని ఆదేశించారు.

కాపు, వాల్మీకుల రిజర్వేషన్లు తేల్చాకే మద్దతు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

కాపులు, వాల్మీకుల రిజర్వేషన్ల సంగతి తేల్చాకే అగ్రవర్ణాలకు 10 శాతం రిజర్వేషన్లపై కేంద్రానికి మద్దతు ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే ప్రధాని మోడీ ఇలాంటి ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు. మంగళవారం పూడిచెర్ల గ్రామం వద్ద దాదాపు వెయ్యి ఎకరాల్లో రూ.118 కోట్లతో నిర్మించిన కర్నూలు విమానాశ్రయాన్ని సిఎం లాంఛనంగా ప్రారంభించారు.

అనంతరం సభలో సిఎం చంద్రబాబు మాట్లాడుతూ ఓర్వకల్లులో నిర్మించిన విమానాశ్రయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. మార్చి నుంచి కర్నూలు విమానాశ్రయానికి రెగ్యులర్ విమాన సర్వీసులు నడిపేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఇక్కడి నుంచి అమరావతి, తిరుపతి, విశాఖపట్నం, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ నగరాలకు సర్వీసులను నడిపేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇక్కడే ఏవియేషన్ అకాడమీని ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఇక్కడ పారిశ్రామికవాడను, ఫార్మాసిటీని ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఆల్ట్రా సోలార్ మెగా పార్కును ఏర్పాటు చేసి వెయ్యి మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ ప్రజలకు విద్యుత్ కొరత లేకుండా చేస్తున్నామని పేర్కొన్నారు. కొలిమిగుండ్ల ప్రాంతంలో సిమెంట్ క్లస్టర్ పరిశ్రమను, తంగెడంచెలో విత్తనోత్పత్తి కేంద్రాన్ని నెలకొల్పి వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం కర్నూలులోని ప్రభుత్వాస్పత్రి ఆవరణంలో రూ.120 కోట్లతో చేపట్టనున్న క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌కు శంకుస్థాపన చేసి, శకునాల, గని గ్రామాల మధ్య 1000 మెగావాట్ల సోలార్ పవర్‌ప్లాంట్లను ప్రారంభించారు. అనంతరం కోసిగి మండల కేంద్రానికి చంద్రబాబు, డిప్యూటీ సిఎం కెఇ.కృష్ణమూర్తి, మంత్రి లోకేష్ హెలిక్యాప్టర్ ద్వారా చేరుకున్నారు. హెలిప్యాడ్ నుంచి కాన్వాయ్‌లో బయల్దేరిన ముఖ్యమంత్రి మధ్యలో ఎస్సీ కాలనీ వద్ద ఓ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. సభాస్థలికి చేరుకున్న తర్వాత జలధార, మాఊరి బాట ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. పంచాయతీరాజ్ విభాగంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను పరిశీలించారు. మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా రాకుండా జగన్ అడ్డుపడుతున్నారని విమర్శించారు. కేసుల నుంచి జగన్ విముక్తి పొందేందుకు మోడీతో జత కట్టారని ఆరోపించారు. కేంద్రం 19 విభజన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్‌డిఎస్, వేదవతితో పాటు ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. వాల్మీకుల అభివృద్ధి కోసం రూ.100 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. కోసిగిలో బిసిలకు రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేస్తామన్నారు. కాపులకు తగిన ప్రాధాన్యతనిచ్చి రిజర్వేషన్లను అమలు చేస్తామన్నారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చేందుకు కృషి చేస్తానన్నారు. జయప్రకాష్ నారాయణ లాంటి మేధావులు నివేదిక తయారు చేసి రాష్ట్రానికి రూ.85 వేల కోట్లు ఇవ్వాలని కోరినా కేంద్రం ఇవ్వలేదన్నారు. కర్నూలు నుంచి అమరావతికి ఎక్స్‌ప్రెస్ రైలు త్వరలో ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎమ్మిగనూరు ప్రాంతంలో త్వరలో టెక్స్‌టైల్ పరిశ్రమ ఏర్పాటు చేస్తామన్నారు.

అనంతరం మంత్రి లోకేష్ మాట్లాడారు. రాబోయే కాలంలో ఇంటింటికి కుళాయి కనెక్షన్ ఇచ్చి నీటి సమస్య తీర్చే బాధ్యత తాను తీసుకుంటానన్నారు. రాష్ట్ర మంత్రులు కాల్వ శ్రీనివాసులు, ఎన్‌ఎమ్‌డి.ఫరూక్, జడ్‌పి ఛైర్మన్ మల్లెల రాజశేఖర్, రాష్ట్ర ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్, కలెక్టర్ ఎస్.సత్యనారాయణ, ఎస్పీ ఫక్కీరప్ప పాల్గొన్నారు. సాయంత్రం ముఖ్యమంత్రి కర్నూలు నుంచి నేరుగా ఢిల్లీకి ప్రత్యేక విమానంలో వెళ్లారు.

రాజధాని భూ కొనుగోళ్లపై బహిరంగ చర్చకు సిద్ధం

మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని ప్రాంతంలో వేల ఎకరాల భూములు మంత్రులు కొనుగోలు చేశారన్న నిరాధార ఆరోపణలపై బహిరంగ చర్చకు సిద్ధమని పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మంగళవారం సచివాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షనేత జగన్ టిడిపి నేతలపై ఆరోపణలు చేస్తూ పుస్తకం విడుదల చేయడంపై ఆయన మండిపడ్డారు. రాజధానిలో 3195 ఎకరాలు మంత్రి నారాయణ కొనుగోలు చేశారన్న ఆరోపణలను ఖండించారు. మోడీ మెప్పు కోసమే ఆ పుస్తకాన్ని రాశారన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీలపై మోడీని ప్రశ్నించే ధైర్యం జగన్‌కు లేదన్నారు. రాష్ట్ర బడ్జెట్ రూ. లక్ష కోట్లు ఉంటే రూ. 6 లక్షల కోట్లు అవినీతి జరిగిందంటూ పుస్తకంలో అన్నీ నిరాధార ఆరోపణలే ఉన్నాయన్నారు. సిబిఐ నిర్ధారించిన జగన్ అక్రమ ఆస్తులు రూ. 43 వేల కోట్లను ప్రజలకు పంచాలన్నారు. ఎన్ని పాదయాత్రలు చేసినా ప్రజలు జగన్‌ని నమ్మరని చెప్పారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపికి 150 సీట్లు వస్తాయని, ఇప్పుడున్న స్థానాలు కూడా వైసిపి గెలుచుకోలేదని జోస్యం చెప్పారు.

మొదటి పేజీ తరువాయి

రాజ్యాంగ సవరణకు ముందు విస్తృత సంప్రదింపులు అవశ్యం

రాజ్యాంగంలోని 15, 16 అధికరణలకు సవరణలు చేయడం అవశ్యం. రాజ్యాంగానికి ఏ సవరణ చేయాలన్నా దానికి కొంత సమయం అవసరమవుతుంది, పైగా అది అమల్లోకి రావాలంటే మెజారిటీ అసెంబ్లీల ఆమోద ముద్ర కూడా తప్పనిసరి. కానీ కేంద్ర మంత్రివర్గం హడావిడిగా వ్యవహరించిన తీరును చూస్తుంటే, ఎన్నికల ప్రయోజనాల కోసం ఈ అంశాన్ని ఉపయోగించుకోవాలన్న ఉద్దేశం స్పష్టంగా కనిపిస్తోందని పొలిట్‌బ్యూరో పేర్కొంది. ఉపాధి సృష్టించడానికి బదులుగా మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు ఉద్యోగాలు పోయే పరిస్థితికి దారి తీశాయి. ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిలకు ప్రస్తుతమున్న రిజర్వేషన్ల కోటానే పూర్తిగా భర్తీ చేయడం లేదు. నయా ఉదారవాద విధానాలను అత్యంత దూకుడుగా అనుసరించడం, ప్రైవేటు రంగాన్ని రిజర్వేషన్లకు దూరంగా వుంచడం వల్ల రిజర్వేషన్ల ప్రయోజనాలు తుడిచిపెట్టుకుపోతున్నాయని సిపిఎం విమర్శించింది. రాజ్యాంగ సవరణ తీసుకురావడానికి ముందుగా విస్తృతంగా సంప్రదింపులు చేపట్టాలని సిపిఎం పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది.

మోడి సర్కార్‌కు భంగపాటు

వర్మ రెండేళ్ళ పదవీ కాలం ఈ జనవరి 31తో ముగియనున్నది.

మోడీ రాజీనామా చేయాలి
సిపిఎం పొలిట్ బ్యూరో

సిబిఐ డైరెక్టర్ అలోక్ వర్మ కు వెంటనే బాధ్యతలు అప్పగించాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో ప్రధాని మోడీకి పెద్ద ఎదురుదెబ్బ తగిలిందని సిపిఎం పొలిట్ బ్యూరో వ్యాఖ్యానించింది. మోడీకి మనస్సాక్షి ఉంటే తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. సిబిఐ వంటి సంస్థలను తన గుప్పెట్లో పెట్టుకొనేందుకు నియమ, నిబంధనలను ప్రభుత్వం ఏ విధంగా ఉల్లంఘిస్తుందో ఈ తీర్పు స్పష్టం చేసిందని పేర్కొంది. వచ్చే ఎన్నికల్లో మోడీ ప్రభుత్వాన్ని ప్రజలు గద్దె దించుతారనడానికి ఇదొక కారణమని పొలిట్ బ్యూరో తన ప్రకటనలో పేర్కొంది.

నూతన రాజకీయ ప్రత్యామ్నాయం అవసరం

పి.మధు, కార్యదర్శి వర్గ సభ్యులు వి.శ్రీనివాసరావు, వై.వెంకటేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, కార్యదర్శి వర్గ సభ్యులు జెల్లి విల్సన్, జనసేన నాయకులు నాదెండ్ల మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

ఇబిసి బిల్లు ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

అభ్యంతరం తెలిపారు. ఇది చాలా ముఖ్యమైన విషయమని, ఈ బిల్లును తీసుకు రావడంలో ప్రభుత్వం తొందర పడుతోందన్నారు.

సెలక్ట్ కమిటీకి పంపండి : సిపిఎం

బిల్లును సెలక్ట్ కమిటీకి పంపాలని, జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలని వేయాలని సిపిఎం ఎంపి జితిన్ చౌదరి డిమాండ్ చేశారు. మంగళవారం లోక్‌సభలో జరిగిన చర్చలో పాల్గొన్న జితిన్ చౌదరి పాల్గొన్నారు. 2014 ఎన్నికల్లో మోడీ దేశ యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేకనే, రిజర్వేషన్ల అంశాన్ని ముందుకు తీసుకువచ్చారని విమర్శించారు. బిల్లు తీసుకొచ్చిన విధానం కూడా సరైన విధంగా లేదని ఆయన అన్నారు. ఒక బిల్లును ప్రవేశపెట్టేందుకు కొన్ని నియమ నిబంధనలుంటాయని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. సిపిఎం నేతృత్వంలోని ప్రభుత్వాలు ఉన్న చోట అన్నివర్గాలతో చర్చించిన తర్వాతే ఏ బిల్లు అయినా సభల్లో ప్రవేశ పెట్టడం జరిగేదని జితిన్ గుర్తు చేశారు. దేశంలోని కార్మిక వర్గం ఒకవైపు జాతీయ సమ్మె చేస్తుంటే... ప్రభుత్వం వారి గురించి కనీసం ఆలోచన కూడా చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే, ఆర్థికంగా వెనుకబడి పేదల గురించి ప్రభుత్వానికి ఆలోచన రావడం మంచి పరిణామమేనని అన్నారు. అదే సమయంలో ఎస్సీ, ఎస్టీ, ఒబిసి చట్టాలను పటిష్టంగా ప్రస్తుతం ఎందుకు అమలు చేయడం లేదన్నారు.

కుల ప్రాతిపదికనే రిజర్వేషన్లు : తంబిదురై

ఎఐఎడిఎంకె పక్షాన తంబిదురై మాట్లాడుతూ రిజర్వేషన్లు కుల ప్రాతిపదికన ఉండాలే కాని, ఆర్థిక ప్రాతిపదికన కాదన్నారు. సామాజిక న్యాయం కోసమే రిజర్వేషన్లు అవసరమని తమ పార్టీ భావిస్తుందన్నారు. ప్రత్యేకంగా రిజర్వేషన్లు ఇస్తున్నారంటే మీ పథకాలు సరిగా అమలు కావడం లేదని అర్థమా? అని అడిగారు..

రాజకీయ ఎత్తుగడ : సుదీప్ బంధోపాధ్యాయ్

తృణమూల్ కాంగ్రెస్ సభ్యుడు సుదీప్ బందోపాధ్యాయ్ మాట్లాడుతూ ఉద్యోగాలే లేనప్పుడు రిజర్వేషన్ల అవసరమేముందని ప్రశ్నించారు. ఈ బిల్లుతో నిజంగానే నిరుద్యోగ సమస్య పరిష్కారమవుతుందా అని ప్రశ్నించారు. ఇదొక రాజకీయ ఎత్తుగడమాత్రమేనని చెప్పారు. అన్నారు. మహిళా రిజర్వేషన్‌బిల్లుకు ఇ దే ప్రాధాన్యత ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు.

ఇది ఆరంభం మాత్రమే : శివసేన

శివసేన సభ్యుడు ఆనందరావు అడ్సూల్ మాట్లాడుతూ తమ పార్టీ బిల్లుకు మద్దతిస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబిసిలను మినహాయిస్తే విద్య, సామాజిక, ఆర్థిక రంగాలలో ఇతర కులాల వారు పెద్ద సంఖ్యలో వెనుకబడి ఉన్నారన్నారు. ఈ బిల్లు కేవలం ప్రారంభం మాత్రమేనన్నారు. పలు కులాల వారు రిజర్వేషన్లు డిమాండ్ చేస్తున్నారన్నారు.

మేం మద్దతిస్తున్నాం :టిఆర్ఎస్

తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యులు జితేందర్ రెడ్డి మాట్లాడుతూ తమ పార్టీ బిల్లుకు మద్దతిస్తుందన్నారు. దేశంలో ఆర్థిక వెనుకబాటు తనం కొనసాగడానికి ప్రస్తుత, అంతకుముందు ప్రభుత్వాలే కారణమని చెప్పారు

వ్యతిరేకించనవసరం లేదు : రామ్ విలాస్ పాశ్వాన్

ఎల్‌జెపి సభ్యుడు, కేంద్ర మంత్రి రామ్ విలాస్ పాశ్వాన్ మాట్లడుతూ బిల్లును స్వాగతించారు. బిల్లును వ్యతిరేకిస్తున్న వారు కూడా ఈ 10 శాతం రిజర్వేషన్‌లో ఉన్నారన్నారు. అందువల్ల ఈ బిల్లును వారు వ్యతిరేకించాల్సిన అవసరం లేదన్నారు. సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్ దీంతో నెరవేరింది.

నెలాఖరులోగా 'చుక్కలు' తేల్చాలి

లేదంటే అధికారుల పేర్లు బయటపెడతా
సినీ హీరో శివాజీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి కొందరు అధికారులు వ్యతిరేకంగా పనిచేస్తున్నారని సినీ హీరో శివాజీ మరోసారి ఆరోపించారు. చుక్కల భూముల పేరుతో కొందరు అధికారులు ప్రభుత్వంపై కుట్ర పన్నారంటూ ఇటీవల సంచలన వ్యాఖ్యలు చేసిన ఆయన...తాజాగా మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ నెలాఖరు నాటికి చుక్కల భూముల సమస్య పరిష్కారం కావాలని, లేదంటే అందులో ప్రమేయమున్న అందరి అధికారుల పేర్లు బయటపెడతానని హెచ్చరించారు. మంగళవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడిన...కొందరు అధికారులు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకొస్తున్నారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో రైతులు విద్యుత్ సమస్యతో పాటు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, అందులో చుక్కల భూముల సమస్య కూడా ప్రధానమైందని తెలిపారు. 2007లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చుక్కల భూములు, అసైన్డ్ భూములు పేదలకు పంచాలని జీవో తీసుకొచ్చారని గుర్తుచేశారు. అయితే కొందరు అధికారులు మాత్రం రైతులు, పేదలకు ఆయా భూములపై పట్టాలివ్వకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. నిషేధిత భూముల పేరుతో అధికారులు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ఉన్నతాధికారులపైనే తనకు అనుమానాలున్నా యన్నారు. ఇదే విషయాన్ని సిఎం చంద్రబాబు దష్టికి కూడా తీసుకెళ్లానని తెలిపారు. ఏపీలో దాదాపుగా 12 లక్షల ఎకరాల చుక్కలు భూములున్నాయని, వాటికి సంబంధించి దాదాపు 30 లక్షల మంది ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. నల్సార్ యూని వర్సిటీ ప్రొఫెసర్లతో తాను మాట్లాడి ఈ సమాచారాన్ని సేకరించానని వెల్లడించారు. రెవిన్యూ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయాల్సిన అవసరముందన్న శివాజీ తెలంగాణ తరహాలో సమగ్ర భూసర్వే చేపట్టాలని ప్రభుత్వానికి సూచించారు.

అజ్ఞానాంధకారంలో ఎయు విసి

మానవహక్కుల వేదిక

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కౌరవులు టెస్ట్‌ట్యూబ్ బేబీలే అని వ్యాఖ్యానించిన ఆంధ్రా యూనివర్శిటీ విసి జి నాగేశ్వరరావు అజ్ఞానాంధకారంలో ఉన్నారని మానవ హక్కుల వేదిక ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యుడు వి ఎస్ కృష్ణ పేర్కొన్నారు. శాస్త్ర జ్ఞానం విస్తుపోయేలా విసి చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సైన్స్ కాంగ్రెస్ సభలు పుక్కిటిపురాణాలను పంచుకునే సాదాసీదా సభలు కావనే విషయాన్ని విసి గ్రహించాలని సూచించారు. విసి చేసిన వ్యాఖ్యలు భావితరాలను తప్పుదోవ పట్టిస్తాయని తెలిపారు. దేశంలో అత్యుత్తమ శాస్త్రీయ ఆలోచనల కలబోతకు వేదికగా నిలవాల్సిన సైన్స్ కాంగ్రెస్ సమావేశాలు అజ్ఞాన, అశాస్త్రీయ ఆలోచనలకు వేదికగా మారడం దురదృష్టకరమని పేర్కొన్నారు. అశాస్త్రీయ భావాలను నిరసించాలనీ, తిరస్కరించాలనీ ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

శిల్పారామం క్యాలెండర్ ఆవిష్కరణ

శిల్పారామాల అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం కట్టుబడి ఉందని పర్యాటక, భాషా సాంస్కృతిక శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా అన్నారు. ఆంధ్రప్రదేశ్ శిల్పారామం, ఆర్ట్స్, క్రాఫ్ట్, కల్చరల్ సొసైటీ రూపొందించిన క్యాలెండర్‌ను సచివాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. రూ.20కోట్ల వ్యయంతో శిల్పారామాల అభివృద్ధికి చేపట్టిన పనులు వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు.



రామ్ చరణ్

అది నాన్న సినిమా కోసమే

చెర్రీ

" రాజమౌళి నన్ను, తారక్‌ని కూర్చోబెట్టి ఇద్దరికీ ఒకేసారి 'ఆర్ఆర్ఆర్' కథను చెప్పారు. కథ విన్న తరవాత తారక్ బాగానే రియాక్ట్ అయ్యాడు. కానీ, నేను సైలెంట్ అయిపోయా. ఇలాంటి ఆలోచనలు అసలు ఈయనకి ఎలా వస్తాయా? అనిపించింది. ఇక మా ఇద్దరినీ ఒకేసారి స్క్రీన్‌పై ప్రెజెంట్ చేయడమనేది మా ఛాలెంజ్ కాదు. అది రాజమౌళి గారిది. మా కన్నా ఆయనకే ఈ సినిమాలో ఎక్కువ పని. నేనైతే చాలా ఎంజాయ్ చేస్తున్నా" అని రామ్ చరణ్ అన్నారు. 'రంగస్థలం' తర్వాత చెర్రీ చేసిన సినిమా 'వినయ విధేయ రామ'. బోయపాటి శ్రీను దర్శకత్వం. కియరా అద్వాని కథానాయిక. ఈ చిత్రం ఈనెల 11న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా రామ్ చరణ్ మంగళవారం మీడియాతో మాట్లాడారు.

ఇందులో మీ పాత్ర ఏ తరహాలో వుంటుంది?

ఈ సినిమాలో రామ్ పాత్రలో నటించాను. ప్రతి ఇంట్లోనూ ఇలాంటి వాడు ఒకడు ఉండాలి అనుకునే పాత్ర నాది. రాముడిలా వినయంగా ఉంటూ అవసరమైతే విధ్వంసం కూడా సృష్టించే టైప్‌లో ఉంటుంది ఈ పాత్ర.

'రంగస్థలం' తరువాత ఇలాంటి పాత్ర చేయాలని అనుకొన్నారా?

నటుడుగా ఒక దానికే పరిమితం కాకూండా అన్ని జోనర్లలో సినిమాను చేయాలనేదే నా ఉద్దేశం. 1980లో నాన్నగారు కూడా అన్ని జోనర్లలో సినిమాలు చేశారు. జోనర్ కంటే కూడా ఒక సెన్సిబుల్ సినిమా చేయాలనుకున్నాను. అందుకే ఈ సినిమాను అంగీకరించాను.

బోయపాటి సినిమాలంటేనే లార్జర్ దెన్ లైఫ్‌లా ఉంటాయి. యాక్టర్‌గా ఈ పాత్రలోకి మారడానికి కష్టమనిపించిందా?

నాకు ఇంకా సమయం ఉంటే బాగుండేది అనిపించింది. 'రంగస్థలం' షూటింగ్ అయిపోయాక 25వ రోజుల గ్యాప్‌లో ఈ చిత్ర షూటింగ్‌ను మొదలు పెట్టాం. బోయపాటికి ఉన్న కమిట్మెంట్స్ అలాగే నా కమిట్మెంట్స్ వల్ల సినిమాను తొందరగా మొదలు పెట్టాం. అయితే డైరెక్టర్‌కు ఉన్న క్లారిటీ వల్ల నాకు ఈ పాత్ర చేయడం పెద్ద కష్టమేమీ అనిపించలేదు.

ఆర్ఆర్ఆర్‌లో మీ పాత్ర ఎలా ఉంటుంది?

రాజమౌళి మళ్లీ డి గ్లామరైజ్డ్ పాత్రను సృష్టించారు. ఈపాత్ర ప్రేక్షకులకు చాలా బాగా కనెక్ట్ అవుతుంది. ఈ సినిమా కోసం చాలా ఆసక్తిగా ఎదురుచుస్తున్నాను. ఈ సంవత్సరం మొత్తం ఈ సినీమాకే కేటాయించాను.

మీ బ్యానర్‌లో వేరే హీరోలతో కూడా సినిమాలను నిర్మిస్తారా?

అది కేవలం నాన్నగారి సినిమాల కోసం మాత్రమే పెట్టాను. అందులో నేను హీరోగా కూడా సినిమాలు చేయను. నాకు చాలా మంచి నిర్మాతలు ఉన్నారు. ప్రస్తుతానికైతే వేరే హీరోలతో సినిమాలను ప్రొడ్యూస్ చేసే ఆలోచన లేదు.

బాలీవుడ్‌కు వెళ్లే ఆలోచన ఉందా?

లేదు. అప్పుడెప్పుడో ఒకటి చేశాను. ఇప్పుడు సౌత్‌పైనే దృష్టి. 'బాహుబలి', 'రంగస్థలం' తర్వాత చాలా పెద్ద మార్కెట్ ఇక్కడే ఉందనిపించింది. కనుక అటువైపు వెళ్లే ఆలోచనే లేదు.

'సైరా' ప్రోగ్రెస్ ఏమిటి? చిరంజీవి తర్వాత చిత్రాలేమిటి?

మరో రెండు నెలల్లో షూటింగ్ పూర్తి కానుంది. ఆ తరువాత పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను పూర్తి చేసి దసరా సీజన్‌లో విడుదల చేయనున్నాం. అలాగే ఈ చిత్రం తరువాత కొరటాల శివతో నాన్నగారు చేయనున్న చిత్రం ఈ సమ్మర్‌లో మొదలు కానుంది. ఆ చిత్రం తరువాత దానయ్య డివివి నిర్మాణంలో త్రివిక్రమ్ దర్శకత్వంలో నాన్నగారు నటించనున్న 153వ చిత్రం మొదలు అవుతుంది.

ఇది సంక్రాంతి టైటిలా?

నాకు బోయపాటి గారి సినిమా 'జయ జానకి నాయకా' టైటిల్ చాలా ఇష్టం. దానికి దగ్గరగా ఉండాలనే ఈ టైటిల్ ఫిక్సయ్యాం. సంక్రాంతి సీజన్‌కి 'వినయ విధేయ రామ' పర్ఫెక్ట్ టైటిల్.

'రంగస్థలం' తర్వాత గ్యాప్ తీసుకున్నట్లుంది?

'రంగస్థలం' సినిమా తరవాత పెద్దగా బ్రేక్ తీసుకోలేదు. మహా అయితే 2 వీక్స్ టైమ్ తీసుకున్నా. కానీ ఈ మాత్రం టైమ్ సరిపోయింది. క్యారెక్టర్ నుండి స్విచాన్ అవ్వడానికి.

'రంగస్థలం' అంత సక్సెస్ అవుతుందా?

ప్రతి సినిమా 'రంగస్థలం' సినిమా అంత సక్సెస్ అవ్వాలని, అలాంటి ఫీలే జెనరేట్ చేయాలని అనుకుంటే కష్టమైపోతుంది. కథ విన్నప్పుడు ఆడియెన్‌లా వింటా. సబ్జెక్ట్ విన్నప్పుడు నేను ఎంజాయ్ చేయగలగాలి. డైరెక్టర్ ఆ కథ విషయంలో ఎంత కాన్ఫిడెంట్‌గా, క్లారిటీగా ఉన్నాడన్నది చూసుకుంటా అంతే.

సినిమాలో పాత్ర పేరు అసలు పేరుగా పెట్టారే?

రామ్ కొణిదెల అని పేరు వినగానే నాన్నగారు నవ్వుతూ, ఎవరి పర్మిషన్ తీసుకుని ఈ పేరు పెట్టారు అని అడిగారు. ఆ రోజు ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో కూడా నాన్నగారు ఆ డైలాగ్స్ చెప్పడం, సినిమాకి ఇంకా వెయిట్ తీసుకొచ్చింది. నా కన్నా నాన్నగారే ఆ డైలాగ్స్ బాగా చెప్పారు.

మీకు సీక్రెట్ అకౌంట్ ఉందా?

అవును. నాకు కూడా సీక్రెట్‌గా ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ ఉంది. నాక్కూడా సోషల్ మీడియాలో ఏం జరుగుతుంది తెలుసుకోవాలనే క్యూరియాసిటీ ఉంటుంది. అందుకే క్రియేట్ చేసుకున్నా.

అసలు ఈ కథ ఎలాంటిది?

'వినయ విధేయ రామ' నలుగురు అన్నదమ్ముల కథ. ఆ నలుగురు ఎలా కలిశారు? ఎలా ఫ్యామిలీగా ఫామ్ అయ్యారు? అక్కణ్ణించి వాళ్ల జర్నీ.. అదే సినిమా.

స్నేహాలో నటన ఎలా ఉంది?

స్నేహతో నాకు మంచి వర్కింగ్ రిలేషన్ షిప్ ఉంది. ఈ సినిమాతో ఆర్యన్ రాజేష్ కూడా మళ్లీ మన ముందుకు వస్తున్నాడు. ఇక మనందరి ఫేవరేట్ ప్రశాంత్ గారు.. వీళ్ళందరితో పని చేయడం లక్కీ అనుకుంటున్నా. వివేక్ ఒబెరాయ్ పర్ఫామెన్స్ అయితే జస్ట్ సూపర్బ్.

'రంగస్థలం'లో పాత్ర ఎలా పుట్టింది?

జస్ట్ ఏదో ఇద్దరం కూర్చుని భోంచేస్తూ ఫిక్సయిన సినిమా 'రంగస్థలం'. సింపుల్‌గా చేశాం అది అద్భుతమై పోయింది. ఏ సినిమా అయినా అద్భుతం చేద్దామని స్టార్ట్ చేయం, సింపుల్‌గా చేస్తాం. ఎఫర్ట్స్ పెట్టి చేస్తాం. అంతే. తక్కినవన్నీ జరిగిపోతాయి.

బన్నీకి జోడీ!



కియరా అద్వాని

కియరా అద్వాని..ఇప్పుడు తెలుగులో డిమాండ్ ఉన్న కథానాయికల్లో ఒకరు. అగ్రహీరోలు సినిమాలు చేయాలనుకుంటే ఈమెను గానీ, పూజా హెగ్డేను కానీ కథానాయికగా ఎంపిక చేసుకుంటున్నారు. పూజా ఇప్పుడు చాలా బిజీగా ఉంది. అందుకే కియరాను ఎంపిక చేసే పనిలో ఉన్నారు చాలా మంది దర్శక నిర్మాతలు. అల్లు అర్జున్, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందుతోంది. ఈ చిత్రంలో కథానాయిక కోసం దర్శకుడు అన్వేషిస్తున్నారు. అందులో ఇద్దరు హీరోయిన్లలో ఎవరొకరిని ఎంపిక చేయాలని ఆలోచిస్తున్నాడు. అందులో రష్మిక మడన్నా, కియరా అద్వాని ఉన్నారు. వీరిద్దరిలో ఎవరైనా ఈ సినిమా పాత్రకు సరిపోతారట. ప్రస్తుతానికి కియరా 'వినయ విధేయ రామ' ప్రమోషన్‌లో ఉంది. ఈ చిత్రం నెల 11న రాబోతుంది. ఇది కాకుండా బాలీవుడ్‌లో రూపొందుతోన్న 'అర్జున్ రెడ్డి' రీమేక్‌లో నటిస్తోంది. దీంతో పాటు మరో రెండు బాలీవుడ్ చిత్రాల్లో చేసేందుకు ఇదివరకే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ తరుణంలో ఆమె అల్లు అర్జున్ చిత్రంలో నటించేందుకు డేట్స్ అడ్జస్ట్ చేస్తుందా? లేదా? అన్నది చూడాలి. ఈ చిత్రం పూర్తిస్థాయి రొమాంటిక్ కుటుంబ కథా చిత్రంగా రూపొందనుంది. అల్లు అరవింద్, ఎస్. రాధాకృష్ణ సంయుక్తంగా నిర్మించనున్నారు.

యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్ టీమ్ ఇదే



మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు మీడియా సలహాదారుడిగా పని చేసిన సంజయ్ బారు రాసిన 'ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్' పుస్తకంగా ఆధారంగా అదే టైటిల్‌తో ఓ సినిమా రూపొందుతోంది. మన్మోహన్ రాజకీయ జీవితంపై ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇటీవల ఈ చిత్రం ఫస్ట్‌లుక్, ట్రైలర్‌ను విడుదల చేశారు. తాజాగా ఈ సినిమాలో నటించి 15మంది ముఖ్య పాత్రలను పరిచయం చేస్తూ మంగళవారం గ్రూప్ ఫొటోను అనుపమ్ ఖేర్ తన ట్విట్టర్ ఖాతాలో పోస్టు చేశారు. ఈనెల 11న విడుదల కానున్న ఈ చిత్రంలో మన్మోహన్‌గా అనుపమ్ ఖేర్ చేశారు. సంజయ్ బారుగా అక్షయ్ ఖన్నా, సోనియాగా జర్మన్ నటి సుజన్నే బెర్నాట్ చేశారు. ఈమె ఇప్పటికే ఇండియన్ టెలివిజన్, సినిమాల్లో నటించారు. ఆనంద్ కుమార్ ప్రియాంక గాంధీగా కనిపించబోతున్నారు. 'నెటిఫ్లిక్స్ మూవీ బ్రిజీ మోహన్ అమర్ రహే'లో చేసిన అర్జున్ ముతార్ రాహుల్ గాంధీగా నటించారు. మన్మోహన్ భార్య గుర్షరన్ కౌర్‌గా దివ్య సేత్ కనిపించబోతున్నారు. సన్ని ఎల్‌కే అద్వానిగా, విమల్ వర్మ లాలూ ప్రసాద్ యాదవ్‌గా, అనిల్ రస్తోగి శివరాజ్ పాటిల్‌గా, పీవీ నరసింహారావుగా అజిత్ సత్, రామ్ అవతార్ అటల్‌బిహారీ వాజ్‌పాయిగా నటించారు.

కేసు నమోదు చేయాలని బీహార్ కోర్టు ఆదేశం

' ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్' చిత్రంలో నటించిన అనుపమ్ ఖేర్, అక్షయ్ ఖన్నా తదితరులు మొత్తం 15మందిపై కేసు నమోదు చేయాలని బీహార్‌లోని ముజాఫర్‌పూర్ కోర్టు ఆదేశించింది. మన్మోహన్, ఆయన మీడియా సలహాదారు సంజయ్ బారు పాత్రలను తప్పుగా చిత్రీకరించారని ఈనెల రెండో తేదీన న్యాయవాది సుధీర్ కుమార్ ఓజా ఫిర్యాదు ఆధారంగా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ముజాఫర్‌పూర్ సబ్ డివిజనల్ జడ్జి(తూర్పు) గౌరబ్ కమల్ ...కాంతి పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. ఐపీసీ 295, 153, 153ఎ, 293, 504, 120బి సెక్షన్లపై కేసు నమోదు చేయాలని ఓజా తన ఫిర్యాదులో కోరారు. ఇంతకు ముందు గూగుల్, యూట్యూబ్‌లో ఈ చిత్రం ట్రైలర్‌ను తొలగించాలని కాంగ్రెస్ ఢిల్లీ కోర్టును ఆశ్రయించింది. కానీ కోర్టు ఆ పిటిషన్‌ను కొట్టేసింది.


రాకేశ్ రోషన్‌కు కేన్సర్



రాకేశ్ రోషన్, హృతిక్ రోషన్

నటుడు, నిర్మాత, దర్శకుడు, హృతిక్ రోషన్ తండ్రి రాకేశ్ రోషన్ గొంతు కేన్సర్‌తో బాధపడుతున్నారు. ఈ విషయాన్ని హృతిక్ తన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా వెల్లడించారు. 'ఈరోజు ఉదయం ఫొటో దిగాలనుందని నాన్నను అడిగాను. సర్జరీ రోజు కూడా ఆయన జిమ్‌కు రావడం మానరని తెలుసు. నాకు తెలిసినంత వరకు ఆయన చాలా దృఢమైన వ్యక్తి. కొన్ని వారాలుగా గొంతు కేన్సర్‌తో బాధపడుతున్నారు. కానీ ఆయన క్యాన్సర్‌తో పోరాడుతూనే సంతోషంగా జీవిస్తున్నారు. కుటుంబంలో ఆయనలాంటి లీడర్ ఉన్నందుకు మేమెంతో అదృష్టవంతులం. 'లవ్యూ డాడ్' అని ఆ పోస్టులో పేర్కొంటూ జిమ్‌లో రాకేశ్‌తో దిగిన ఫొటోను షేర్ చేశారు హృతిక్. రాకేశ్ త్వరగా కోలుకోవాలని, ఈ సవాలును ధైర్యంగా ఎదుర్కోగలరని తాను నమ్ముతున్నట్టు ప్రధాని నరేంద్ర మోడీ ఈ సందర్భంగా ట్వీట్ చేశారు. కొన్ని నెలల క్రితం సోనాలి బింద్రే తనకు మెటాస్టేటిక్ కేన్సర్ ఉందని వెల్లడిస్తూ అభిమానులను షాక్‌కు గురిచేశారు. మరోపక్క బాలీవుడ్ నటుడు రిషి కపూర్ అనారోగ్య సమస్యతో అమెరికాలో చికిత్స పొందుతున్నారు. ఆయన కూడా క్యాన్సర్‌తో బాధపడుతున్నారని కొంతకాలంగా వార్తలు వెలువడుతున్నాయి.

అలోక్ నాథ్‌కు బెయిల్



మీటూ ఉద్యమం నేపథ్యంలో తనను రేప్ చేశాడని ఆరోపణలు ఎదుర్కొంటున్న అలోక్‌నాథ్‌కు ముందుస్తు బెయిల్ లభించింది. తనపై అలోక్ నాథ్ అత్యాచారానికి పాల్పడ్డారని రచయిత, దర్శకురాలు వింతా నందా ఆరోపించింది. ఈ నేపథ్యంలో నమోదైన కేసుపై ఆయన ఒక్క మాట కూడా ఆడలేదు. తమ లాయర్లు సలహా మేరకు ఇప్పటి వరకూ మౌనంగా ఉన్నారు. బెయిల్ మంజూరైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ " పూర్తి మౌనంగా ఉండమని కోర్టు, మా లాయర్లు నాకు సలహా ఇచ్చారు. అందుకే ఏం మాట్లాడలేదు. ఆ సమయంలో ఎటువంటి కామెంట్స్ చేయొద్దన్నారు. ఇప్పుడు మాట్లాడే స్థాయికి వచ్చాను. నా ధైర్యానికి నా భార్య మూలస్తంభం. నా ఈ ప్రయాణంలో ఆమె నా సహకారి. ఆమె నా నిజం" అన్నారు.



ఆలియా భట్, దీపికా పదుకొనె

భన్సాలీ చిత్రంలో నాయిక ఎవరు?

బాలీవుడ్‌లో ఇప్పుడు ఏవైనా ముఖ్యమైన పాత్రలు చేయాల్సి వస్తే ఇద్దరే ఇద్దరి మధ్య పోటీ నెలకొంటుంది. వాళ్లే దీపికా పదుకొనే, ఆలియా భట్. గతంలో ప్రియాంక చోప్రా, దీపికా పదుకొనే మధ్య తీవ్ర పోటీ ఉండేది. ప్రియాంకకు వివాహం జరిగిన తర్వాత ఆ రేసులోకి ఆలియా భట్ వచ్చింది. సంజయ్ లీలా భన్సాలీ 'పద్మావత్' తర్వాత కొత్త చిత్రం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాడు. ఇప్పటి వరకూ ఆయన దర్శకత్వంలో వచ్చిన రామ్ లీలా, బాజీరావు మస్తాని, పద్మావత్‌లో దీపికానే లీడ్ రోల్ చేస్తూ వచ్చింది. ఇప్పుడు ఈమెకు బదులు ఆలియా భట్‌ను ఎంపిక చేసే ఆలోచనలో ఉన్నట్టు బాలీవుడ్‌లో ప్రచారం జరుగుతోంది. కానీ ఎవరిని ఎంపిక చేశారన్న దానిపై మాత్రం భన్సాలీ స్పష్టతనివ్వలేదు. ఇంకా ఇప్పటి వరకూ ఎవరినీ ఎంపిక చేయలేదు కానీ ఆలియాను ఎంపిక చేయాలని భన్సాలీ ఆసక్తి చూపుతున్నట్టు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. దీపికా మాత్రం ఎప్పటికీ భన్సాలీ ఫేవరెట్ నటే. రణవీర్ సింగ్, దీపికా పదుకొనేలతో చేసిన మూడు భారీ విజయాలు తర్వాత కొత్తవారితో చేయాలని ఆలోచిస్తున్నట్టు పేర్కొంటున్నారు. చివరకు ఎవరిని ఎంపిక చేస్తారో చూడాలి.

సంక్రాంతికి పర్‌ఫెక్ట్ మూవీ

వెంకటేశ్



తమన్నా, వెంకటేశ్, మెహరీన్, వరుణ్ తేజ్

"దిల్‌రాజు బ్యానర్‌లో ఎప్పటి నుంచో పనిచేయాలని ఎదురుచూశాను. మధ్య కొన్ని అవకాశాలు వచ్చినా కుదరలేదు. ఈ సినిమాకు కుదిరింది. వెంకీగారు చాలా సంవత్సరాలుగా నన్ను ఇన్‌స్పైర్ చేస్తూ వస్తూనే ఉన్నారు. ఆయనింకా ఫ్రెష్‌గా, ముద్దుగా ఎలా కనపడతన్నారనేది నాకింకా తెలియలేదు" అని నటి తమన్నా అన్నారు. వెంకటేశ్, తమన్నా, వరుణ్‌తేజ్, మెహరీన్ ముఖ్యతారాగణంగా నటించిన చిత్రం 'ఎఫ్ 2'. ఈ చిత్రం ప్రీరిలీజ్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. 'కామెడీ సినిమాల్లో రియల్ లైఫ్ సిచ్యువేషన్స్ ఆధారంగా కామెడీ ఉంటుంది. దర్శకుడు అనిల్ రావిపూడి స్క్రిప్ట్ చెప్పినప్పుడు చేసేయాలనిపించింది. అందరం కలిసి ఓ టీంలా కలిసి పనిచేశాం. సినిమాలో దాదాపు 22 మంది నటించారు. ఈ సినిమాలో ఎక్కువ క్రెడిట్ అనిల్‌కే చెందుతుంది. వరుణ్‌కి నేను పెద్ద ఫ్యాన్‌ని. హనీ క్యారెక్టర్‌లో మెహరీన్‌ను తప్ప మరొకరిని ఊహించుకోలేను. తను పాత్రలో అంత బాగా ఒదిగిపోయింది" అని తమన్నా తెలిపారు.

అనిల్ రావిపూడి మాట్లాడుతూ 'ట్రైలర్‌లో రెండు నిమిషాల నవ్వులే కాకుండా రెండున్నర గంటల నవ్వులను సంక్రాంతికి ఎంజాయ్ చేస్తారనీ అది కూడా మీ కూడా సభ్యులతో కలిసి.. అని గ్యారంటీగా చెప్పగలను. సినిమాకు వెంకీ, తమన్నా. వరుణ్ , మెహరీన్ నాలుగు పిల్లర్స్. ఈ నలుగురు మధ్య ఉండే ఫన్, ఫ్రస్టేషన్‌ను సినిమాలో ఎంజాయ్ చేస్తార'ని అన్నారు.

వెంకటేష్ మాట్లాడుతూ "ఇంట్లో ఇల్లాలు వంటింట్లో ప్రియురాలు', మల్లీశ్వరి, నువ్వు నాకు నచ్చావ్' తర్వాత పూర్తిస్థాయి కామెడీ మూవీ చేయలేదు. చాలా గ్యాప్ తర్వాత అలాంటి మూవీ చేశాను. దిల్‌రాజు, అనీల్, నేను కామెడీతో మెప్పిస్తానని నమ్మకంతో నా వద్దకు రావడంతో 'ఎఫ్ 2' సినిమా చేశాను. వరుణ్ చక్కగా చేశాడు. తమన్నా, మెహరీన్ సహా అందరితో నటించడం హ్యాపీగా ఉంది. క్యారెక్టర్స్ అన్నీ చక్కగా డిజైన్ చేశారు. తప్పకుండా సినిమాను ఎంజాయ్ చేస్తారు. సంక్రాంతికి పర్‌ఫెక్ట్ ఫ్యామిలీ ఫన్ మూవీ' అని పేర్కొన్నారు.

వరుణ్ తేజ్ మాట్లాడుతూ 'డిఫరెంట్ జోనర్‌లో సినిమాలు చేస్తూ వచ్చాను. ఆ క్రమంలో కామెడీ సినిమాలు కూడా చేయాలనుకున్నాను. నా కెరీర్‌లో ఎంత కామెడీ చేయాలనుకున్నానో దాన్ని అంతా అనిల్ ఒక సినిమాలో చేయించేశాడు. ఇలాంటి పాత్ర, మంచి సినిమా చేయడం ఆనందంగా ఉంది. వెంకీ కామెడీ అంటే ఇరగదీస్తారు. ఆయనతో చేయడమంటే కాస్త టెన్షన్ పడ్డాను. అయితే ఆయన కంఫర్ట్ ఇచ్చి సినిమాను చేయించారు. ఆయనతో వర్క్ చేయడం అదృష్టంగా భావిస్తున్నాను' అని తెలిపారు.

మెహరీన్ మాట్లాడుతూ 'నాలో బెస్ట్ నటనను రాబట్టుకున్నారు. చాలా హార్డ్ వర్క్ చేశాను. వెంకీ, వరుణ్, తమన్నాతో స్క్రీన్ షేర్ చేసుకోవడం ఆనందంగా ఉంది. కల నిజమైనట్లుగా ఉంది. తెలుగులో తొలిసారి డబ్బింగ్ చెప్పాను. ఇందులో ఫన్ మాత్రమే ఉంటుంది. ఫ్రస్టేషన్ ఉండదు' అని చెప్పారు.

సైటెక్
Science & Technology




క్లిక్ చేస్తే డేటా గోవిందా

- వాట్సాప్ గోల్డ్ మళ్ళీ వైరల్
- యాంటీ వైరస్ యాప్‌ను వాడాలని నిపుణుల సూచన

ప్రపంచ వ్యాప్తంగా అత్యంత ఆదరణ పొందిన సోషల్ మీడియా నెట్‌వర్క్‌లలో వాట్సాప్ ఇన్‌స్టెంట్ మెసెంజర్ ఒకటి. అసలైన దీనిని అలుసుగా చేసుకొని, సైబర్ నేరగాళ్ళు మాల్‌వేర్ వైరస్ యాప్‌ని వాట్సాప్‌గోల్డ్ పేరుతో షేర్ చేసి సైబర్ దాడులకు పాల్పడుతున్నారు. అయితే... 'వాట్సాప్ గోల్డ్' పేరుతో 2016లో ఫేక్ మెసేజ్‌లు వైరలైన సంగతి అందరికీ తెలిసిందే. ఆ యాప్ మళ్ళీ వైరలవుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. నిపుణులు తెలిపిన వివరాలు ప్రకారం- ఈ వైరస్ లింక్ క్లిక్ చేస్తే చాలు... డేటా మొత్తం చోరీ అవుతుందని చెబుతున్నారు. 'డబ్బున్న వాళ్ళ కోసం ప్రత్యేకంగా రూపొందించబడిందని, వచ్చిన మెసేజ్ లింక్‌పై క్లిక్ చేయండీ, ఉచితంగా సేవలు పొందండీ, యాప్ ఇన్‌స్టాల్ చేస్తే మీ యాప్ గోల్డ్ కలర్‌లోకి మారిపోతుందని మెసేజ్ సారాంశమనీ, అలా సేవలు కోసం ఆశించిన వినియోగదారులు ఆ యాప్ వలలో చిక్కుకున్న కొంత సమయం తర్వాత తమ డేటా హ్యాక్ అయిందని గ్రహించి, లబోదిబోమంటున్నారనీ, దీనిపట్ల జాగ్రత్తగా ఉండాలనీ' సైబర్ హ్యాకింగ్ కంట్రోలింగ్ ఎక్స్‌పర్ట్ ఈమని హరికృష్ణ హెచ్చరిస్తునారు. వాస్తవానికి ఇది యాప్ కాదు, అదొక మాల్‌వేర్ అనీ, అత్యంత ప్రభావవంతమైన వైరస్ అని తెలిపారు. దీనిపట్ల అప్రమత్తంగా ఉండాలని, లేదంటే భారీ నష్టం తప్పదని అంటున్నారు నిపుణులు. ఇలాంటి మెసేజ్ వచ్చినప్పుడు వాటిని క్లిక్ చేయకుండా డిలీట్ చేయాలని సూచిస్తున్నారు. ఒక్కసారి ఈ వైరస్ ఫోన్‌లో గనుక చేరితే, ఫోన్‌లో నిక్షిప్తమైన వ్యక్తిగత వివరాలు, కాంటాక్ట్స్, ఇన్‌బాక్స్, ఈమెయిల్, బ్యాంక్ అకౌంట్, క్రెడిట్ కార్డు ఇలా ఫోన్‌లో ఉన్న డేటా అంతా సైబర్ నేరగాళ్ళకు చేరిపోతుంది. ఇప్పటికే తమ వాట్సప్ గోల్డ్ కలర్‌లోకి మారిందని, చాలామంది సంబరపడుతున్నారు. అది భయంకరమైన వైరస్ అని, అది ఇన్‌స్టాల్ చేసుకుని అడ్డంగా బుక్కై పోయామన్న సంగతి గ్రహించుకునేలోపే జరగరాని నష్టం జరిగిపోతుంది. అందుకే మీకు 'వాట్సప్ గోల్డ్' లింక్ మెసేజ్ మీ మొబైల్‌కి వస్తే క్లిక్ చేయకుండా డిలీట్ చేయాలి. ఇక్కడ గమనించాల్సింది ఏంటంటే- వాట్సాప్ నుంచి వచ్చే ఏ అప్‌డేట్ అయినా నేరుగా ప్లేస్టోర్ నుంచే వస్తుంది తప్ప, ఇలాంటి లింక్స్ రూపంలో రావనే విషయాన్ని గమనంలో ఉంచుకోవాలి. మీ ఫోన్‌లో యాంటీ వైరస్ యాప్ ఉపయోగించడం మంచిది. ఈ విషయాన్ని షేర్ చేస్తూ... అందరినీ హెచ్చరించాల్సిన అవసరమూ ఉంది. స్మార్ట్ యుగంలో స్మార్ట్‌గా ఆలోచించి, మంచి నిర్ణయం తీసుకోండని నిపుణులు సలహా ఇస్తున్నారు.

- విక్రమ్

భౌతికశాస్త్ర పితామహుడు



సర్ ఐజాక్ న్యూటన్
(జనవరి 4, 1643 - మార్చి 31, 1727).

భౌతిక, గణిత, ఖగోళ శాస్త్రవేత్త... సిద్ధాంత కర్త, తత్వవేత్త... ఈ ప్రపంచంలోనే గొప్ప శాస్త్రజ్ఞుడిగా పేరెన్నికగన్న సుప్రసిద్ధుడు సర్ ఐజాక్ న్యూటన్ (జనవరి 4, 1643 - మార్చి 31, 1727). జనవరి 4వ తేదీ.. ఆయన పుట్టినరోజు. లింకన్ షైర్ కౌంటీకి చెందిన ఒక చిన్న కుగ్రామంలో జన్మించాడు. నెలలు నిండకుండానే జన్మించడం వల్ల చాలా చిన్నగా, పీలగా ఉండే ఆ చిన్నారే పెరిగి, పెద్దయి ప్రపంచంలోనే మేటి శాస్త్రవేత్తల్లో ఒకరిగా పేరు తెచ్చుకున్నారు. 85 సంవత్సరాలు జీవించిన ఆయన ప్రకృతిసిద్ధమైన తత్వశాస్త్రం, అది సైన్సుగా ఎలా పరిణామం చెందింది? అన్న అంశంపై ఆయన ఎనలేని కృషి చేశారు. అందువల్లనే ఆధునిక ప్రపంచం న్యూటన్ మహాశయుడిని 'సైన్సు పితామహుడి'గా గౌరవిస్తోంది. 1687లో ప్రచురితమైన ఆయన శాస్త్ర గ్రంథం 'ప్రిన్సిపియా మేథమేటికా'- సైన్సు చరిత్రలో అత్యంత ముఖ్యమైన రచన. ఈ గ్రంథంలో గురుత్వాకర్షణ శక్తి గురించి, తాను ప్రతిపాదించిన మూడు గమన నియమాల గురించి న్యూటన్ ప్రస్తావించాడు. తరువాతి మూడు శతాబ్దాల పాటు భౌతిక ప్రపంచానికి సైన్సు దృక్కోణంగా వెలుగొందిన యాంత్రిక శాస్త్రానికి తరువాత ఆధునిక ఇంజనీరింగ్‌కూ ఈ గ్రంథమే పునాది. ఏదైనా ఒక వస్తువు యొక్క గమనం, భూమి మీదైనా లేక ఇతర గ్రహాల మీదైనా ఒకే రకమైన నియమాల మీద ఆధారపడి ఉంటుందని నిరూపించాడు. దీనికి ఆధారంగా కెప్లర్ నియమాలకూ, గురుత్వాకర్షణ సిద్ధాంతాలకూ గల సామీప్యతను దృష్టాంతంగా చూపాడు. భూమి, చంద్రుడు, గ్రహాలు, సూర్యుడు సహా విశ్వంలోని వస్తువులపై గురుత్వ శక్తి ఎలా పని చేస్తుందో వివరిస్తూ విశ్వ గురుత్వ నియమాన్ని ప్రతిపాదిస్తూ, గమన సూత్రాలను నిర్వచించాడు. దీంతో సూర్య కేంద్రక సిద్ధాంతంపై పూర్తిగా అనుమానం తొలగిపోవడమే కాకుండా ఆధునిక సైన్సు అభివృద్ధి కొత్త పుంతలు తొక్కడానికి దోహదపడింది. నేడు అంతరిక్షంలోకి రాకెట్లలో రివ్వున దూసుకెళ్తున్నాయంటే, అందుకే న్యూటన్ ప్రతిపాదించిన సిద్ధాంతాలే కారణం. న్యూటన్‌కు 1672లో రాయల్ సొసైటీ ఫెలోషిప్ లభించింది. అప్పటివరకూ ప్రకృతి శాస్త్రంలో ఒక భాగంగా ఉన్న భౌతిక శాస్త్రాన్ని న్యూటన్ ఆవిష్కరణలు, సిద్ధాంతాలవల్ల ప్రత్యేక శాస్త్రంగా గుర్తించారు. అందుకే న్యూటన్‌ను భౌతికశాస్త్ర పితామహుడు అంటారు. 1705లో బ్రిటిష్ ప్రభుత్వం 'సర్' అని బిరుదునిచ్చి సత్కరించింది.

- ఉదయమిత్ర

మెసెంజర్‌లో మరో కొత్త ఫీచర్ 'డార్క్ మోడ్'

సోషల్ మీడియాలో దూసుకుపోతున్న ప్రముఖ ఇన్‌స్టంట్ మెసేజింగ్ యాప్ ఫేస్‌బుక్ ఎప్పటికప్పుడు సరికొత్త ఫీచర్లను ప్రవేశపెడుతూ వినియోగదారులను అలరిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కంపెనీ ఈ ఏడాది మరో కొత్త ఫీచర్‌ని అందుబాటులోకి తీసుకురానుంది. సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్న ప్రచారం మేరకు ఫేస్‌బుక్ మెసెంజర్‌లో త్వరలో 'డార్క్‌మోడ్' పేరుతో ఓ కొత్త ఫీచర్ రానుంది. అయితే ఎంపిక చేసిన దేశాల వినియోగదార్లకు మాత్రమే ఈ ఫీచర్ మొదట అందుబాటులోకి వస్తుంది.

కాగా, గతేడాది అక్టోబర్‌లోనే ఈ ఫీచర్ గురించి ప్రకటన చేసిన ఫేస్‌బుక్... ఇప్పటి వరకు ఆ విషయంపై ఎలాంటి అప్‌డేట్ ఇవ్వలేదు. ప్రస్తుతం ఈ ఫీచర్‌ను అంతర్గతంగా



పరీక్షిస్తున్నట్లు సమాచారం. ఈ టెస్టింగ్ పూర్తయిన తర్వాత ఈ ఫీచర్‌ను పూర్తి స్థాయిలో అప్‌డేట్ ఇస్తారు. ఈ 'డార్క్‌మోడ్' ఫీచర్ వల్ల రాత్రి పూట, కాంతి అంతగా లేని ప్రదేశాల్లో స్మార్ట్‌ఫోన్ స్క్రీన్లను మరింత సౌకర్యవంతంగా చూడవచ్చు. దీనివల్ల తక్కువ కాంతి వెలువడుతుంది. కళ్లు సురక్షితంగా ఉంటాయి. వినియోగదార్లకు ఎప్పుడు అందుబాటులోకి వస్తుందన్న దానిపై ఇప్పటివరకూ స్పష్టమైన తేదీని ప్రకటించలేదు. ఇదిలావుండగా, ఆండ్రాయిడ్, ఐఓఎస్ స్మార్ట్‌ఫోన్లలో వాట్సప్ త్వరలోనే డార్క్‌మోడ్ ఫీచర్‌ను తీసుకురానుంది. ఇప్పటికే ట్విట్టర్, యూట్యూబ్ లాంటి అనేక యాప్స్‌లో డార్క్‌మోడ్ ఫీచర్ ఉంది. వాట్సప్ కూడా కొద్ది నెలలుగా డార్క్‌మోడ్‌పై ప్రయోగాలు చేస్తోంది. ఈ డార్క్‌మోడ్ ఫీచర్ వల్ల చీకటిలో కళ్లను కాపాడుకోవడంతో పాటు బ్యాటరీ కూడా ఆదా చేసుకోవచ్చు. ★

గాలితో నడిచే కారు



రోజురోజుకీ వాహనాల ఇంధన ధరలు, వాటితో పాటుగా వాహన కాలుష్యం ఎంతగా పెరిగిపోతున్నాయో అందరికీ తెలిసిందే. రోజు రోజుకీ ఇంధన ధరలు ఆకాశాన్ని అంటుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో ప్రత్యామ్నాయ ఇంధనాలపై శాస్త్రవేత్తలు దృష్టి సారిస్తున్నారు. అందులో భాగంగా ఎప్పటికప్పుడు కొత్తకొత్త ప్రయోగాలు చేస్తూనే ఉన్నారు. గాలితో నడిచే కారును రూపొందించి, ఓ అద్భుత ప్రయోగాన్ని ఆవిష్కరించారు కొందరు విద్యార్థులు. ఈ కారు నడవాలంటే ఎలాంటి ఇంధనంగానీ, ఛార్జింగ్ చేయడం గానీ అవసరం లేదు. కేవలం గాలి ఉంటే చాలు. ఈజిప్ట్‌లోని హెల్వన్ విశ్వ విద్యాలయానికి చెందిన ఓ విద్యార్థి బృందం తమ గ్రాడ్యుయేషన్ ప్రాజెక్టులో భాగంగా ఈ కారును రూపొందించారు. ఈ కారు తయారీకి 18 వేల ఈజిప్ట్ పౌండ్లు (సుమారుగా 1008 డాలర్లు) ఖర్చుతో రూపొందిన ఈ కారు- గో కార్టింగ్ రేసులో ఉపయోగించే కారును పోలి ఉంటుంది. ప్రోటోటైప్ వెర్షన్ కనుక ఈ కారులో ఒక్కరు మాత్రమే ప్రయాణించగలరు. గాలితోనే నడుస్తుంది గనుక కాలుష్యం వెలువడుతుందన్న భయం లేదు. గాలిని కంప్రెస్ చేసి, ఇంధనంగా మార్చి ఈ కారులో ఉపయోగిస్తారు. కంప్రెస్డ్ ఆక్సిజన్ అనే ఇంధనం సహాయంతో నడిచే ఈ కారు గరిష్ట వేగం గంటకు 40 కిలోమీటర్లు. ఒకసారి ఇంధనం నింపాక కారు 30 కిలోమీటర్ల వరకూ ప్రయాణిస్తుంది. త్వరలోనే గంటకు 100 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా మరింత అధునాతనంగా తీర్చిదిద్దుతామని పరిశోధక విద్యార్థులు చెబుతున్నారు. భవిష్యత్తులో ఇంకెన్ని అద్భుతాలు చేస్తారో వేచి చూద్దాం! ★



భారీ కెమెరాతో తొలి స్మార్ట్‌ఫోన్

చైనాకు చెందిన ప్రముఖ స్మార్ట్‌ఫోన్ సంస్థ హువావే సబ్ బ్రాండ్ హానర్ భారీ కెమెరాతో స్మార్ట్‌ఫోన్‌ను ఆవిష్కరించనుంది. ప్రపంచంలోనే భారీ స్క్రీన్లు, భారీ కెమెరా, భారీ ర్యామ్, స్టోరేజ్‌తో వస్తోన్న తొలి స్మార్ట్‌ఫోన్ ఇది. 48 ఎంపీ సోనీ ఐఎంఎక్స్ 589



సెన్సర్‌తో 'హానర్ వ్యూ 20', 'హానర్ వి 20' పేరుతో ఈ నెల 29న భారత మార్కెట్లో విడుదల కానుంది. ఈ స్మార్ట్‌ఫోన్‌ను చైనా మార్కెట్లో గత నెలలోనే ఆవిష్కరించారు. ఇక ఫీచర్ల విషయానికొస్తే... 6.4 అంగుళాల ఎల్‌సీడీ డిస్‌ప్లే, 2130×1080 రిజల్యూషన్, హై సిలికాన్ కిరిన్ 980 ప్రాసెసర్, ఆండ్రాయిడ్ పై9, 6జీబీ/ 8జీబీ ర్యామ్, 128జీబీ/ 256 స్టోరేజ్, 48ఎంపీ రియర్‌కెమెరా, 25 ఎంపీ సెల్ఫీ కెమెరా, 4000 ఎంఏహెచ్ బ్యాటరీతో లభ్యం కానుంది. దీని ధర సుమారుగా రూ.30 వేలు, హైఎండ్ వేరియంట్ ధర సుమారు రూ.35 వేలు. ★

చిన్నారి



జోక్:

తండ్రి : కిట్టూ నీకు స్కూల్లో ఎవరంటే బాగా ఇష్టం?

కిట్టు : ఇంటి బెల్ కొట్టే వాచ్‌మెన్ అంకుల్ అంటే చాలా ఇష్టం నాన్నా!

పొడుపు కథ

పగలంతా నిద్ర
పోతాను, రాత్రయితే
మేలుకొని
ఉంటాను
ఎవరిని నేను?




జవాబు : దీపం

నీడ కనిపెట్టండి!



పిల్లలూ! ఇక్కడున్న చిత్రంలో.. కొన్ని జంతువులు ఉన్నాయి. పక్కనున్న బాక్సులో ఒక జంతువు నీడ ఉంది. అది ఏ జంతువు నీడో కనిపెట్టండి?!

చిచ్చరపిడుగులు



'చిచ్చరపిడుగులు' ఎంతో మంచి నవల. దీన్ని రాసినది మార్క్ ట్వేన్ (1835 - 1910). ఈయన ఈ నవలను 1885లో ఆంగ్ల భాషలో విడుదల చేశారు. అంటే ఈ నవలలోని కథ 175 ఏళ్ళ నాటి ముందుది అన్నమాట. కానీ తెలుగులో అనువదించింది ఎంవివి సత్యనారాయణ గారు. వాటికి బొమ్మలు వేసింది కేంబ్లి. ఈ నవల ఒక ఆత్మకథ. హాకల్బెరీ ఫిన్ మనకు తన జీవితంలో ఏం జరిగిందో ఈ నవలలో చెబుతాడు. కానీ కొన్ని రోజుల తరువాత వాళ్లు దోచుకున్న సొమ్మంతా ప్రజలకు ఇచ్చేస్తాడు. అపుడే తన హత్య జరిగినట్లు నమ్మించి, ఒక చిన్న పడవలో పారిపోతాడు. ఎన్నో నెలలు ఆ పడవలోని ప్రయాణిస్తాడు.. మధ్యలో ఎంతోమంది పరిచయమవుతారు. ఒకసారి ఒక పోలీసుకి వారిని పట్టిస్తాడు. కానీ వాళ్ళు తప్పించుకుంటారు. వాళ్లు ఎలా తప్పించుకుంటారో? అసలు ఎందుకు తాను హత్యకు గురైనట్లు చేస్తాడో? తెలియాలంటే చిచ్చర పిడుగులు నవల చదివి తెలుసుకోవాల్సిందే.




సి.చక్రవర్ధన్ రెడ్డి
8వ తరగతి,
అరవింద హైస్కూల్,
కుంచనపల్లి.

రంగులు దిద్దండి!



పిల్లలూ! ఇక్కడ మీకు ఎంతో ఇష్టమైన బొమ్మ ఉంది కదా.. ! దానికి చక్కటి రంగులు వేయండి!

నేను గీసిన బొమ్మ





పి. బాలాజీ,
8వ తరగతి,
జెడ్‌పి హైస్కూల్,
పెనుమాక,
తాడేపల్లి మండలం,
గుంటూరు జిల్లా

పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపాల్సిన మా చిరునామా :

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ -Chinnaarips@gmail.com

క్రికెటర్లపై కాసుల వర్షం

ముంబయి : ఆస్ట్రేలియా గడ్డపై ఏడు దశాబ్దాల తర్వాత టెస్ట్ సిరీస్ విజయం సాధించిన టీమిండియాకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బిసిసిఐ) నజరానా ప్రకటించింది. తుదిజట్టులో ఉన్న ఆటగాళ్లకి ఒక్కొక్కరికి ఒక టెస్ట్‌కు రూ.15 లక్షలు చొప్పున నాలుగు టెస్టులు ఆడిన ఆటగాడికి రూ. 60 లక్షలు, రిజర్వ్ బెంచ్‌లో ఉన్న ఆటగాళ్లకు రూ.30 లక్షలు చొప్పున ఇవ్వనుంది. ఆటగాళ్లకే కాకుండా కోచ్‌లకు సైతం రూ.25 లక్షల చొప్పున నగదు ప్రోత్సాహకాన్ని ప్రకటించింది. సపోర్టింగ్ స్టాఫ్‌కు వేతనంతో సమానమైన నజరానా అందజేయనున్నట్లు స్పష్టం చేసింది. ఇక ఆటగాళ్లు అందుకోబోయే నగదు బహుమానం మ్యాచ్ ఫీజుకి సమానం కావడం గమనార్హం. బోర్డర్-గవాస్కర్ సిరీస్‌లో భాగంగా కోహ్లీసేన 2-1 తేడాతో సిరీస్ కైవసం చేసుకుని 72 ఏళ్ల కలను నెరవేర్చిన విషయం తెలిసిందే.

17వ స్థానంలో పంత్

ఆస్ట్రేలియాపై చివరిటెస్ట్‌లో భారత వికెట్ కీపర్ రిషభ్ పంత్ అజేయంగా 159 పరుగులతో నిలిచి ధోనీని వెనక్కి నెట్టిన సంగతి తెలిసిందే. తాజాగా అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) టెస్టు ర్యాంకింగ్స్‌లో సైతం అరుదైన ఘనతను అందుకు న్నాడు. ఒక్కసారిగా 21 స్థానాలు ఎగబాకి 17 స్థానంలో నిలిచాడు. రిషభ్ పంత్ 673 రేటింగ్ పాయింట్లతో తన స్థానాన్ని మరింత మెరుగుపరుచుకున్నాడు. ఫలితంగా భారత్ తరపున బెస్ట్ ర్యాంక్ సాధించిన స్పెషలిస్టు వికెట్ కీపర్ల జాబితాలో ఫరూఖ్ ఇంజనీర్ సరసన నిలిచాడు. 1973, జనవరిలో ఫరూఖ్ ఇంజనీర్ 17 ర్యాంకును సాధించగా, ఇప్పుడు అతని సరసన పంత్ చేరాడు. కాగా, ఈ క్రమంలోనే ఎంఎస్ ధోని అత్యుత్తమ టెస్టు ర్యాంకును పంత్ బ్రేక్ చేశాడు. ధోనీ టెస్టు కెరీర్‌లో 19వ ర్యాంకే అత్యుత్తమ ర్యాంక్ కాగా, ధోని టెస్టు కెరీర్‌లో అత్యుత్తమ రేటింగ్ పాయింట్లు 662గా ఉంది. ఇక టెస్టు నంబర్‌వన్ ర్యాంకింగ్‌ను విరాట్ కోహ్లీ నిలబెట్టుకున్నాడు.



బూమ్రాకు విశ్రాంతి సిరాజ్‌కు పిలుపు

చారిత్రాత్మక టెస్ట్ సిరీస్ గెలుపులో కీలక పాత్ర పాత్ర పోషించిన టీమిండియా పేస్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రాకు విశ్రాంతి ఇస్తున్నట్లు మంగళవారం బిసిసిఐ ఒక ప్రకటనలో తెలిపింది. అతని స్థానంలో హైదరాబాద్ పేసర్ మహ్మద్ సిరాజ్‌ను ఆసీస్‌తో వన్డేలకు చోటు దక్కించుకున్నాడు. ఆసీస్ వన్డే సిరీస్‌లో భాగంగా మహ్మద్ సిరాజ్‌ను జట్టులో చేర్చుతూ బిసిసిఐ నిర్ణయం తీసుకుంది. ఆసీస్‌తో వన్డే సిరీస్‌కు సంబంధించి జట్టును గతంలోనే ప్రకటించినప్పటికీ, కొన్ని మార్పులు చేయాల్సి రావడంతో సిరాజ్‌ను ఎంపిక చేసింది. ఆసీస్ వన్డే సిరీస్‌తో పాటు న్యూజిలాండ్ పర్యటనకు బూమ్రాకు విశ్రాంతి ఇస్తున్నట్లు మంగళవారం బిసిసిఐ ఆ ప్రకటనలో పేర్కొంది.



భారత్‌లోనే ఐపిఎల్

న్యూఢిల్లీ : ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపిఎల్) 12వ ఎడిషన్ మార్చిలో భారత్‌లోనే జరగనుంది. ఈ ఏడాదిలో ఎన్నికల నేపథ్యంలో వేదికలు మార్చే విషయం పరిశీలించిన బిసిసిఐ టోర్నీని ఒక నెల ముందుకు జరిపి ఇక్కడే నిర్వహించేందుకు సిద్ధమైంది. ఈ విషయాన్ని సుప్రీం కోర్టు నియమిత క్రికెట్ పాలకుల కమిటీ(సిఓఏ) ధ్రువీకరించింది. మార్చి 23న ఐపీఎల్ ప్రారంభమవుతుందని కమిటీ వెల్లడించింది.

లీగ్ దశకు నాలుగు జట్లు

జెఎన్‌టియు కాకినాడ సెంట్రల్ జోన్ పుట్‌బాల్ టోర్నీ

(ప్రజాశక్తి-స్పోర్ట్స్ డెస్క్)

మూడ్రోజుల పాటు నిర్వహిస్తున్న జెఎన్‌టియు కాకినాడ సెంట్రల్ జోన్ పుట్‌బాల్ పోటీల్లో నాలుగు జట్లు లీగ్ దశకు చేరుకున్నాయి. ఈ పోటీల్లో మొత్తం 17 జట్లు నాకౌట్ దశలో పోటీపడగా నాలుగు జట్లు లీగ్ దశకు చేరుకున్నాయి. ఫుట్‌బాల్ పోటీలు మైలవరంలోని లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో సోమవారం ప్రారంభ మయ్యాయి. పోటీలను కళాశాల మేనేజింగ్ ట్రస్టీ లకిరెడ్డి హలిమిరెడ్డి, ఇన్‌ఫ్రా డైరెక్టర్ తిమ్మారెడ్డి ప్రారంభించారు. లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల, రఘు ఇంజినీరింగ్ కళాశాల, గ్రంధి మల్లికార్జునరావు ఇంజినీరింగ్ కళాశాలల జట్లు మంగళవారం లీగ్ దశలో తలపడ్డాయి. లీగ్ మ్యాచ్‌లలో జిఎమ్ఆర్ఐటి జట్టు ఆటగాళ్లు పి.సతీష్ 8, కె.వెంకటేష్ 5, సి.జ్ఞానేశ్వరెడ్డి 5 గోల్స్ చేసి జట్టును ముందంజలో నిలిపారు. ఎల్‌బిఆర్‌సిఇ జట్టు ఆటగాళ్లు ప్రణీత్, మదన్ చేరో రెండు గోల్స్ చేసి జిఎమ్ఆర్ఐటి జట్టుకు పోటీగా నిలిచారు. ఇప్పటి వరకు నాలుగు లీగ్ మ్యాచ్‌లు జరగ్గా బుధవారం జరగే ఆఖరి పోటీలతో విజేతలెవరో తేలనుంది.

సమస్య పరిష్కరించేవరకు ఎన్టీఆర్ వైద్యసేవల్ని కొనసాగించం

- ఆశా ప్రతినిధులు వెల్లడి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రభుత్వం సమస్య పరిష్కరించే వరకు ఎన్టీఆర్ వైద్యసేవల్ని కొనసాగించేదిలేదని ఏపి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల సంఘం (ఆశా) ప్రతినిధులు స్పష్టం చేశారు. ప్రభుత్వం చెబుతున్నప్పటికీ తమ ఖాతాల్లోకి నగదు జమకాలేదని వెల్లడించారు. వైద్యసేవల కొనసాగింపుపై మంగళవారం విజయవాడలో అన్ని జిల్లాల ఆశా ప్రతినిధులు సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా ఆశా రాష్ట్ర అధ్యక్షులు వి. మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం చెల్లించామని చెబుతున్న సొమ్ములో కనీసం పదోవంతు అయినా తమకు రాలేదన్నారు. అయితే మంత్రి ఫరూక్ తమ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ప్రస్తుతానికి అత్యవసర సేవలు కొనసాగిస్తా మని ఆయన స్పష్టం చేశారు. సమస్య పరిష్కరించేవరకు ఎన్టీఆర్ వైద్యసేవల కింద కొత్త కేసులకు సేవలు అందించేదిలేదన్నారు. ఈనెల 12న మంత్రి ఫరూక్ సమక్షంలో సమావేశం అనంతరం తమ ఆందోళనపై కార్యచరణ ప్రకటిస్తామన్నారు.

టిడిపితో పొత్తుపై అధిష్టానందే తుది నిర్ణయం

- ఎపిపిసిసి అధ్యక్షులు రఘువీరారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వచ్చే సాధారణ ఎన్నికల్లో పొత్తులపై అధిష్టానందే తుది నిర్ణయమనిని ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఎన్. రఘువీరారెడ్డి చెప్పారు. తెలంగాణా తరహాలో ఏపీలోనూ టిడిపితో పొత్తు ఉంటుందా అని మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చిన ఆయన...పొత్తుల అంశం అధిష్టానం చూస్తుందన్నారు. టిడిపితో పొత్తు వల్ల రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి కలిగే లాభ-నష్టాలపై నివేదికను అధిష్టానంకు అందించామన్నారు. అధిష్టానం సూచన మేరకే పొత్తులుంటాయని స్పష్టం చేశారు. అగ్రవర్ణాల పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామ న్నారు. ఎన్నికల సమయంలో హడావుడి చేయ డంలో నిజాయితీ కనిపించడం లేదని, అధికా రంలోకొచ్చిన వెంటనే తీసుకొచ్చి ఉంటే చాలా మందికి మేలు జరిగేదని అభిప్రాయపడ్డారు.

ఆలిండియా రేడియో మూసివేత నిర్ణయం గర్హనీయం

ఎపిడబ్ల్యూజెఎఫ్, ఎన్ఎజె

ప్రజాశక్తి - అమరావతిబ్యూరో

ఆలిండియా రేడియో ఛానల్, వివిధ కేంద్రాల్లో ఉన్న ప్రాంతీయ శిక్షణా అకాడమీలను మూసివేయాలని ప్రసారభారతి తీసుకున్న నిర్ణయం పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (ఎపిడబ్ల్యూజెఎఫ్), నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్ట్స్(ఎన్ఎజె)లు తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేశాయి. ఈ మేరకు ఎపిడబ్ల్యూజెఎఫ్ ప్రధాన కార్యదర్శి జి.ఆంజనే యులు, ఎన్ఎజె సెక్రటరీ జనరల్ ఎమ్.కోటేశ్వరరావులు సంయుక్తంగా మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మీడియా వేగంగా విస్తరిస్తుంటే, నేటి ఆధునిక కాలంలో మార్పులను అందిపుచ్చుకుంటూ దానికి అనుగుణంగా ఆధునీకరించాల్సిందిపోయి, ఉన్నవాటిని మూసివేయాలని తీసుకున్న నిర్ణయం సరైందికాదని వారు పేర్కొన్నారు. ఖర్చులు తగ్గించుకునే పేరుతో మూడు దశాబ్దాలుగా నడుస్తున్న జాతీయ ఛానెల్‌ను, హైదరాబాద్, అహ్మదాబాద్, లక్నో, షిల్లాంగ్, తిరువనంత పురాల్లోని ప్రాంతీయ అకాడమీలను మూసివేయాలను కోవటం వల్ల చేకూరే ప్రయోజనాల కంటే నష్టాలే ఎక్కువని తెలిపారు.

- సమాన ఉపాధి అవకాశాలే లక్ష్యం
- జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వ్యవస్థని మార్చాలన్న లక్ష్యంతో వచ్చిన వారిని ఒక క్రమపద్ధతిలో అనుసంధానం చేసి వారిలో ఉన్న కసిని వెలికితీయాలని, అది సమాజానికి ఉపయోగపడేలా తయారు చేయాలన్నదే జనసేన లక్ష్యమని పవన్ కళ్యాణ్ అన్నారు. 2001 నుంచే ప్రజలు మార్పు కోరుకోవడాన్ని గమనించానన్నారు. ప్రస్తుత రాజకీయ వ్యవస్థపై విసుగుతో ప్రజలు జనసేన వైపు చూస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుత రాజకీయాలపై ప్రజలకు ఉన్న వ్యతిరేకతే జనసేనకు పెరుగుతున్న ఆదరణకు కారణమన్నారు. పాలకులు అందుబాటులో ఉన్న వనరుల్ని అందరికీ ఆమోదయోగ్యమైన రీతిలో పంచితే ఇటువంటి సమస్యలు ఉండవన్నారు. స్థానిక పరిస్థితులను అర్థం చేసుకోకుండా రాజకీయాలు చేయలేమని, కులాల కాన్సెప్ట్‌తో అసలు నడపలేమని



స్పష్టం చేశారు. 2003 నుంచే రాజకీయాల కోసం పూర్తి స్థాయిలో సంసిద్ధమయ్యానని, 60 శాతం కొత్తవారికి, 20 శాతం భావజాల బలం, మరో 20 శాతం విలువలతో కూడిన నాయకులకు వచ్చే ఎన్నికల్లో అవకాశమివ్వాలని భావిస్తున్నట్లు చెప్పారు. సంక్రాంతిలోపు స్వల్పకాలిక కమిటీలు వేసి బాధ్యతలు అప్పగిస్తామని, అవసరం అనుకుంటే మధ్యలో మార్పులు చేస్తామని చెప్పారు. కర్నూలు జిల్లాలో ప్రజలు కొన్ని కుటంబాల మధ్య నలిగిపోతున్నారన్నారు. అన్ని స్థానాల్లో పోటీపై తనకు స్పష్టత ఉందన్నారు. స్థానికంగా తనలా ఆలోచించే నాయకుల్ని తయారు చేస్తానన్నారు. ఎన్నో వ్యతిరేక శక్తుల మధ్య పోరాటం చేస్తున్నామని, వచ్చే ఎన్నికలు మొదటి పోరాటం మాత్రమేనని అన్నారు. భావజాలం ఉన్న వ్యక్తికి బాంబులు వేసినా చలించనంత బలం ఉంటుందన్నారు. అటువంటి బలం తన వద్ద ఉందని, లక్ష్యం కోసం పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు.

టిడిపి, వైసిపిలకు ఎలాంటి సిద్ధాంతాల్లేవని, జనసేన పార్టీకి మాత్రం బలమైన సిద్ధాంతాలున్నాయని జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ అన్నారు. అందరికీ సమాన రీతిలో ఉపాధి అవకాశాలు కల్పించాలన్నదే జనసేన లక్ష్యమన్నారు. ఆస్తులు పెంచుకోవడంలో నాయకులకు ఉన్న శ్రద్ధ యువతకు ఉపాధి కల్పించడంలో లేదన్నారు. సిద్ధాంత బలం లేకుండా నాయకుల బలంపై ఆధారపడి నడిచే పార్టీలు ఎక్కువ కాలం మనుగడ సాగించవన్నారు. విజయవాడలోని జనసేన రాష్ట్ర కార్యాలయంలో కర్నూలు జిల్లా నాయకులతో పవన్ సమీక్షా సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు.

జగన్ కేసు విజయవాడ కోర్టుకు బదిలీ..!

- నిందితుడు శ్రీనివాసరావును అప్పగించండి
- విశాఖ పోలీసుల విచారణ ఫైళ్లనూ ఇప్పించండి
- కోర్టులో మెమో దాఖలు చేసిన ఎన్ఐఎ

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో, విశాఖ లీగల్

తెలుగు రాష్ట్రాలతో పాటు జాతీయ స్థాయిలో కలకలం సృష్టించిన వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హత్యాయత్నం కేసు మంగళవారం కీలక మలుపు తిరిగింది. ఇటీవల ఆ కేసుని కేంద్ర హోంశాఖ జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ)కి అప్పగించిన సంగతి తెలిసిందే. వెంటనే రంగంలోకి దిగిన ఎన్ఐఎ అధికారులు విశాఖ చేరుకుని విచారణ మొదలు పెట్టారు. ఇందులో భాగంగానే విశాఖ సిట్ అధికారి నాగేశ్వరరావును కలిసి వివరాలు అడిగితే ప్రభుత్వం ఆదేశాలు లేకుండా వివరాలను ఇవ్వలేమని ఆయన ఎన్ఐఎ సంస్థకు తెగేసి చెప్పేశారు. దీంతో వేచి చూసిన ఆ సంస్థ సోమవారం నిందితుడు శ్రీనివాసరావు బెయిల్ పిటిషన్‌పై వాదనలు జరిగిన సమయంలో కోర్టు వద్ద మరోసారి విశాఖ పోలీసులను ఎన్ఐఎ అధికారులు రికార్డులు ఇవ్వాలని కోరగా పోలీసులు నిరాకరించారు.

దీంతో మంగళవారం ఎన్ఐఎ అధికారులు విజయవాడలోని మెట్రోపాలిటిన్ సెషన్స్ జడ్జి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సీఆర్డీసీ సెక్షన్ 41(బి) ప్రకారం నిందితుడిని తమకు అప్పగించాలని, అలాగే స్థానిక పోలీసులు ఇప్పటివరకూ చేపట్టిన విచారణకు సంబంధించిన అన్ని ఫైళ్లనూ తమకు ఇవ్వాలని న్యాయస్థానాన్ని కోరారు. ప్రస్తుతం ఈ పిటీషన్ న్యాయస్థానంలో విచారణలో ఉంది. ఇదిలా ఉండగా స్థానిక పోలీసులు సహకరించకపోవడంతో ఇప్పటికే ఎన్ఐఎ అధికారులు విజయవాడలోని ఎన్ఐఎ ప్రత్యేక కోర్టులో కూడా ఒక పిటీషన్ వేశారు. ఈ మేరకు విజయవాడలోని ఎన్ఐఎ ప్రత్యేక న్యాయస్థానం కమ్ మెట్రోపాలిటిన్ సెషన్స్ జడ్జి విశాఖలోని 7వ ఎంఎంపి కోర్టుకు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. దీంతో కేసుని బుధవారం విజయవాడకు పంపించే అవకాశముంది. ఇకపై కేసు విచారణ విజయవాడలో జరగనుంది.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68